www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



మన అమ్మాయిలు 'బంగారం'

ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం

మెరిసిన పీవీ సింధు, అన్‌మోల్, గాయత్రి జంట

11



ఇదీ.. గెలుపంటే!

యశస్వి డబుల్ ధమాకా.. జడేజా 5 వికెట్లు

434 పరుగులతో భారత్ రికార్డు విజయం

ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో 2-1తో ఆధిక్యం

సోమవారం | 19-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 305

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: దశమి ఉ. 8.51 తదుపరి ఏకాదశి; నక్షత్రం: మృగశిర ఉ. 10.34 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.7.33-9.15; దుర్ముహూర్తం: మ.12.53-1.39, మ.3.11-3.57; అమృతఘడియలు: రా.1.32-3.15; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.44; సూర్యాస్తమయం: 6.15

హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజన్ 2050

తెలంగాణ అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్

అర్బన్, సెమీ అర్బన్, రూరల్ విభాగాలుగా ముందుకు

హైదరాబాద్ అభివృద్ధికి బాబు, వైఎస్, కేసీఆర్ కృషి

ఈ సంప్రదాయం కొనసాగిస్తూనే మరింత ఉన్నతంగా..

మేం స్వయంప్రకటిత మేధావులం కాదు..

అలా వ్యవహరిస్తే అది మేడిగడ్డ బ్యారేజీ చందమే!

ఫార్మా సిటీ కాదు.. ఫార్మా విలేజీలు నిర్మిస్తాం

పాలనను అర్థం చేసుకోవడానికి కొంత టైం కావాలి

సొంత పనుల కోసమైతే నన్నెవరూ కలవొద్దు: రేవంత్

నానక్‌రామ్‌గూడలో స్టేట్ ఫైర్ సర్వీసెస్ హెడ్ క్వార్టర్స్ భవనాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి



తెలంగాణ స్టేట్ ఫైర్ సర్వీసెస్ హెడ్ క్వార్టర్స్ భవనాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, సనత్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వాలు నగరాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్లు రూపొందించాయని, తాము తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. విజన్-2050 దిశగా తమ ప్రభుత్వం ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అర్బన్, సెమీ అర్బన్, రూరల్ విభాగాలుగా తీసుకుని అభివృద్ధి చేస్తామని చెప్పారు. హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలో రూ.17 కోట్లతో నిర్మించిన తెలంగాణ స్టేట్ ఫైర్ సర్వీసెస్ హెడ్ క్వార్టర్స్ భవనాన్ని ఆదివారం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే సనత్‌నగర్ పారిశ్రామిక ప్రాంతంలో కొత్తగా నిర్మించిన ఫైర్ స్టేషన్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరం ప్రపంచ నగరాలతో పోటీ పడుతోందని.. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, పాలకులు మారినా, పాత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తూ గత 30 ఏళ్లుగా నగరాన్ని అభివృద్ధి చేస్తున్నాయని

మిగతా 13వ పేజీలో...

పరిపాలనను అర్థం చేసుకోవడానికి నాకు కొంత సమయం కావాలి. ఆలోచించకుండా ఇష్టారాజ్యంగా సంతకాలు చేస్తే శివ బాలకృష్ణ (హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్) మాదిరిగా అక్కడ (జైల్లో) కూర్చోవాల్సి వస్తుంది. ఆలోచించి నిర్ణయం తీసుకోవడమే మా విధానం. నిర్ణయం తీసుకునే ముందు 100 సార్లు ఆలోచించి, నిపుణుల సలహాలు తీసుకుంటా. సొంత పనుల కోసమైతే నన్నెవరూ కలవాల్సిన అవసరం లేదు. ఏదైనా రాష్ట్రానికి అవసరమైన పనుల కోసమైతే నిరభ్యంతరంగా కలవొచ్చు.

\- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గెలుపు గుర్రాలపై సర్వే



లోక్‌సభ అభ్యర్థుల ఎంపికలో

సామాజిక సమతూకంపై కాంగ్రెస్ దృష్టి

అసెంబ్లీ నియోజకవర్గాల్లో సునీల్ టీమ్ సర్వే

ప్రధాన పార్టీలు, ఆశావహుల బలాబలాలపై ఆరా

బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు కుదిరితే ఫలితాలు

ఎలా ఉంటాయన్న అంశాలపైనా పరిశీలన

ఇంటెలిజెన్స్ ద్వారానూ సమాచార సేకరణ

అధిష్ఠానం తరఫున డీకే బృందాలూ రంగంలోకి

14 సీట్లు గెలవాలన్న పట్టుదలతో కాంగ్రెస్

ఈ వారంలో ఏఐసీసీ స్ర్కీనింగ్ కమిటీ భేటీ!

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ముందు అభ్యర్థుల ఎంపికలో వ్యూహాత్మకంగా వ్యవహరించిన కాంగ్రెస్.. లోక్‌సభ ఎన్నికల్లోనూ మరింత బలాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న హస్తం పార్టీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమతూకాన్ని పాటిస్తూ గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ క్రమంలో టీపీసీసీ తరఫున ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు బృందం ఆధ్వర్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా విస్తృత సర్వేలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఇంటెలిజెన్స్ ద్వారానూ సమాచార సేకరణ జరుగుతోంది. మరోవైపు పార్టీ అధిష్ఠానమూ.. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆధ్వర్యంలో ప్రైవేటు ఏజెన్సీలతో సర్వేలు చేయిస్తోంది. అయితే ఈ సర్వేల్లో కేవలం టికెట్ కోసం పోటీ పడుతున్న ఆశావహుల్లో ఎవరు మెరుగైన అభ్యర్థి అన్న అంశానికే పరిమితం కాకుండా.. వివిధ సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని అభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ

మిగతా 13వ పేజీలో...



మళ్లీ మనమే అధికారంలోకి వస్తాం..

ఇది ప్రపంచ దేశాలకూ తెలుసు!

అందుకే ఆయా దేశాలకు రావాలని పిలుపు

బీజేపీ జాతీయ సదస్సులో ప్రధాని మోదీ

100 రోజులు అత్యంత కీలకమని వెల్లడి

ప్రతి ఓటరునూ కలవాలని శ్రేణులకు పిలుపు

మళ్లీ అధికారం అనుభవించాలని లేదు

కానీ, నేనింట్లో కూర్చుంటే ప్రజలకు ఇళ్లెలా?

కాంగ్రెస్ నుంచి పెద్దలు, పిన్నలను కాపాడాలి

ఆ పార్టీకి దేశంపై దూరదృష్టి లేదు: ప్రధాని

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): "ప్రపంచ దేశాలకు కూడా తెలుసు.. మోదీ మరోసారి అధికారంలోకి వస్తారని. ఈ ఏడాది సెప్టెంబరు వరకు మా దేశానికి రావాలంటే.. మా దేశానికి రావాలని ప్రపంచ దేశాలు కోరుతున్నాయి. దీనర్థం.. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని వారు అచంచల విశ్వాసంతో ఉండబట్టే. అధికారం కోసం మూడోసారి రావాలని కోరుకోవడం లేదు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం కోసమే కోరుకుంటున్నా. ఛత్రపతి శివాజీ మహరాజ్ మాదిరిగా అవిశ్రాంతంగా పనిచేయాలని భావిస్తున్నా" అని ప్రధానమంత్రి

మిగతా 2వ పేజీలో...

నడ్డా పదవీ కాలం పొడిగింపు

జూన్ వరకు ఆయనకే బీజేపీ సారథ్యం



దర్జాగా కబ్జా

ఎమ్మెల్యే కాలనీలో హెచ్ఎండీఏ స్థలాలు స్వాహా.. మాజీ సీఎం ఇంటిని ఆనుకొని భారీ ఆక్రమణ

బహిరంగ మార్కెట్‌లో దాని విలువ 30కోట్లు.. ప్రహరీ నిర్మించి, చుట్టూ సీసీ కెమెరాలతో నిఘా

ఖాళీ స్థలానికి ఇంటి నంబర్ ఇచ్చిన జీహెచ్ఎంసీ.. కబ్జాను పట్టించుకోని హెచ్ఎండీఏ

అది బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీ. మాజీ సీఎం, మాజీ మంత్రులు, తాజామంత్రులు, ఎమ్మెల్యేల ఇలాకా. అలాంటి ప్రాంతంలోనే కబ్జాదారులు ఖాళీ స్థలాలపై కన్నేశారు. మాజీ సీఎం ఇంటిని అనుకొని ఉన్న హెచ్ఎండీఏ ప్లాట్లను దర్జాగా ఆక్రమించుకున్నారు. వాటిచుట్టూ ప్రహరీ నిర్మించి.. గేటు పెట్టారు. కాపలాదారులను నియమించి.. సీసీ కెమెరాలతో నిఘా కూడా పెట్టారు. ఖాళీగా ఉన్న ఆ ప్లాట్లకు జీహెచ్ఎంసీ ఇంటి నంబరు కేటాయించగా.. కబ్జాదారులు కొన్నేళ్లుగా ఆస్తిపన్ను సైతం చెల్లించేస్తుండడం గమనార్హం. ఇంత జరుగుతున్నా.. పట్టించుకోకుండా హెచ్ఎండీఏ మొద్దు నిద్రపోతోంది.

(ఆంధ్రజ్యోతి నిఘా విభాగం)

హైదరాబాద్ మహానగరం నడిబొడ్డున షేక్‌పేట రెవెన్యూ పరిధిలోని సర్వే నం.5లో ప్రభుత్వ భూమిని 1995 కంటే ముందు అప్పటి ప్రభుత్వం హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హుడా)కి అప్పగించింది. అప్పటి అవసరాల రీత్యా సర్వే నంబరు 5లోని సుమారు 53 ఎకరాల్లో హుడా హైట్స్ పేరుతో లే-అవుట్ చేశారు. ఇదీ ప్రస్తుతం బంజారాహిల్స్ పరిధిలోని ఎమ్మెల్యే కాలనీలో ఉంది. అప్పటికే ఆ ప్రాంతంలో ఎమ్మెల్యేలకు స్థలాలివ్వడం.. అది వీవీఐపీలు ఉండే ఏరియాగా మారడంతో హుడా హైట్స్‌లోని స్థలాలను విక్రయించడానికి 2002లో నోటిఫికేషన్ ఇచ్చి ప్లాట్లను బహిరంగ వేలం వేశారు. ఆ వేలంలో ప్లాట్లన్నీ ఇట్టే అమ్ముడై హెచ్ఎండీఏకి భారీగా ఆదాయం వచ్చింది. అయితే ఆ వేలంలో.. ఒక్కొక్కటీ 450 గజాలుండే 95, 96 నంబర్ ప్లాట్లను కొనుగోలు చేసిన వ్యక్తులు సకాలంలో డబ్బులు చెల్లించలేదు. దీంతో ఆ రెండు

మిగతా 12వ పేజీలో...

అంతరిక్షంలోకి అణ్వాయుధం!



ఆ దిశగా అడుగులు వేస్తున్న రష్యా

కక్ష్యలోకి పంపి అవసరమైనప్పుడు ప్రయోగం

పేల్చితే ఐఎస్ఎస్ కూడా ధ్వంసమే

అణుశక్తే ఇంధనంగా రాడార్ జామర్లు

శత్రుదేశ ఉపగ్రహాల సమూహాన్ని ఒకేసారి

ఎదుర్కొనే సరికొత్త మిలిటరీ వ్యూహం

అమెరికా ఎంపీ వెల్లడి నేపథ్యంలో తీవ్ర చర్చ

ఇదంతా ఉక్రెయిన్‌కు సాయం కోసం

అమెరికా చేస్తున్న కుట్ర: రష్యా

2

అగ్రరాజ్యాలు అమెరికా-రష్యా మధ్య ప్రచ్ఛన్నయుద్ధాన్ని ప్రపంచం కొన్ని దశాబ్దాలపాటు ఊపిరి బిగబట్టుకొని చూసింది. అయితే, సోవియట్ రష్యా ముక్కలు చెక్కలై ప్రపంచ రాజకీయాల్లో తన ప్రాభవాన్ని కోల్పోయిన తర్వాత ప్రచ్ఛన్నయుద్ధం అనే మాట పాతబడిపోయింది. అయినప్పటికీ, ఆయుధాల రేసులో రష్యా వెనకబడిపోలేదని, అమెరికాకు ఇప్పటికీ ఝలక్ ఇచ్చే స్థాయిలోనే ఉందని తాజాగా మరోసారి రుజువైంది. అంతరిక్షంలోకి రష్యా ఏకంగా ఓ అణ్వాయుధాన్నే పంపించాలని చూస్తోందంటూ అమెరికా నిఘావిభాగం కమిటీ (మన పార్లమెంటరీ స్థాయీసంఘం వంటిది) చైర్మన్, ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ ఎంపీ మైక్ టర్నర్ వెల్లడించడం ఆ దేశంలోనేగాక ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారింది. దీనిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది.



వైద్యశాఖ అధికారులపై ఏసీబీ నజర్

అవినీతిపై పెద్ద ఎత్తున ఫిర్యాదుల ఫలితమే

సుదీర్ఘంగా ఒకేచోట పాతుకుపోయిన అధికారులపైనే ఎక్కువ

కొందరు డీఎంహెచ్‌వోలకు హైదరాబాద్ శివార్లో ఫాంహౌస్‌లు

ఉత్తర తెలంగాణకు చెందిన ఓ అధికారికి పెద్ద హోటల్!

డిప్యుటేషనైనా, రిలీవ్ ఆర్డరైనా టేబుల్‌పై డబ్బుల కవర్ పెడితేనే

ఇద్దరు ఉన్నతాధికారుల తీరుపై ఓ మహిళా ఉద్యోగి ఆవేదన

తోటి ఉద్యోగికి కాల్ చేసిన ఆడియో వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని డీఎంహెచ్‌వో కార్యాలయాలు, మెడికల్ కాలేజీల అనుబంధ ఆస్పత్రులు అవినీతికి అడ్డాలుగా మారుతున్నాయంటూ అక్కడి అధికారులపై ఏసీబీకి పెద్ద ఎత్తున ఫిర్యాదులొస్తున్నాయి. ఫలితంగా వైద్యారోగ్యశాఖపై ఏసీబీ ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయంలోని వైద్యులు, నర్సింగ్ సెక్షన్లపై ఎక్కువగా ఫిర్యాదులొచ్చినట్లు సమాచారం ఇప్పటికే వైద్యారోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలోని కీలక అధికారులతో పాటు కొన్ని జిల్లాల డీఎమ్‌హెచ్‌వోలతో పాటు ఆయా ఆఫీస్‌లోని

మిగతా 14వ పేజీలో...

ప్రైవేటు వర్సిటీలకు ముకుతాడు!

'ఇంజనీరింగ్'లో ఇష్టారాజ్యం కుదరదు

ఈ ఏడాది కన్వీనర్ ద్వారానే సీట్ల భర్తీ!

గుర్తింపు లేని వర్సిటీల అడ్మిషన్లు రద్దు

రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్త చర్యలు

ప్రైవేట్ వర్సిటీల్లో రిజర్వేషన్ల అమలు?

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీల పేరిట ఇంజనీరింగ్ కోర్సుల్లో ఇష్టానుసారంగా జరుగుతున్న అడ్మిషన్లను అడ్డుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ఏడాది కొన్ని కాలేజీల యాజమాన్యాలు యూనివర్సిటీలుగా పేర్కొంటూ చేపట్టిన అడ్మిషన్లలో గందరగోళం జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మళ్లీ అలాంటి ఉదంతాలు జరగకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా

మిగతా 12వ పేజీలో...



డ్వాక్రా సంఘాలకు మళ్లీ వడ్డీలేని రుణాలు

ఐటీడీఏలకు పూర్వవైభవం

ఆన్‌లైన్ ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

ఖమ్మం జిల్లాకు ఐదు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు

భద్రాచలంలో ఐటీడీఏ సమావేశంలో భట్టి

భద్రాచలం, ఫిబ్రవరి 18: డ్వాక్రా సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాలను పునఃప్రారంభించనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలను ఇచ్చిందని, స్వరాష్ట్రంలో రెండుసార్లు అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ రుణాలను ఇవ్వలేదని ఆరోపించారు. భద్రాచలంలో ఆదివారం ఐటీడీఏ

మిగతా 13వ పేజీలో...

మేడారానికి గాలిమోటార్లోనూ..

21 నుంచి 25వ తేదీ దాకా హెలికాప్టర్ సేవలు

తుంబీ ఏవియేషన్, రాష్ట్ర సర్కారు సహకారంతో హెలిటాక్సీ సంస్థ ఏర్పాటు

14


రూ.95,833తో హైదరాబాద్ నుంచి వెళ్లిరావొచ్చు

హన్మకొండ నుంచైతే రూ.28,999 టికెట్





నవీన్ పట్నాయక్



యోగి ఆదిత్యనాథ్

ఉత్తమ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్!

ప్రజాదరణలో ఒడిసా సీఎం టాప్

రెండో స్థానంలో యోగి ఆదిత్యనాథ్

ఆ తర్వాత హిమంత బిశ్వ, భూపేంద్ర

ఐదోస్థానంలో త్రిపుర ముఖ్యమంత్రి

'ఇండియా టుడే' సర్వేలో వెల్లడి

2

నవీన్ పట్నాయక్ పాపులర్ సీఎం!

» రెండో స్థానంలో యోగి.. 'ఇండియా టుడే' సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ఒడిసా సీఎం నవీన్ పట్నాయక్ దేశంలోనే అత్యుత్తమ సీఎంగా ఖ్యాతి సంపాదించారు. ప్రజాదరణ రేటింగ్‌లో ఆయన ఏకంగా 52.7 శాతం సాధించారు. 51.3 శాతం ప్రజాదరణతో యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రెండో స్థానంలో నిలిచినట్లు తాజా 'ఇండియా టుడే' మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో తేలింది. తర్వాతి ర్యాంకుల్లో అసోం సీఎం హిమంత బిశ్వశర్మ(48.6%-3), గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ (42.6%), త్రిపుర సీఎం మాణిక్ సాహా (41.4%) ఉన్నారు. బిజూ జనతాదళ్ అధినేత కూడా అయిన నవీన్.. ఒడిసాకు 22 ఏళ్లుగా అప్రతిహతంగా సీఎంగా కొనసాగుతున్నారు. ఇక సాహా కూడా ప్రగతిశీలకుడిగా పేరుపొందారు. అంకిత భావం, నిరాడంబరత, ఆయన సారథ్యంలో సాధించిన రాష్ట్రాభివృద్ధి ఆయనపై అభిమానం పెరగడానికి కారణాలని సర్వే పేర్కొంది.

బీజేపీలోకి వెళ్తే.. చెప్తాగా: కమల్‌నాథ్

న్యూఢిల్లీ, భోపాల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తాను బీజేపీలో చేరేటట్లయితే..మీడియాకు తెలియజేస్తానని కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ పునరుద్ఘాటించారు. బీజేపీలో చేరే విషయమై తాను ఎవరితోనూ మాట్లాడలేదన్నారు. మరోవైపు కమల్‌నాథ్ వర్గం ఎమ్మెల్యేలు ఆరుగురు ఆదివారం ఢిల్లీకి చేరుకొన్నారు. వారిలో చింద్వారా పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నారు. వారెవరూ ప్రస్తుతం ఫోన్‌కాల్స్‌కు స్పందించడం లేదు. మాజీ మంత్రి లఖన్ గంగోరియా కూడా వారితోపాటే ఢిల్లీలో మకాం వేసినట్టు కాంగ్రెస్‌లోని కొందరు చెబుతున్నారు. అదే ప్రాంతానికి చెందిన మరో ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా ఢిల్లీ వెళ్లనున్నట్టు కమల్‌నాథ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. కాగా, కమల్‌నాథ్ బీజేపీలోకి వెళ్లడం అంతా 'మీడియా సృష్టి' అని మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు జితు పట్వారీ, దిగ్విజయ్ సింగ్ తోసిపుచ్చారు.

బీజేపీలో చేరను, కాంగ్రెస్‌తో సంబంధాల్లేవు.!

» కర్ణాటక మాజీమంత్రి గాలి జనార్దనరెడ్డి

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో ఒంటరిగానే ఉంటానని, మళ్లీ బీజేపీలో చేరబోనని కర్ణాటక రాష్ట్రం కొప్పళ జిల్లా గంగావతి ఎమ్మెల్యే, మాజీమంత్రి గాలి జనార్దనరెడ్డి స్పష్టం చేశారు. కొప్పళలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో చేరడమనేది కలలో కూడా జరగదన్నారు. కాంగ్రెస్‌తో సంబంధాలు ఎప్పటికీ ఉండవన్నారు. ప్రధాని మోదీ పాలన అద్భుతమని కొనియాడారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గాలి జనార్దనరెడ్డి మరోసారి బీజేపీలోకి చేరుతారనే ప్రచారం ఇటీవల జోరుగా సాగింది. సీఎం సిద్దరామయ్య శుక్రవారం బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా బీజేపీ, జేడీఎస్ బాయ్‌కాట్ చేసినా జనార్దనరెడ్డి సభలోనే ఉన్నారు. తర్వాత సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌తో కలిసి ఫొటోలు దిగారు. దీంతో ఆయన కాంగ్రెస్‌వైపు వెళ్తారనే ప్రచారం సాగింది.

పంజాబ్‌లో ఎవరికి వారే.. ఒంటరి పోరే..!

» కాంగ్రెస్, ఆప్ మధ్య అవగాహనా ఒప్పందం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: పంజాబ్‌లో ఎవరికివారుగా సొంతగా పోటీచేయాలని కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పరస్పర అవగాహనతో నిర్ణయం తీసుకున్నట్లు ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వెల్లడించారు. ఢిల్లీలో ఆ పార్టీతో సీట్ల సర్దుబాటు చర్చలు తుది దశలో ఉన్నాయన్నారు. ఆయన ఆదివారమిక్కడ ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ నివాసానికి భోజనానికి వెళ్లారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పంజాబ్‌లో ఉభయ పార్టీల నడుమ ఎలాంటి శత్రుత్వమూ లేదన్నారు. ఢిల్లీలో పొత్తు పెట్టుకోకుంటే బీజేపీ ఏడు ఎంపీ స్థానాల్లోనూ విజయం సాధిస్తుందని చెప్పారు. గత ఎన్నికల్లోనే గాక 2014లోనూ ఆ పార్టీ ఏడింటినీ గెలుచుకున్న సంగతి తెలిసిందే.

ఝార్ఖండ్‌లో కులగణనకు నిర్ణయం

రాంచీ, ఫిబ్రవరి 18: ఝార్ఖండ్‌లో కులగణన జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఈ విషయమై ప్రామాణిక నిర్వహణ విధానం (స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్-ఎస్ఓపీ) ముసాయిదాను రూపొందించాలని సీఎం చంపయ్ సోరేన్ రాష్ట్ర సిబ్బంది వ్యవహారాల శాఖను ఆదేశించారు. ఎంత ఎక్కువ జనాభా ఉంటే అంత ఎక్కువ వాటాకు రంగం సిద్ధమవుతోందంటూ ఎక్స్‌లో ఆయన ట్వీట్ చేశారు. పొరుగున ఉన్న బిహార్ తరహాలోనే ఇక్కడా కులాల జనాభా లెక్కల సేకరణ జరగనుందని ముఖ్యమంత్రికి ప్రిన్సిపల్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న వినయ్ కుమార్ చౌబే ఆదివారం వెల్లడించారు.

ఓఎంఆర్ షీట్లతో సీయూఈటీ-యూజీ!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: దేశ వ్యాప్తంగా యూనివర్సిటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఉమ్మడి విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్ష(సీయూఈటీ)-యూజీలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) కీలక మార్పులు చేసే అవకాశం ఉంది. కంప్యూటర్ ఆధారిత విధానం నుంచి ఈ ఏడాది హైబ్రిడ్ విధానానికి మారడంతో పాటు విద్యార్థి ఎంచుకొనే సబ్జెక్టుల సంఖ్యను 10 నుంచి 6కు పరిమితం చేయాలని నిర్ణయించింది. అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్లు వచ్చిన సబ్జెక్టులకు నీట్ తరహాలో ఓఎంఆర్ షీట్లు ఉపయోగించి పెన్, పేపర్ విధానంలో పరీక్షలు నిర్వహించనుంది. తద్వారా దేశ వ్యాప్తంగా అన్ని ప్రధాన సబ్జెక్టులకు ఒకేరోజు పరీక్షలు పూర్తవుతాయని యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ వెల్లడించారు. తక్కువగా రిజిస్ట్రేషన్లు నమోదైన సబ్జెక్టులకు యథావిధిగా కంప్యూటర్ ఫార్మాట్‌లోనే పరీక్ష ఉంటుదని తెలిపారు.

పీవోకేలో భారీగా పాక్ టెలికామ్ టవర్లు

జమ్మూ, ఫిబ్రవరి 18: పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో (పీవోకే) ఇటీవల పెద్దఎత్తున టెలికామ్ టవర్ల ఏర్పాటుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సరిహద్దు వెంట ఉన్న పీవోకే భూభాగంలో ఈ టవర్ల నిర్మాణం కొనసాగుతోంది. అదీ భారత్‌లోకి చొరబాట్లు ఎక్కువగా చోటుచేసుకుంటున్న చోట్లే వీటి నిర్మాణం జరుగుతోంది. టెలికామ్ టవర్ల వల్ల ఉగ్రవాద సంస్థలు బలపడతాయని, చొరబాట్లు పెరుగుతాయని భారత సైనిక, నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఈ వర్గాల సమాచారం ప్రకారం... మన బలగాలు సరిహద్దుల్లో వాడే రేడియో సెట్లు, స్మార్ట్‌ఫోన్ల సంభాషణలను దొంగచాటుగా వినడానికి 'వైఎస్ఎమ్ఎస్' అనే అత్యున్నత టెక్నాలజీని ఉగ్రవాద సంస్థలు వినియోగిస్తున్నాయి. దక్షిణ జమ్మూ పరిధిలోని పీర్ పంజల్ రేంజ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడులు, కొన్ని చొరబాటు ఘటనలను విశ్లేషించినప్పుడు ఈ విషయం బయటపడింది.

21న నల్లజెండాలతో కిసాన్ మోర్చా నిరసన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఎంపీలకు వ్యతిరేకంగా 21న దేశవ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన చేపట్టనున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ప్రకటించింది. కార్మిక, ప్రజా సంఘాలు సంఘీభావం తెలపాలని కోరింది. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు పంజాబ్‌లోని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకుల ఇళ్ల ముందు ఘెరావ్ చేపడతామని ఎస్‌కేఎం తెలిపింది. ఇదిలా ఉండగా, రైతు నేతలతో కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, గోయల్, నిత్యానంద రాయ్ జరిపిన 4వ విడత చర్చలు కూడా అసంపూర్తిగా ముగిశాయి. మరోవైపు పంజాబ్-హరియాణా సరిహద్దుల్లో శంభూ, ఖనౌరీ పాయింట్ల వద్ద వేలాది మంది రైతుల నిరసన కొనసాగుతోంది.

ఒకే ఎన్‌క్లోజర్‌లో అక్బర్, సీత పేరున్న సింహాలు

» వీహెచ్‌పీ అభ్యంతరం.. సింహాల పేర్లు మార్చాలని డిమాండ్

కోల్‌కతా, ఫిబ్రవరి 18: పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి సఫారీ పార్కులో సీత అని పేరున్న ఆడ సింహాన్ని, అక్బర్ అని పేరున్న మగ సింహాన్ని ఒకే ఎన్‌క్లోజర్‌లో పెట్టడంపై విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది తమ మత విశ్వాసాలను దెబ్బతీయడమేనని ఆరోపించింది. వెంటనే ఆ సింహాల పేర్లను మార్చాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు కలకత్తా హైకోర్టు పరిధిలోని జల్‌పాయ్‌గురి సర్క్యూట్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై కోర్టు 20న విచారణ జరపనుంది. దీనిపై బెంగాల్ అటవీ శాఖ అధికారులు స్పందిస్తూ ఈ రెండు సింహాలను ఈ నెల 13న త్రిపుర నుంచి తీసుకొచ్చామని చెప్పారు. తాము వాటికి ఆ పేర్లు పెట్టలేదని, అప్పటికే పేర్లు ఉన్నాయని తెలిపారు.

ప్రపంచ దేశాలకూ తెలుసు

(మొదటి పేజీ తరువాయి)

నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచంలోని ప్రతిదేశం భారత్‌తో లోతైన సంబంధాలను కలిగి ఉండాలని చెబుతోందన్నారు. భారత దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించడానికి బీజేపీ మూడోసారి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. "అభివృద్ధి చెందిన భారతదేశం కలను సాకారం చేసుకునేందుకు వచ్చే ఐదేళ్లు అత్యంత కీలకం. దీనిలో తొలి అడుగు.. బీజేపీ భారీ మెజారిటీతో తిరిగి అధికారంలోకి రావడమే. ఎన్డీయే కూటమి 400లకు పైగా స్థానాల్లో విజయం దక్కించుకుంటుందనే వాదన బలంగా వినిపిస్తోంది. దీనిని నిజం చేసేందుకు బీజేపీ 370 స్థానాలను దక్కించుకోవాల్సిన అవసరం ఉంది" అని అన్నారు. ఈ దేశాన్ని భారీ కుంభకోణాల నుంచి, ఉగ్రవాద దాడుల నుంచి బయట పడేసేందుకు, మధ్యతరగతి ప్రజలు, పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఎంతో కష్టించామని తెలిపారు. ఢిల్లీలోని భారత మండపం వేదికగా శనివారం ప్రారంభమైన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశం ఆదివారం ముగిసింది. ముగింపు సమావేశంలో మోదీ మాట్లాడుతూ..పార్టీ నేతలకు లక్ష్యాన్ని నిర్దేశించారు. ఎన్నికల వ్యూహాన్ని ఆవిష్కరించారు. "వచ్చే 100 రోజులు అత్యంత కీలకం. ప్రతి ఓటరును కలవాలి. ముఖ్యంగా కొత్త వారికి చేరువ కావాలి. ప్రతి లబ్ధిదారుని ఇంటి గడప తొక్కాలి. ప్రతి ఒక్కరి విశ్వాసాన్నీ చూరగొనాలి" అని దిశానిర్దేశం చేశారు. అదేసమయంలో తనకు మూడోసారి కూడా అధికారం అనుభవించాలనే తాపత్రయం లేదన్నారు. కానీ, ఈ దేశం కోసమే తను ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. "నేను నా ఇంటి గురించి ఆలోచిస్తే.. ఇంట్లోనే కూర్చుంటే.. ఈ దేశ ప్రజలకు ఇళ్ల నిర్మాణం ఎలా సాకారమవుతుంది? ఈ పదేళ్ల మచ్చలేని పాలనలో 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చాం. ఓ సీనియర్ నేత నాకు సలహా ఇచ్చారు.. మీరు ప్రధానిగా చేశారు, ముఖ్యమంత్రిగా చేశారు. ఇక, విశ్రాంతి తీసుకోవచ్చుకదా! అన్నారు. కానీ, నేను 'రాష్ట్రనీతి' కోసం పనిచేస్తున్నాను. 'రాజనీతి' కోసం కాదని చెప్పా" అని మోదీ పేర్కొన్నారు.

కాంగ్రెస్‌పై విసుర్లు..

ప్రధాని మోదీ తన ప్రసంగంలో ప్రతిపక్ష కాంగ్రెస్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. "నేను ఎవరి మాదిరిగానో.. వ్యక్తిగత సంపద పోగేసుకునేందుకు, సొంత శ్రేయస్సు, ఆనందం కోసం మూడోసారి బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకోవడం లేదు. ఈ దేశం కోసం, సమస్యల పరిష్కారం కోసమే కోరుకుంటున్నా. నేను ఏం చేసినా.. దేశ ప్రజలకు అంకితమిస్తున్నా. ప్రజల కలలను నెరవేర్చడమే నా లక్ష్యం" అని వ్యాఖ్యానించారు. తప్పుడు ఆరోపణలు, అనుమానాలతో కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని దుయ్యబట్టారు. "ఆ పార్టీ రెండుగా చీలిపోయింది. ఒక గ్రూపు మోదీని తిట్టడమే పనిగా పెట్టుకుంది. ఇంకోటి వ్యక్తిగత దాడులు చేయొద్దని సూక్తులు చెబుతోంది" అని మోదీ అన్నారు. దేశంలోని ప్రతి వ్యక్తినీ, ప్రతి చిన్నారినీ రక్షించాల్సిన కర్తవ్యం బీజేపీ కార్యకర్తలపై ఉందని నొక్కి చెప్పారు. అవినీతికి కాంగ్రెస్ తల్లిలాంటిదని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే దేశ భవిష్యత్తుకు పూడ్చలేని నష్టమని ప్రధాని పేర్కొన్నారు.



ప్రధాని మోదీని సన్మానిస్తున్న కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా, గడ్కరీ తదితరులు

కొత్త ఓటరును వదలొద్దు!

పార్లమెంటు ఎన్నికల వ్యూహాన్ని చెబుతూ.. బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ తిరగాలని, ముఖ్యంగా కొత్త ఓటర్లను ఏ ఒక్కరినీ వదిలి పెట్టొద్దని మోదీ సూచించారు. "ప్రతి ఒక్క ఓటరును కలవండి. మోదీ మీకు శుభాకాంక్షలు తెలిపారని చెప్పండి. పదేళ్లలో ఏం చేశామో వివరించండి. వచ్చే ఐదేళ్లలో ఏం చేయబోతున్నామో కూడా చెప్పండి. అదేవిధంగా ఇప్పటి వరకు మనతో లేనివారిని(మైనారిటీలు) కూడా కలుపుకోండి" అని దిశానిర్దేశం చేశారు. ఈ పదేళ్లలో అనేక సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నామని, కొన్ని దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలకు పరిష్కారం చూపించామని అన్నారు. వీటిలో అయోధ్య రామమందిరం, ఆర్టికల్ 370 రద్దు, కర్తార్‌పూర్ సాహిబ్ కారిడార్ ప్రారంభం, నూతన విద్యా విధానం సహా అనేకం ఉన్నాయన్నారు. కాగా, ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా త్వరలోనే భారత్ అవతరిస్తుందని మోదీ తెలిపారు. 'అది మోదీ గ్యారంటీ' అని పునరుద్ఘాటించారు.

యూపీఏ పాలనపై శ్వేత పత్రం

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కారు పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైందని బీజేపీ ఆరోపించింది. పదేళ్ల యూపీఏ హయాంలో ఆర్థిక అవకతవకలు అనేకం జరిగాయని పేర్కొంది. ఈ మేరకు బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ఆదివారం విడుదల చేసిన శ్వేతపత్రంలో వివరించింది. యూపీఏ ప్రభుత్వ పాలనపై మోదీ సర్కారు ఇటీవల పార్లమెంటులో కూడా శ్వేతపత్రం విడుదల చేసిన సంగతి తెలిసిందే. 2004-2014 మధ్య జరిగిన ఆర్థిక అవకతవకలను తాజా శ్వేతపత్రంలో వివరించారు. "2014లో బ్యాంకింగ్ సంక్షోభం కారణంగా భారీ నష్టం జరిగింది. మార్చి 2004 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల అడ్వాన్సులు రూ.6.6 లక్షల కోట్లుగా ఉండగా.. మార్చి 2012 నాటికి ఇది రూ.39 లక్షల కోట్లకు చేరింది. 2013లో అమెరికా డాలర్ వేగంగా వృద్ధి చెందగా.. యూపీఏ సర్కారు ఆర్థిక సుస్థిరత విషయంలో రాజీ పడింది. ఫలితంగా 2013లో మన కరెన్సీ విలువ పడిపోయింది" అని శ్వేతపత్రంలో వెల్లడించింది. యూపీఏ హయాంలో 14 కీలక శాఖల్లో రూ.94,060 కోట్ల బడ్జెట్ కేటాయింపులను ఖర్చు చేయలేదని తెలిపింది.

అది వారసత్వ పార్టీల అహంకార కూటమి

» ఇండియా కూటమిపై అమిత్ షా ఫైర్.. 'నేషన్ ఫస్ట్' ఎన్డీఏ విధానమని వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలను ప్రోత్సహిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శించారు. అది వారసత్వ పార్టీల అహంకార కూటమి అని విమర్శించారు. ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీలపై ఆయన నిప్పులు చెరిగారు. దేశంలో అవినీతికి మూలం కాంగ్రెస్ పార్టీయే అన్నారు. 'నేషన్ ఫస్ట్' ఎన్డీయే విధానంగా పేర్కొన్నారు. దేశం స్వావలంబన సాధించేందుకు మోదీ కృషి చేస్తున్నారని చెప్పారు. మరి ఇండియా కూటమి ఏ లక్ష్యం కోసం పనిచేస్తోందని ఆయన ప్రశ్నించారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే సోనియా గాంధీ లక్ష్యమని విమర్శించారు. శరద్ పవార్ ఆయన కుమార్తెను, మమతా బెనర్జీ తన మేనల్లుడిని, స్టాలిన్, లాలూప్రసాద్ యాదవ్, ఉద్ధవ్ ఠాక్రే తమ కుమారులను సీఎంలుగా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. మోదీ 3.0లో ఉగ్రవాదం, తీవ్రవాదం, నక్సలిజం నుంచి విముక్తి లభించి శాంతియుత, సంపన్న దేశంగా భారత్ అభివృద్ధి చెందుతుందని అమిత్ షా ధీమా వ్యక్తంచేశారు.

లోకం తీరు



నడ్డా పదవీ కాలం పొడిగింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీ కాలాన్ని పొడిగించారు. ఈ ఏడాది జూన్ 30 వరకు ఆయనే పార్టీకి సారథ్యం వహించనున్నారు. ఆయనను కొనసాగించాలని ఆదివారం బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో నిర్ణయం తీసుకున్నారు. నడ్డా పదవీ కాలాన్ని పొడిగించేందుకు వీలుగా ఈ సమావేశాల్లోనే పార్టీ రాజ్యాంగానికి సవరణ కూడా చేశారు. దీని ద్వారా అత్యవసర పరిస్థితుల్లో అధ్యక్షుడి పదవీ కాలాన్ని పెంచే అధికారాన్ని పార్టీ పార్లమెంటరీ బోర్డుకు కల్పించారు. అయితే, నడ్డా పదవీ కాలం పొడిగింపును ఆ పార్టీ నేత సుబ్రమణ్య స్వామి తీవ్రంగా వ్యతిరేకించారు. సంస్థాగత ఎన్నికలు నిర్వహించకుండా నడ్డా పదవీ కాలం పొడిగించడం పార్టీ నియమావళికి విరుద్ధమన్నారు. ఇప్పటికే ఈ అంశం ఈసీ ముందు ఉందని, ఢిల్లీ హైకోర్టులో దావా కూడా వేస్తానని స్పష్టం చేశారు.

అయోధ్యలో మందిర నిర్మాణం

రామరాజ్యానికి నాంది!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: అయోధ్యలో రామ మందిర నిర్మాణం.. దేశంలో వచ్చే 1000 ఏళ్ల రామరాజ్య స్థాపనకు నాంది అని బీజేపీ పేర్కొంది. ఈ మేరకు ఢిల్లీలో జరుగుతున్న పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ఆదివారం తీర్మానం చేసింది. గత నెలలో మహా సంప్రోక్షణ జరిగిన ఈ ఆలయం 'జాతీయ చైతన్యం'గా మారిందని.. వికసిత భారత్ నిర్మాణంలో భాగంగా ఆమోదించిన తీర్మానాల అమలులో ఇది కీలక పాత్ర పోషించనుందని తెలిపింది. జనవరి 22న అయోధ్యలోని రామాలయంలో జరిగిన ప్రాణప్రతిష్ఠతో భారతీయులందరూ ఎంతో సంతోషించారని తీర్మానంలో వెల్లడించింది. దేశంలో రామరాజ్యం అన్న ఆలోచన మహాత్మా గాంధీ మదిలో నుంచి వచ్చిందేనని గుర్తుచేసింది. నిజమైన ప్రజాస్వామ్యం అంటే రామరాజ్యమేనని ఆయన చెప్పేవారని వివరించింది.

అంతరిక్షంలోకి అణ్వాయుధం!

కొత్త వ్యూహాన్ని సిద్ధం చేస్తున్న రష్యా.. కక్ష్యలోకి పంపి అవసరమైనప్పుడు ప్రయోగం?



అంతరిక్షంలోకి రష్యా అణ్వాయుధాన్నే పంపించాలని చూస్తోందంటూ అమెరికా నిఘా విభాగం కమిటీ చైర్మన్, ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ ఎంపీ మైక్ టర్నర్ వెల్లడించటం ఆ దేశంలోనేగాక ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారింది. అమెరికాకు పొంచి ఉన్న ప్రమాదం గురించి ప్రభుత్వం దేశ ప్రజలందరికీ తెలియజేయాలని, మిత్రదేశాలను కూడా హెచ్చరించాలని టర్నర్ సూచించారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ స్పందిస్తూ.. రష్యాతో ప్రస్తుతం అమెరికా ప్రజలకు ఎటువంటి అణుముప్పు లేదని, ప్రపంచదేశాలకూ ఆ ప్రమాదం ఏమీ లేదని పేర్కొన్నారు. అయితే, సదరు అణ్వాయుధాన్ని భూమ్మీద ఉన్న లక్ష్యాల కోసం కాకుండా, అంతరిక్షంలో ఉన్న ఉపగ్రహాలపై ప్రయోగించటానికే రష్యా తయారు చేయాలని భావిస్తోందని మీడియా పేర్కొంది. అయితే, అణ్వాయుధం అనేది రోదసిలో ఉంటే.. దానిని భూమి మీది లక్ష్యాలతోపాటు ఎక్కడికైనా ప్రయోగించే అవకాశం ఉంటుందనే వాదన కూడా ఉంది. రష్యా ప్రయోగించనున్న అణ్వాయుధం గురించి ప్రస్తుతానికి ఊహాగానాలే తప్ప ఎటువంటి స్పష్టత లేదు. మూడు అంచనాలు మాత్రం ఉన్నాయి. మొదటిది.. ఏకంగా ఓ అణ్వాయుధాన్నే కక్ష్యలోకి ప్రవేశపెట్టి అవసరం వచ్చినప్పుడు అక్కడి నుంచే ప్రయోగించటం. రెండవది.. అణుశక్తితో నడిచే ఉపగ్రహం. ఇది స్వయంగా బాంబు కాకపోవచ్చు గానీ, దాంట్లోని పరికరాలను అణుశక్తితో నడిపిస్తారు. మూడవది.. ఉపగ్రహాలను ధ్వంసం చేసే అణ్వాయుధం. దీనిని భూమి మీదే నిలిపి ఉంచుతారు. అవసరమైనప్పుడు ప్రయోగిస్తారు.

1962లోనే అమెరికా పరీక్ష

అణుబాంబు పేలినప్పుడు వెలువడే శక్తివంతమైన తరంగాలు అన్నింటినీ భస్మీపటలం చేస్తాయి. వాతావరణంతో నిండి ఉన్న భూమి మీదే ఇంత దారుణంగా ఉంటే, వాతావరణం లేని శూన్యం ఆవరించిన రోదసిలో అణ్వాయుధం పేలుడు సంభవిస్తే పరిస్థితి ఏమిటి? దీనికో ఉదాహరణ కూడా ఉంది. 1962లో అమెరికా.. పసిఫిక్ సముద్రంపైన 400 కి.మీ.ల ఎత్తులో అణ్వాయుధ పరీక్ష జరిపింది. 1.4 మెగాటన్నుల అణ్వాయుధాన్ని పేల్చి వేసింది. దీని నుంచి వెలువడిన రేడియోధార్మికత సమీపంలోని ఉపగ్రహాలనే కాదు.. భూమికి మరో వైపున్న ఉపగ్రహాలపైన కూడా ప్రభావం చూపింది. ఫలితంగా భూమి దిగువ కక్ష్య (ఎల్‌ఈఓ)లో ఉన్న ఉపగ్రహాల్లో మూడోవంతు దెబ్బతిన్నాయి. అనేక దేశాల ఉపగ్రహాలు, ముఖ్యంగా మిలిటరీ ఉపగ్రహాలు ఎక్కువగా ఈ కక్ష్యలోనే ఉంటాయి. ప్రస్తుతం ఎల్‌ఈఓలో దాదాపు 8,300 ఉపగ్రహాలు పని చేస్తున్నాయి. ఇక్కడ అణ్వాయుధం పేలుడు సంభవిస్తే.. అమెరికా, రష్యా, చైనా, భారత్ తదితర దేశాల ఉపగ్రహాలు ధ్వంసమవుతాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం కూడా దెబ్బతింటుంది.

జీఈఓ లక్ష్యంగా..

రష్యా తాజాగా తన అణ్వాయుధాన్ని 36 వేల కి.మీ.ల పైనున్న జియో సింక్రనస్ ఆర్బిట్ (జీఈఓ)లో ప్రవేశపెట్టవచ్చన్న వాదనలు ఉన్నాయి. ఈ కక్ష్యలోనే అమెరికాకు చెందిన పలు నిఘా, మిలిటరీ కమ్యూనికేషన్ ఉపగ్రహాలున్నాయి. కాబట్టి, రష్యా లక్ష్యం జీఈఓ కావచ్చని హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన మాథ్యూ బన్ చెబుతున్నారు. ఎలక్ట్రానిక్ యుద్ధాన్ని కొనసాగించేలా అణుశక్తితో నడిచే ఉపగ్రహాన్ని రష్యా రోదసిలోకి పంపుతుందనేది మరో వాదన. అంతరిక్షంలోని ఉపగ్రహాలపై ఎలక్ట్రానిక్ యుద్ధాన్ని భూమి మీది నుంచే జరిపే వ్యవస్థలు అమెరికా, రష్యా వద్ద ఇప్పటికే ఉన్నాయి. కానీ, రోదసిలోకి ఇటువంటి వ్యవస్థను పంపిస్తే శత్రుదేశాల ఉపగ్రహాలపై చాలా సమీపం నుంచి దాడి చేయటానికి వీలవుతుంది. అయితే, ఈ ఉపగ్రహాలను అణుశక్తితోనే ఎందుకు నడిపించాలి?.. పుష్కలంగా కరెంటును ఉత్పత్తి చేయటం కోసమే అణుశక్తి వాడకం. ఎంత విద్యుత్ అందుబాటులో ఉంటే తమ ఉపగ్రహాలపై అంత శక్తివంతమైన రాడార్ జామర్లను అమర్చవచ్చు. అమెరికా 1965లోనే కక్ష్యలోకి అణురియాక్టర్‌ను పంపించింది. కాగా, ఆయుధాల పోటీకి, ఘర్షణలకు రోదసిని ఉపయోగించవద్దని 1967 నాటి అంతరిక్ష ఒప్పందం స్పష్టం చేస్తోంది. అలాగే, 1963 నాటి పాక్షిక పరీక్షల నిరోధక ఒప్పందం కూడా అంతరిక్షంలో ఆయుధాలను పరీక్షించటం, పేల్చటం వంటి వాటిని నిషేధిస్తోంది. ఈ రెండు ఒప్పందాలపై రష్యా సంతకం చేసింది. అయినప్పటికీ, అంతరిక్ష అణ్వాయుధాన్ని తయారు చేయటమంటే వీటిని ఉల్లంఘించటమే అవుతుంది.

ఉక్రెయిన్‌తో యుద్ధమే కారణమా?

శత్రుదేశాలపై దాడికి, నిఘాకు వందల సంఖ్యలో ఉపగ్రహాలను అనుసంధానించి వాడుకోవటం అన్నది ఇప్పుడు సరికొత్త యుద్ధ వ్యూహం. అమెరికా సైన్యం దీనిపై ఇటీవల ఆసక్తి చూపుతోంది. ఉక్రెయిన్ సైన్యం ఈ తరహా ప్రయోగాలు చేసింది. పైగా ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధంలో ఉంది. ఈ నేపథ్యంలోనే రష్యా ఈ కొత్త ఆయుధాన్ని సమకూర్చుకుంటూ ఉండవచ్చని కార్నేగీ ఎండోమెంట్ అనే మేధోసంస్థకు చెందిన నిపుణుడు జేమ్స్ యాక్టన్ తెలిపారు. కాగా, రోదసిలోకి అణ్వాయుధం అంటూ అమెరికా తనపై చేస్తున్న ఆరోపణలను రష్యా ఖండించింది. తమకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌కు మరిన్ని నిధులను అప్పగించటం కోసం ఆ దేశ ప్రభుత్వం ఈ నాటకం ఆడుతోందని ఆరోపించింది.

- సెంట్రల్ డెస్క్

అందరిదీ అనుమానాస్పద మరణమే!

పుతిన్‌ను విమర్శించినవారు మిగల్లేదు



మాస్కో, ఫిబ్రవరి 18 : రష్యా విపక్ష నాయకుడు, ప్రముఖ ఉద్యమకారుడు అలెక్సీ నావల్నీ హఠాన్మరణం ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయనది సహజ మరణమని అధికారులు చెబుతున్నా.. ప్రపంచ దేశాలు.. ముఖ్యంగా యూరప్ దేశాలు నమ్మడం లేదు. ఎందుకంటే.. పుతిన్‌ను విమర్శించిన వారిలో ఇప్పటి వరకు చనిపోయినవారంతా అనుమానాస్పదంగానే ప్రాణాలు విడిచి పెట్టారు. పుతిన్ ప్రత్యర్థుల మరణం వెనుక విమానాలు కూలిపోవడం, విష ప్రయోగం, ఆత్మహత్యలు వంటి అనేక ఘటనలు వెలుగు చూశాయి. వీటిని ప్రమాదాలు, ఆత్మహత్యల జాబితాలో ప్రభుత్వం చేర్చేసిందనే వాదన కూడా ఉంది. తాజాగా నావల్నీ మరణంతో మరోసారి ఈ ఘటనలు తెర మీదకి వచ్చాయి. ఇప్పుడు నావల్నీ మరణంపై అందరి వేళ్లూ పుతిన్‌వైపే చూపిస్తున్నాయి. ఇదిలావుంటే నావల్నీ మరణంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన వెనుక పుతిన్ ప్రభుత్వం ఉందన్నారు. పలువురు ప్రపంచ స్థాయి నాయకులు కూడా ఇవే వ్యాఖ్యలు చేశారు. ఇక రష్యా విపక్ష పార్టీల నేతలు, ఉద్యమకారులు కూడా పుతిన్ ప్రభుత్వంపై అనుమానాలు వ్యక్తం చేశారు. నావల్నీ మృతదేహాన్ని సలేఖర్డ్ శవాగారంలో ఉంచినట్లు రష్యా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించినప్పటికీ, అక్కడి నుంచి అది అదృశ్యం కావడంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. శవాగారానికి నావల్నీ తల్లి, లాయరు వెళ్లినప్పుడు, మృతదేహం అక్కడ లేదని అధికారులు సమాధానమిచ్చారు. దాంతో చేసేదేమీలేక వారు వెనుదిరిగివెళ్లాల్సి వచ్చింది. కాగా, నావల్నీ మరణంపై యూరప్ వ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. రష్యాలోని 32 నగరాల్లో ఆదివారంనాడు భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. కనీసం 400 మందిని రష్యన్ పోలీసులు అరెస్టు చేశారు.

ఇవీ.. దృష్టాంతాలు!

ఎవ్జెనీ ప్రిగోజిన్: ఈయన పుతిన్‌కు అత్యంత సన్నిహితుడు. వాగ్నర్ మెర్సనరీ గ్రూప్‌కు మాజీ అధిపతి. అయితే క్రెమ్లిన్‌పై తిరుగుబాటు చేసి ప్రిగోజిన్ దళం రెస్టోవ్ నగరాన్ని స్వాధీనం చేసుకుంది. ఆ తర్వాత గత ఏడాది విమానం కూలిపోయిన ఘటనలో ప్రిగోజిన్ మృతి చెందారు.

బోరిస్ బెరెజోవ్‌స్కీ: ఈయన రష్యా వ్యాపారవేత్త. తరచుగా పుతిన్‌ను విమర్శించేవారు. ఈ క్రమంలో 2000 సంవత్సరంలో దేశాన్ని విడిచి వెళ్లిపోయారు. 2007లో ఈయన్ను రష్యా కోర్టు పన్నుల ఎగవేత కేసులో దోషిగా తేల్చింది. 2013లో బోరిస్ బ్రిటన్‌లోని తన నివాసంలో ఉన్న బాత్‌రూంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరితో పాటు ఎఫ్ఎస్‌బీ సెక్యూరిటీ సర్వీసుల మాజీ సభ్యుడు అలెగ్జాండర్ లిత్వినెంకో, ప్రజావేగుగా పనిచేసిన అలెగ్జాండర్ పెరిపిలిచిని, రష్యన్ లాయర్ సెర్గీ మెగ్నిట్స్కీ, రష్యన్ షిప్‌యార్డ్ అధిపతిగా పనిచేసిన అలెగ్జాండర్ బుజకోవ్ తదితరులూ ఇలాగే అనుమానాస్పదంగా ప్రాణాలు కోల్పోయారు. పుతిన్ విమర్శకులు కావడమే వీరంతా చేసుకున్న పాపం.

నేటి నుంచి మిలాన్-2024

విశాఖ తీరానికి విదేశీ నౌకలు



విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మిత్ర దేశాలతో సంబంధాలు మెరుగుపరుచుకోవడానికి, సహాయ సహకారాలు ఇచ్చిపుచ్చుకోవడానికి రెండేళ్లకోసారి భారత నౌకాదళం నిర్వహిస్తున్న మిలాన్‌కు సర్వం సిద్ధమైంది. విశాఖపట్నం వేదికగా సోమవారం 'మిలాన్-2024' ప్రారంభం కానుంది. ఈ నెల 27 వరకు కొనసాగే ఈ విన్యాసాల కోసం 50 దేశాల నుంచి ప్రతినిధులు, 20కి పైగా యుద్ధనౌకలు, విమానాలు వస్తున్నాయి. వీటిలో కొన్ని ఇప్పటికే విశాఖపట్నం హార్బర్‌కు చేరుకున్నాయి. మిలాన్ తొలి దశ (హార్బర్ ఫేజ్)లో భాగంగా అన్ని దేశాల నౌకాదళాలు కలసి ఆర్కే బీచ్‌లో ఇంటర్నేషనల్ సిటీ పెరేడ్ నిర్వహిస్తాయి. మిలాన్ పేరుతో ఒక గ్రామాన్ని కూడా ఏర్పాటుచేస్తున్నారు. రెండో దశ (సీ ఫేజ్)లో వివిధ దేశాల నేవీ దళాలు సముద్రంలో, గగనతలంలో విన్యాసాలు ప్రదర్శిస్తాయి. సబ్‌మెరైన్లపై పోరాటం, ఆకాశంలో లక్ష్యాలను ఛేదించడం వంటివి ఉంటాయి. ఇదిలా ఉండగా, మిలాన్-2024కి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పలు దేశాల నుంచి నేవీ సిబ్బంది, అతిథులు వచ్చేశారు. ఇంటర్నేషనల్ సిటీ పెరేడ్‌లో భాగంగా నేవీ శక్తి సామర్థ్యాలు తెలియజేసే సాహస ప్రదర్శనల కోసం ఆదివారం ఆర్కే బీచ్‌లో రిహార్సల్స్ చేశారు. సముద్రంలో చిక్కుకున్న వారిని హెలికాప్టర్‌లో వచ్చి రక్షించడం, శత్రు మూకలపై జెమినీ బోట్లపై దాడి చేయడం వంటి ప్రదర్శనలు చేశారు.

ఉత్తరాదిలో గాలి నాణ్యత భేష్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: వాతావరణ మార్పుల కారణంగా విస్తరించిన అరుదైన ట్రిపుల్-డిప్ లా నినా పరిస్థితుల వల్ల 2022-23 శీతాకాలంలో ఉత్తర భారతంలో గాలి నాణ్యత మెరుగుపడింది. కానీ.. తీర ప్రాంతం వెంబడి ఉన్న దక్షిణ భారతంలో మాత్రం కాలుష్య స్థాయిల పెరుగుదల నమోదైన విచిత్ర పరిస్థితి నెలకొందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. వరుసగా మూడు సంవత్సరాలు (2020-23) లా-నినా పరిస్థితులు అరుదైన ట్రిపుల్-డిప్ పరిస్థితికి కారణం కాగా.. ఇది ప్రపంచవ్యాప్తంగా సముద్రం, వాతావరణంపై విస్తృత ప్రభావం చూపిందని ఈ అధ్యయనంలో గుర్తించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ చైర్ ప్రొఫెసర్ గుర్ఫాన్ బేగ్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం చేపట్టిన ఈ అధ్యయనం.. స్థానిక ఉద్గారాలతోపాటు వాతావరణ మార్పులు గాలి నాణ్యతను ప్రభావితం చేసిన వాటిలో ముఖ్యమైన అంశాలని స్పష్టం చేసింది. అధ్యయనం ప్రకారం.. 2022-23 శీతాకాలంలో ఉత్తరాదిలోని ఘజియాబాద్‌లో గాలి కాలుష్యంలో 33 శాతం తగ్గుదల కనిపించింది. కానీ, దీనికి విరుద్ధంగా.. తీరం వెంబడి ఉన్న ప్రాంతాల్లో కాలుష్యం విపరీతంగా పెరిగిపోయింది. ముఖ్యంగా ముంబైలో వాయుకాలుష్యం 30 శాతం పెరిగింది.

ఫిర్యాదు చేసేందుకు వచ్చిన యువతికి ఎస్సై ప్రేమ వల

- పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు అత్యాచారం
- ఆపై మరో యువతితో నిశ్చితార్థం
- బాధితురాలి ఫిర్యాదుతుతో నిందితుడిని అరెస్ట్ చేసిన సైదాబాద్ పోలీసులు

సైదాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్టేషనుకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన ఓ ఎస్సైని సైదాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ గిరిజన యువతి నగరంలో జూనియర్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తూ సైదాబాద్ పీఎస్ పరిధిలోని తన అత్త వాళ్ల వద్ద ఉంటోంది. గతేడాది జనవరిలో అత్త, మామల మధ్య జరిగిన గొడవ కారణంగా ఫిర్యాదు చేసేందుకు సైదాబాద్ పీఎస్‌కు వెళ్లింది. ఆ సమయంలో ట్రైనీ ఎస్సైగా ఉన్న నిజామాబాద్‌కు చెందిన పబ్బా అరుణ్(29).. క్రమంగా ఆ యువతితో పరిచయం పెంచుకున్నాడు. ఫోన్ నంబరు తీసుకొని తరచూ ఫోన్‌లో, వాట్సాప్‌లో టచ్‌లో ఉండేవాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని ఆ యువతిని నమ్మించి పలుమార్లు అత్యాచారం చేశాడు. ఆరునెలల క్రితం సదరు యువతి అరుణ్ ఫోన్‌లో



ఎస్ఐ అరుణ్

అతడికి మరో అమ్మాయితో నిశ్చితార్థం అయిన ఫొటోలను చూసి నిలదీసింది. ఆ నిశ్చితార్థాన్ని రద్దు చేసుకుంటానని అరుణ్ నమ్మబలికాడు. ఆ తర్వాత నెలల గడుస్తున్నా అరుణ్ పెళ్లి ప్రస్తావన వాయిదా వేస్తుండడంతో యువతి అరుణ్ నిశ్చితార్థం చేసుకున్న అమ్మాయి సోదరుడికి ఫోన్ చేసి తమ సంబంధం గురించి చెప్పింది. ఈ క్రమంలో అరుణ్ యువతికి ఫోన్ చేసి పెళ్లి చేసుకోనని తెగేసి చెప్పడంతో బాధితురాలు సైదాబాద్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రస్తుతం సిద్దిపేట కమిషనరేట్ వీఆర్‌లో పనిచేస్తున్న ఎస్సై అరుణ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అయోధ్యలోనే టీటీడీ అధికారుల బృందం

తిరుమల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామాలయంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, చేపట్టాల్సిన నిర్మాణాలు, క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాలపై టీటీడీ అధికారుల బృందం పరిశీలన కొనసాగుతోంది. గత నెల 22వ తేదీన అయోధ్య రామాలయంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అనంతరం రోజురోజుకూ రద్దీ పెరుగుతున్న క్రమంలో అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు కూడా భక్తులకు సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. నాలుగు రోజుల క్రితం టీటీడీ ఇంజనీరింగ్ అధికారుల బృందం అయోధ్యకు చేరుకుంది. కూలైన్ల నిర్మాణం, భక్తుల వేచిఉండే భవనాల నిర్మాణాలపై ట్రస్టు ప్రతినిధులతో చర్చించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి కూడా శనివారం అయోధ్యకు వెళ్లారు. ట్రస్టు సభ్యులతో సమావేశం నిర్వహించడంతోపాటు రామాలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సోమవారం నివేదిక రూపొందించి రామాలయం ట్రస్టుకు అందజేయనున్నారు.

అమెరికాలో కాల్పులు.. ఇద్దరు పోలీసుల మృతి

బర్న్స్‌విల్లె, ఫిబ్రవరి 18: అమెరికాలో గుర్తు తెలియని దుండగుల కాల్పుల్లో విధుల్లో ఉన్న ఇద్దరు పోలీసులు మృతిచెందారు. మిన్నెసోటాలో ఓ కుటుంబం ప్రమాదంలో ఉందంటూ బర్న్స్‌విల్లె పోలీసులకు ఆదివారం వేకువజామున ఓ ఫోన్ కాల్ వచ్చింది. వెంటనే స్పందించిన ఇద్దరు పోలీసులు, అత్యవసర విభాగానికి చెందిన ఓ అధికారి ఆ ఇంటికి వెళ్లారు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తులు వారిపై కాల్పులు జరిపారు. దీంతో ఆ ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. కాగా ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బయ్యారం ఎస్బీఐ ఏటీఎంలో చోరీ

- 29 లక్షల అపహరణ.. అంతరాష్ట్ర దొంగలుగా అనుమానం

బయ్యారం (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 18 : మహబూబాబాద్ జిల్లా బయ్యారం బస్టాండ్ సెంటర్‌లోని ఎస్బీఐ ఏటీఎంలో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. అంతరాష్ట్ర దొంగల ముఠా గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం మిషన్‌ను పగలగొట్టి రూ. 29.78 లక్షల డబ్బును ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఏఎస్పీ చెన్నయ్య, డీఎస్పీ తిరుపతి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం పోలీసులు ఆనవాళ్లను సేకరించారు. ఈ ఘటనకు సంబంధించి ఆదివారం ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీసీ టీవీ ఫుటేజీ ప్రకారం.. కారులో నలుగురు వ్యక్తులు వచ్చి బయ్యారం ఎస్బీఐ ఏటీఎం మిషన్‌కు కొంత దూరంలో ఆగారు. కొంతసేపు తర్వాత కారులో నుంచి ఓ వ్యక్తి దిగి, ఏటీఎం వద్దకు వెళ్లి గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను పగలగొట్టాడు. అందులోని రూ.29.78 లక్షల నగదు అపహరించినట్లు ఎస్సై ఉపేందర్ పేర్కొన్నారు. చోరీ తీరును బట్టి అంతరాష్ట్ర ముఠాగా అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు తెలిపారు. క్లూస్ టీం ద్వారా ఆనవాళ్లు సేకరిస్తున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని వెల్లడించారు.

పోలీసు అధికారిని హత్య చేసిన మావోయిస్టులు ?

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 18: ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో ఆదివారం సీఏఎఫ్(ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ ఫోర్స్) నాలుగో బెటాలియన్‌కు చెందిన కమాండర్ తేజూరామ్ బూర్యను మావోయిస్టులుగా భావిస్తున్న కొందరు వ్యక్తులు పట్టపగలే హత్య చేశారు. దర్బ వారాంతపు సంతలో విధులు నిర్వర్తిస్తుండగా గ్రామీణుల వేషంలో ఉన్న కొందరు వ్యక్తులు ఇన్‌స్పెక్టర్ మెడపై పదునైన ఆయుధంతో దారుణంగా పొడిచి హత్య చేశారు. మావోయిస్టు స్మాల్ యాక్షన్ టీంకు చెందిన వ్యక్తులే ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ విషయాన్ని ధ్రువీకరించారు.



హిడ్మా కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తదితరులు

హిడ్మా సొంతూరులో జాతీయ జెండా రెపరెపలు

చర్ల, ఫిబ్రవరి 18: మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నాయకుడు, ఆ పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు మడివి హిడ్మా అలియాస్ సంతోష్ సొంత ఊరైన పూవర్తి దండకారణ్యంలో ఆదివారం జాతీయ జెండా రెపరెపలాండింది. ఇంతకాలం ఎర్రజెండాలు కనిపించిన చోట ఎట్టకేలకు జాతీయ జెండా ఎగిరింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా జేగురుకొండస్టేషన్ పరిధిలో ఈ పూవర్తి గ్రామం ఉంది. సీఆర్‌పీఎఫ్ క్యాంపు ఏర్పాటు సందర్భంగా తొలిసారి గ్రామంలో జాతీయ జెండాను ఎస్పీ కిరణ్ చవాన్ ఎగుర వేశారు. మావోయిస్టు కంచుకోటలాంటి ఈ ప్రాంతంలో... హిడ్మాను పట్టుకోవడమే లక్ష్యంగా క్యాంపును ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. పలు ఘటనల్లో వందల మంది పోలీసులను హతమార్చిన హిడ్మా తలపై సుమారు 45 లక్షల రివార్డు ఉండటం గమనార్హం.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై హంతకదాడి

జగన్ 'సిద్ధం' సభలో చెలరేగిపోయిన వైసీపీ మూకలు.. 'నువ్వు ఆంధ్రజ్యోతా' అని ఆరాతీసి మరీ దాడి

- జెండా కర్రలు తిప్పిపట్టుకుని ప్రాంగణంలో స్వైర విహారం
- శ్రీకృష్ణను ఆపి బలవంతంగా జేబులోంచి ఐడీ కార్డు లాగివేత
- 'ఆంధ్రజ్యోతి' అని తెలియగానే కర్రలతో దెబ్బలవర్షం
- అరకిలోమీటరు వరకు కొట్టుకుంటూ వెళ్లిన మూక





ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేస్తున్న వైసీపీ మూకలు, గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకృష్ణ

అనంతపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) 'సిద్ధం' అంటూ ప్రకటనలు చేస్తున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అసలు నైజం మరోసారి బయటపడింది. ప్రశ్నిస్తే కేసులు.. ఎదురుతిరిగితే దాడులు.. అన్నట్టు సాగుతున్న జగన్ మార్కు రాజకీయం మరింతగా దిగజారింది. చివరకు తన విధి నిర్వహణలో భాగంగా జగన్ సభను కవర్ చేయడానికి వెళ్లిన ఆంధ్రజ్యోతి అనంతపురం స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌నీ వదిలిపెట్టలేదు. వైసీపీ మూకలతో దాడులు చేయించి.. హంతక దాడికి పురిగొల్పిన తీరు సర్వత్రా నివ్వెరపరిచింది. అనంతరపురం జిల్లా రాప్తాడు సమీపంలో ఆదివారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 'సిద్ధం' సభ కవరేజీకి వెళ్లిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రతినిధులే లక్ష్యంగా ముందే దాడికి అంతా 'సిద్ధం' చేసుకున్నాయి. 'మీరు ఆంధ్రజ్యోతా' అంటూ పత్రిక పేరు ఆరా తీసి.. ఎంపిక చేసుకుని మరీ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై విచక్షణారహితంగా వైసీపీ మూకలు విరుచుకుపడ్డాయి. సభా ప్రాంగణంలో కనిపించిన ప్రతి రిపోర్టరు, ఫొటోగ్రాఫర్‌నూ ఆపి.. ఏ పేపరో అడిగి.. పేరు చెప్పమని.. ఐడెంటిటీ కార్డు చూపించమని గదమాయిస్తూ యథేచ్ఛగా స్వైరవిహారం చేశాయి. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆ మూకలు కేకలు, కేరింతలు వేస్తూ సభా ప్రాంగణంలో చెలరేగిపోయాయి. ఈ క్రమంలో వాటి కంట శ్రీకృష్ణ పడ్డారు. కొందరు వైసీపీ కార్యకర్తలు.. ఆయన జేబులో బలవంతంగా చేతులు పెట్టి పర్సును బయటకు లాగారు. అందులోని ఐడెంటిటీ కార్డును చూస్తూ.. 'నువ్వు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌వి కదా' అంటూ ఒక్కసారిగా ఆగ్రహంతో ఊగిపోయారు. తమ చేతుల్లోని వైసీపీ జెండా కర్రలతో శ్రీకృష్ణపై కర్రలతో పటపటా.. మని కొడుతూ, దెబ్బల వర్షం కురిపించారు. సిద్ధం సభా వేదిక నుంచి దాదాపు అర కిలోమీటరు వరకు కొట్టుకుంటూ తీసుకెళ్లారు. దెబ్బలను తప్పించుకోవడానికి అడ్డుపెట్టిన చేతులపై, కాళ్లపై కర్రలతో కొట్టారు. చేతులతో పిడిగుద్దులు గుద్దారు. తప్పించుకునే ప్రయత్నం చేసినా వదలకుండా.. వెంటాడారు. అక్కడున్న కొందరు శ్రీకృష్ణను వారినుంచి కాపాడటానికి ప్రయత్నించగా, వారిపైనా దాడిచేశారు. శ్రీకృష్ణ వంటిపై వాతలు తేలేలా కొడుతూనే ఉన్నారు. ఒకదశ వరకు ప్రతిఘటనకు ఆయన ప్రయత్నించారు. ఆ తర్వాత శ్రీకృష్ణ సొమ్మసిల్లిపడిపోయారు.

పోలీసులపైనా ప్రతాపం!

సొమ్మసిల్లిన శ్రీకృష్ణను అక్కడే ఉన్న ఓ సీఐ ఎత్తుకుని తన వాహనంలోకి ఎక్కించారు. శ్రీకృష్ణను తమకు అప్పగించాలంటూ కొందరు వైసీపీ కార్యకర్తలు వాహనానికి అడ్డుగా నిలబడ్డారు. సీఐపైనా దాడికి యత్నించారు. పోలీసు జీపుపై రాళ్లు రువ్వారు. శ్రీకృష్ణ వద్ద ఉన్న కెమెరా, సెల్‌ఫోన్, పర్సు సహా అన్నీ లాగేసుకున్నారు. వారిని ఎలాగోలా తప్పించుకుని పోలీసు వాహనం అక్కడనుంచి కదిలింది. విషయం తెలియగానే పలువురు జర్నలిస్టులు, ఆంధ్రజ్యోతి సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ ఆచూకీ కోసం సుమారు గంటపాటు ఆరాతీయాల్సి వచ్చింది. రాప్తాడు పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లినప్పుడు చివరకు గుర్తించారు. స్టేషన్‌కు అంతా చేరుకున్నారు. అక్కడ వారికి శ్రీకృష్ణ కనిపించారు. ఆయనను 'ఆంధ్రజ్యోతి' సిబ్బంది ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అక్కడనుంచి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఖండించిన జర్నలిస్టు సంఘాలు

ముఖ్యమంత్రి జగన్ రెచ్చగొట్టడం వల్లే వైసీపీ మూకలు 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి చేశాయని జర్నలిస్టు సంఘాలు ఆరోపించాయి. ముఖ్యమంత్రి సభలోనే పాత్రికేయులపై ఇంతటి దౌర్జన్యం జరిగినందున, అందుకు పూర్తి బాధ్యత ఆయనే వహించాలని బీజేయూ జాతీయ కార్యదర్శి సోమసుందరం, ఏపీడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, జాప్ కార్యదర్శి లక్ష్మీపతి తదితరులు పేర్కొన్నారు. వైసీపీ రౌడీలు అంతలా రెచ్చిపోవడానికి కారణం సీఎం జగన్ పదే పదే ఒక వర్గం మీడియా అంటూ వేరుచేసి మాట్లాడటమేనని విమర్శించారు. ఈ దాడిని పత్రికా ప్రపంచం తీవ్రంగా ఖండిస్తోందని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పేర్కొంది. 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ తిరుపతిలో టీడీపీ శ్రేణులు నిరసన తెలిపాయి.



'సంఘం' చేయని సంతకం!

ఇరుక్కుపోయిన ఐపీఎస్ కాంతి రాణా.. 'జగన్ భక్త ఐపీఎస్'లపై ఖండన

- ఐపీఎస్ అధికారుల సంఘం పేరిట జారీ
- కార్యదర్శి అనుమతి లేకుండా, తెలియకుండానే ఆయన తరపున విజయవాడ సీపీ సంతకం
- విషయం తెలిసి మండిపడిన కార్యదర్శి మీనా
- మీ పరిధిలోనే మీపై కేసు పెడతానని హెచ్చరిక
- ఐపీఎస్ వర్గాల్లో తీవ్ర చర్చ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)


ఐపీఎస్ అధికారుల సంఘంలో చర్చించకుండానే.. సంఘ కార్యదర్శికి తెలియకుండానే ఆయన తరఫున ప్రకటన విడుదల చేసేశారు! దానిపై 'ఫర్' సంతకమూ చేసేశారు. ఏపీలో జగన్ ప్రభుత్వ ఒత్తిడికి ఆ సంతకం చేసిన విజయవాడ నగర కమిషనర్ కాంతి రాణా టాటా ఇప్పుడు అడ్డంగా ఇరుక్కుపోయారు. నిజానికి, అధికారం అండతో తాము చేసే అరాచకాలకు వంత పాడే ఐపీఎస్ అధికారులను వైసీపీ ప్రభుత్వం కీలక స్థానాల్లో నియమించుకుంది. 'ఎస్ బాస్' అనే పలువురు ఐపీఎస్‌లను ఎంపిక చేసి.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 'అవసరమైన' చోట పోస్టింగ్‌లు ఇచ్చింది. ప్రతిపక్షాలను తొక్కిపడేయడం, ఎన్నికల సమయంలో వైసీపీకి సహకరించడమే వారి బాధ్యతగా చెబుతున్నారు. అందుకోసం మొదట రెడ్డి సామాజిక వర్గీయులను, ఆ తర్వాత తమకు నమ్మకస్తులైన అధికారులను ఎంపిక చేసి పోస్టింగ్ ఇచ్చింది. ఈ మొత్తం వ్యవహారంపై ఈనెల 12న 'జగన్ భక్త ఐపీఎస్‌లు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఆంధ్రప్రదేశ్ ఎడిషన్లో ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతో, తాడేపల్లి శిబిరం ఉలిక్కి పడింది. ఈ కథనాన్ని ఖండించేందుకు భారీ హైడ్రామా నడిపింది. 'తప్పులు రాస్తే ఊరుకోం. శిక్షిస్తాం. కేసులు పెడతాం' అని హెచ్చరిస్తున్నట్లుగా ఐపీఎస్ అధికారుల సంఘం లెటర్ హెడ్‌తో ఒక ప్రకటన వెలువడింది. ఐపీఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి, అదనపు డీజీ ఆర్కే మీనా తరఫున విజయవాడ నగర కమిషనర్ కాంతి రాణా టాటా 'ఫర్' సంతకం చేశారు. నిజానికి... ఆయన ఐపీఎస్ సంఘంలో సభ్యుడు మాత్రమే. ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ కూడా కాదు. అయినా సరే... ఇలాంటి ఖండనలు జారీ చేయాలంటే సంఘం కార్యదర్శి ఎగ్జిక్యూటివ్ కమిటీ భేటీ ఏర్పాటు చేసి వారి ఆమోదం తీసుకోవాలి. లేదా... ఫోన్‌లోనైనా సమాచారం ఇవ్వాలి. ఇక్కడ ఇవేవీ జరగనే లేదు. సంఘం కార్యదర్శిగా ఉన్న ఆర్కే మీనాకు తెలియకుండానే, ఆయన అనుమతి లేకుండానే, ఆయన పేరుతో కాంతి రాణా టాటా 'ఫర్' సంతకం చేసేశారు. ఇది ఇప్పుడు మొత్తం ఐపీఎస్ వర్గాల్లోనే సంచలనం సృష్టిస్తోంది.



నగర పోలీసు కమిషనర్ హోదాలో కాంతి రాణా టాటా సంతకం

ఇలా బయటపడింది..

సభ్యుల ప్రయోజనాలకు భంగం కలిగిందని భావించినప్పుడు ఐపీఎస్ అధికారుల సంఘం జోక్యం చేసుకోవడం కొత్తేమీ కాదు. 'మీరు రాసింది సత్యదూరం' అని ఖండననూ పంపొచ్చు. 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఈనెల 12న ఐపీఎస్ అధికారుల సంఘం కార్యదర్శి పేరుతో ఓ ఖండన వెలువడింది. అందులో ఐపీఎస్ భాష కనిపించకపోగా... 'తాడేపల్లి స్టైల్ బెదిరింపులు' వినిపించాయి. "ప్రజల భద్రత, సమాజంలో శాంతిని కాపాడేందుకు రాత్రింబవళ్లు పనిచేస్తున్నాం. తప్పు చేసిన వారిపై ఆయా ఐపీఎస్‌లు వ్యక్తిగతంగా తగిన క్రిమినల్, సివిల్ చర్యలు తీసుకుంటారు" అని అందులో హెచ్చరించారు. అసలు కథనాన్ని ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి'కి తప్ప ఇతర కూలి, నీలి మీడియాకు ఈ ఖండనను పంపించారు. జగన్ రోత పత్రిక కూడా దీనిని ప్రచురించింది. ఇది చదివిన ఒక అధికారికి మరుసటి రోజు ఐపీఎస్ అధికారుల సంఘం కార్యదర్శి ఆర్కె మీనా ఎదురయ్యారు. 'అదేంటి సర్.. మీరు సాఫ్ట్‌గా ఉంటారు కదా! 'ఆంధ్రజ్యోతి' కథనంపై పొలిటికల్ స్టేట్మెంట్ తరహాలో ఘాటుగా ఖండన ఇచ్చారేంటి' అని అడిగారు. దీంతో మీనా ఆశ్చర్యపోయారు. 'ఖండనేంటి.. నాకేమీ తెలియదే' అని బదులిచ్చారు. 'ఐపీఎస్‌ల బదిలీలపై వచ్చిన వార్త విషయంలో.. సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని మీరు వార్నింగ్ ఇచ్చినట్లు పత్రికల్లో వచ్చింది' అనగానే, 'అవునా.. నేను ఏదీ ఇవ్వలేదు. నన్నెవరూ అడగలేదు' అంటూ ఆయన ముందుకు వెళ్లిపోయారు. ఆ ఖండన ప్రకటనను తెప్పించుకుని పరిశీలించారు. తన తరఫున చేసిన సంతకం ఎవరిదని ఆరా తీశారు. ఆ సంతకం కాంతి రాణా టాటా చేసినట్లు తెలుసుకున్నారు. వెంటనే ఆయనకు ఫోన్ చేశారు. "నా హోదాతో మీరెలా సంతకం చేస్తారు? కనీసం నన్ను అడిగారా? ప్రకటన విడుదల గురించి ఒక మాటైనా చెప్పారా? విజయవాడ పోలీస్ కమిషనర్ సంతకం ఇంకెవరైనా చేస్తే మీరు ఊరుకుంటారా? దీనిపై మీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనే మీపై కేసు పెడతా" అని మీనా హెచ్చరించినట్లు సమాచారం. దీంతో 'పై నుంచి వచ్చిన ఆదేశాలు పాటించాను' అని టాటా బదులిచ్చినట్లు తెలిసింది.



Secretary, 12/2/2024
AP IPS Officers Association.


'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ఖండిస్తూ జారీ చేసిన ప్రకటనపై ఐపీఎస్ అధికారుల సంఘం కార్యదర్శి తరఫున టాటా చేసిన సంతకం.

డీజీపీకి ఫిర్యాదు...

ఈ విషయాన్ని మీనా సీరియస్‌గా తీసుకున్నారు. డీజీపీని కలిశారు. 'నాకు తెలీకుండానే నేను ప్రకటన విడుదల చేసినట్లు ఇచ్చారు. ఇది సరైన పద్ధతి కాదు. నిజంగా ఐపీఎస్‌లకు ఇబ్బంది కలిగితే అసోసియేషన్‌లో చర్చించాలి. అప్పుడు నేనే అధికారికంగా ప్రకటన విడుదల చేస్తా. కానీ... ఇలా చేయడం పద్ధతి కాదు" అని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై డీజీపీ ఆయనకు సర్ది చెప్పారు.

పీఎస్ఆర్ డైరెక్షన్‌లో...

కార్యదర్శి ఆర్కే మీనా అనుమతి లేకుండానే కాంతి రాణా టాటా ఎందుకు సంతకం చేశారు? ఎందుకీ అత్యుత్సాహం ప్రదర్శించారు? అనే అంశంపైనా ఆరా తీశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మనోభావాల ప్రకారం నడుచుకునే ఇంటెలిజెన్స్ అధిపతి పీఎస్సార్ ఆంజనేయులు డైరెక్షన్‌లోనే ఈ వ్యవహారం జరిగినట్లు మీనా విచారణలో తేలినట్లు సమాచారం. 'ఈ విషయాన్ని అంత సులభంగా వదలను. మీ పరిధిలోని పోలీసు స్టేషన్లోనే కంప్లైంట్ ఇస్తా' అని మీనా హెచ్చరించడంతో 'ఏరక్కపోయి సంతకం పెట్టి ఇరుక్కుపోయాను' అని కాంతి రాణా వాపోతున్నట్లు తెలిసింది! సర్కారు పెద్దల అండ ఉన్నందున ఇప్పటికిప్పుడు ఆయనకు ఏమీ కాకపోవచ్చు. కానీ, భవిష్యత్తులో కష్టాలు ఖాయమని ఐపీఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



కథా నిలయం 27వ వార్షికోత్సవం

సమాజం నుంచి రచయితగా ఆదరాభిమానాలను గౌరవాలను పొందినవారు సమాజానికి ఋణపడి ఉండాలన్నది కాళీపట్నం రామారావు గాఢంగా నమ్మిన విలువ. దాన్ని అనుసరించే క్రమంలో పుట్టిన ఆలోచనల ప్రతిరూపమే కథానిలయం. ప్రచురితమైన కథలన్నీ భద్రపరిచే ఆలోచనతో 1997లో దానికి ప్రారంభోత్సవం జరిగింది. అప్పటి నుంచి తెలుగు సాహితీ సమాజం దానికి అండగా నిలబడింది. పుస్తకాలు ఇచ్చింది. ధనం చేకూర్చింది. వార్షికోత్సవాలకు అనేక ప్రదేశాల నుంచి వచ్చి కథానిలయం ఆలోచనను అర్థం చేసుకుంది. ఇప్పుడు కథానిలయం వెబ్‌సైట్ కూడా ఏర్పడటంతో సమాచార వితరణకి మరికొంత వెసులుబాటు పెరిగింది. ఎందరో రచయితలు తాము భద్రపరుచుకోలేకపోయిన కథలను సంపుటాలుగా వేసుకోగలిగారు. కథానిలయానికి ఇతర ప్రాంతాలలో వార్షిక కలయికలు అనే ఆలోచన కాళీపట్నం రామారావు జీవితకాలంలో ఫలించలేదు. వారి తదనంతరం వివిధ ప్రాంతాలలో జరపాలని ప్రయత్నం ఆరంభించాం. తొలిసారిగా మిత్రసాహితి సహకారంతో విశాఖపట్నంలో 2023 ఫిబ్రవరిలో జరిపేం. ఈ సంవత్సరం వార్షిక కలయిక హైదరాబాదులో జరపటానికి అన్ని విధాల పూనుకున్నారు వాసిరెడ్డి నవీన్. ఫిబ్రవరి 24 శనివారం సాయంత్రం 5.45 నిమిషాలకు తెలుగు యూనివర్శిటీ ఆడిటోరియం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్‌లో జరిగే కథానిలయం 27వ వార్షికోత్సవ సభల్లో దాసరి రామచంద్రరావు, వకుళాభరణం రామకృష్ణ, దాసరి అమరేంద్ర, కాళీపట్నం సుబ్బారావు, వాసిరెడ్డి నవీన్ పాల్గొంటారు. సభలో 'సురవరం ప్రతాపరెడ్డి కథలు - ఆనాటి కథానేపథ్యం' అంశంపై సుంకిరెడ్డి నారాయణరెడ్డి; 'కథలు చెప్పే కథలు' అంశంపై కె. సునీతారాణి; 'నేటి కథాసాహిత్యంలో యువస్వరాలు' అంశంపై మహమ్మద్ ఖదీర్ బాబు ప్రసంగిస్తారు. వివరాలకు ఫోన్: 94900 08743.

వివిన మూర్తి

మాడభూషి రంగాచార్య పురస్కారం


మాడభూషి రంగాచార్య స్మారక కథాపురస్కారం 2023 సంవత్సరానికి ఉమానూతక్కి కథాసంపుటి '25వ గంట'ఎంపిక అయ్యింది. ఫిబ్రవరి25 సా.5.30గంటలకు కృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం, సుల్తాన్ బజార్, హైదరాబాద్‌లో జరిగే సభలో రచయిత్రికి రు.10వేల నగదు, జ్ఞాపిక ఇస్తారు.

మాడభూషి లలితాదేవి

'కూడలి చెట్టు' కవితా సంపుటి

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాలు, ఆసిఫాబాద్ కవుల సంఘం, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నల్లగొండ రమేష్ కవితా సంపుటి 'కూడలి చెట్టు' ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 25 మ.2 గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాదులో జరుగుతుంది. సభలో కందుకూరి శ్రీరాములు, నందిని సిధారెడ్డి, కె. శివారెడి తదితరులు పాల్గొంటారు.

కందుకూరి శ్రీరాములు



నాలుగెకరాల భూమి

భాషకు అందాన్ని సొగసునిచ్చే
శబ్ద అర్థాలంకారాల వలే
కొట్టంలో గాటికి కట్టేసిన
తెల్లెద్దు ఎర్రెద్దు మా ఇంటికి అలంకారాలు
ఏ ఆవుబిడ్డలో మా ఎద్దులు
భూమికి ఋణపడి పనిచేశాయి
పుట్టెడు వడ్లను బండికేస్తే
తువ్వపోంటి పోటీపడి లాగేవి

నాయెద్దు నాయెద్దు అని
తమ్ముడు నేను మురిసిపోయేటోళ్ళం
జొన్నరొట్టెలు పెట్టి మమల్ని సాకినట్లే
బుట్టి నిండా దానపెట్టి బుడ్డెద్దులను సాకిండు
రాముడు యుద్ధం గెలవడానికి
వానర సైన్యం తోడైనట్లుగా
నాలుగెకరాల భూమి దున్నడానికి
నాన్నకు బుడ్డెద్దులు తోడైనాయి
అపాయాన్ని ముందే పసిగట్టే జింకవలే
తీసుకున్న అప్పుకు వడ్డీ రెండింతలు
వసూలు చేసే మోసాన్ని పసిగట్టిండు

పదవీవిరమణ చేసిన ఉద్యోగిని
గౌరవంగా సన్మానించినట్లే
భూమికోసం పనిచేసిన బుడ్డెద్దులను
పదవీవిరమణ చేయించి సత్కరించాడు
కూతురు పెళ్లి చేసి పంపుతున్నప్పుడు
తల్లిదండ్రులు పట్టుకోని ఏడ్చినట్లే
సంతలో బుడ్డెద్దులను అమ్మినప్పుడు
గుండెలకద్దుకోని ఏడ్చాడు
ఒకటి కావాలంటే మరొకటి వదులుకోవాలన్నట్లుగా
బిడ్డల చదువులు కావాలనుకుండు
నాలుగెకరాల భూమి అమ్ముకుండు

గుర్తింపు కోసం ఆధార్ కార్డు చూస్తున్నట్లు
పెళ్లి సంబంధానికి భూమి అడుగుతుంటే
అసలుకు రెండింతలు వడ్డీ కట్టిన రోజులను
నాన్న నెమరువేసుకుంటున్నాడు
నాలుగెకరాల భూమిలో పారిన
తన రెక్కల కష్టాన్ని యాది చేసుకుంటుండు
బిడ్డల జీవితాలే ముఖ్యమనుకున్న
మా నాన్న భూమిలేనివాడైండు

ఎజ్జు మల్లయ్య
96528 71915



వాళ్లు వొచ్చారు

వాళ్ల ఊరికెనే రాలే
అడవి పరిమళాన్ని మోసుకు వచ్చారు
పుట్టెడు దుఃఖాల్నీ, అనంత కోపాలనూ
ప్రకటించడానికే వచ్చారు

మైదానం మీద నమ్మకంతో
అడవిని దాటుకు వచ్చారు.

పొలాల్ని చదవడం తప్ప
పెద్దగా పుస్తకాలు చదివింది లేదు
పొడిపొడి మాటలు తప్ప
పెద్దగా ఉపన్యసించిందీ లేదు
మాటల మధ్య ఖాళీలకు
మనసద్ది చూస్తే మాత్రం
మనకు ఒక బస్తరు కనబడుతది
ఒక బాస గూడ భగ్గు మంటది
కార్పొరేట్ మైనింగుల్లో
ఊపిరాడని శ్వాసల్ని వింటాం
తెగిపడ్డ దేహాల హాహాకారాల్నీ వింటాం

భావం చేరడానికి
భాష ఎప్పుడు పెద్దగా అడ్డురాలేదు
కరచాలనాలన్నీ
నదీ సంగమాలై పోయాయి

వాళ్ల అట్లా సభా ప్రాంగణంలో తిరుగాడుతుంటే
అడవి మా చుట్టే
తిరుగాడుతున్నట్టనిపించింది
మెట్ల మీద కూర్చొని
గలగల నవ్వుతుంటే
ఇంద్రావతి
మా కాళ్ళను చుట్టేసినట్టే అనిపించింది.

వేదిక మీద లయబద్ధ విన్యాసం
అనేక జలపాతాల పోరు
అది సిలింగేరు జోరు

ఈ నగరాన్ని చూసి
మాకు సంతోషమయిందని
వాళ్ల మాట వరసకు అన్నారేగాని
నిజానికి
నగరమే వాళ్ళని చూసి మురిసిపోయింది

వాళ్లకు సలాం...

(విరసం సభల్లో సిలింగేర్ ఉద్యమకారులను చూసి)

ఉదయమిత్ర
89196 50545

సోమవారం 19 ఫిబ్రవరి 2024

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

వాస్తవాన్ని పరిపూర్ణం చేసేది కల్పనే!

'Art is a lie that enables us to realize the truth.' – Pablo Picasso

బహుశ 1976లో... కృష్ణా పత్రికలో ఎ. నారాయణ మూర్తి అనువదించిన ఒక ఆంగ్ల నవల సీరియల్‌గా వచ్చినప్పుడు.. అది చదువుతూ నేను ఆశ్చర్యపోవడమే కాదు, అందులోని ఘట్టాలు, సన్నివేశాలు నమ్మశక్యం కానివిగా, అభూత కల్పనలుగా భావించాను కూడా. చారిత్రిక ఉదంతాలు, రాజకీయ సంఘటనల నేపథ్యంలో అల్లిన ఒక నిండైన ప్రేమ కథలా, ఆసక్తికరమైన చిక్కటి ప్లాట్‌తో, నాలుగు భాగాలుగా సాగిన ఆ నవల ప్రధానంగా హుకుం చంద్ (జిల్లా మేజిస్ట్రేట్) అనే పాత్ర దృష్టి కోణంలో నడిచింది. జరుగుతోన్న అల్లర్లు, మత కల్లోలాలు చెదరుమదరు ఘటనలనీ, త్వరలోనే అంతా సర్దుకుని శాంతి నెలకొంటుందని మొదట భావించిన అతడు- మత విద్వేషాలు కార్చిచ్చులా వ్యాపించి దారుణ మారణకాండకు దారితీయడం గమనించి, చేజారిపోతోన్న పరిస్థితులకు కారణమైన ఢిల్లీలోని రాజకీయ నాయకులను తిట్టుకుని, తన నిస్సహాయ స్థితికి ఖిన్నుడై, చివరికి తన పరిధిలో కొన్ని మంచి నిర్ణయాలు తీసుకుంటాడు, లాకప్‌లో వున్నవారిని విడిచి పెట్టమని ఇన్‌స్పెక్టర్‌ని ఆదేశిస్తాడు. సైనికాధికారి వచ్చి విషయం చెప్పి ప్రభుత్వ ఆదేశాలు వివరించినప్పుడు, హుకుం చంద్ పోలీసులు వెంటరాగా రైల్వేస్టేషన్‌కి వెళ్లి స్వయంగా రైలు పెట్టెల్లోని గుండెలవిసే దృశ్యం చూసి వాస్తవ పరిస్థితి తీవ్రత తెలుసుకుంటాడు. "రైలు స్టేషన్లను దాటుకుంటూ వెళ్లేందుకు వీలుగా డ్రైవర్‌ను, గార్డును మాత్రం ప్రాణాలతో వదిలారు." పోలీసులు, సైనికులు కలిసి ప్రతి ఇంటి నుంచి కిరసనాయిల్, కట్టెలు ఎందుకు సేకరిస్తున్నారో మనోమజ్రా గ్రామ ప్రజల ఊహకు అందదు, ఎవరినీ అడగలేరు. రకరకాల వార్తల నేపథ్యంలో సరిహద్దు గ్రామాల ప్రజలు దిక్కు తోచని స్థితిలో పిల్లాపాపలను చంకనేసుకుని మూటాముల్లెలతో తరలిపోతుంటే సైనికులు కాల్పుల హెచ్చరిక చేసి నిలువరిస్తారు, సరిహద్దు దాటిపోవాలనుకున్న వాళ్ళను ముందస్తు ప్రకటనతో సమీకరించి, క్యాంపులో దింపేందుకు ట్రక్కుల్లోకి ఎక్కిస్తారు. ఊరి బయట పొలిమేరల్లో కనపడిన దృశ్యం- "...నీలి-బూడిద రంగులోకి మారిన దిఙ్మండలం మళ్ళీ నారింజ రంగులో ప్రకాశించింది. నారింజ వర్ణం క్రమంగా తామ్రవర్ణంగా, పిదప జ్వాజ్వల్యమానమైన కావిరంగుగా మారింది. ఎర్రని అగ్నిజ్వాలలు నల్లని ఆకాశంలోకి ఎగిశాయి. ఒక చల్లని గాడ్పు ఊరి దిక్కుగా మెల్లగా వీచనారంభించింది. మండుతోన్న కిరోసిన్.. ఆ తర్వాత కట్టెల వాసనని.. అది మోసుకొచ్చింది. ఆ వెంటనే కాలుతోన్న మాంసపు కమురు వాసన గాలిలో తేలివచ్చింది..."

దీన్నిబట్టి మనోమజ్రా గ్రామస్తులు లాహోర్ నుంచి రైలు ఏమి మోసుకు వచ్చిందో గ్రహించగలుగుతారు..

సాహిత్యాన్ని స్థూలంగా ఫిక్షన్ - నాన్‌ఫిక్షన్ అని వర్గీకరిస్తాం. కథలు, నవలలు, నాటకాలు, కావ్యాలు ఫిక్షన్ కోవకి; శాస్త్ర విజ్ఞాన/ చరిత్ర/ పరిశోధన/ విమర్శ/ విశ్లేషణ వ్యాసాలు, యాత్రా కథనాలు, జీవిత గాథలు, ఆత్మకథలు, పాత్రికేయ రచనలు, ఇంటర్వ్యూలు.. ఇవన్నీ నాన్‌ఫిక్షన్ కోవకి చెందుతాయి. ఫిక్షన్ అంటే కాల్పనికం, నాన్‌ఫిక్షన్ అంటే వాస్తవికం... అనే సాధారణ అభిప్రాయం ఒక వర్గం విద్యావంతులలో చెలామణిలో వున్న నేపథ్యంలో 'నిజం కాని' కల్పనని అనుమానించడం, 'యదార్థమైన' వాస్తవాన్ని అభిమానించడం సహజం. వాస్తవం నిస్సందేహంగా ఒక విషయం 'నిజంగా జరిగింది' అనే అర్థాన్నే స్ఫురింప జేస్తుంది; కాల్పనికం ఎల్లప్పుడూ ఒక 'ఊహించిన/ సృజియించిన విషయం'గానే ధ్వనిస్తుంది. అయితే, చాలా ఏళ్ల తర్వాత, ఈ 'Train to Pakistan' (1956, కుష్వంత్ సింగ్) నవలని మూలభాష ఇంగ్లిష్‌లో చదివాక, అదే పేరుతో 1998లో వచ్చిన దాని ఫిలిం అడాప్టేషన్ (పమీలా రూక్స్ దర్శకత్వంలో) చూశాక నా అభిప్రాయాలు, ఆలోచనలు మారాయి. 'నిజంగా జరిగింది (fact)', 'ఊహించి రాసింది (fiction)' - అనే ఈ రెండూ సత్యాన్ని ప్రతిష్ఠించడంలో సమాన పాత్ర వహిస్తాయి అని అర్థమైంది. 'The Ice candy Man' (బాప్సి సిధ్వా నవల), 'Tamas' (భీష్మ సహాని నవల), 'పింజర్' (అమృతా ప్రీతం పంజాబీ నవల), 'A Flight of Pigeons' (భారతీయాంగ్ల రచయిత రస్కిన్ బాండ్ నవలిక), 'Difficult Daughters' (మంజు కపూర్ 1998 నవల)... ఈ పుస్తకాలన్నీ చదివాక ఫిక్షన్ గురించిన నా సానుకూల అభిప్రాయం బలపడింది.

ఒక పని లేదా ఘటన జరిగింది అంటే అది గతం లోకి జారిపోయింది. వర్తమానంలో దానికి భౌతిక అస్తిత్వం లేదు. దాని పర్యవసానాలు, ఫలితాలు ఇంకా వుంటే వుండవచ్చు. దానిని పూర్వ రూపంలో సూచనప్రాయంగా చిత్రించిన/ ప్రతిబింబించిన అక్షర లేదా రేఖా చిత్రణలు ఉండవచ్చు. 1857లో సిపాయిల తిరుగుబాటు, భారత స్వాతంత్ర్యానంతర దేశవిభజన (1947) నాటి కల్లోల పరిస్థితులు, రక్తపాతం, మారణహోమం, 1940-48లలో జరిగిన నైజాం వ్యతిరేక పోరాటాలు, రజాకార్ల అకృత్యాలు... ఇవన్నీ జరిగిపోయిన ఘటనలు.

ఇవేగాక ప్రపంచ చరిత్రలో అనేక ఘటనలకు సంబంధించిన సమాచారం (factual information?) కాస్తా వివరంగానో, అరకొరగానో చరిత్ర పుస్తకాలు, ఆర్కైవ్స్, క్రానికిల్స్, ప్రభుత్వ డాక్యుమెంట్స్... తదితర ఆకరాలలో నిక్షిప్తమై వుంటే ఉండవచ్చు. కానీ, మానవ జాతి చారిత్రిక ప్రస్థానంలో సంభవించిన అనేక రాజకీయ పరమైన, ఆర్థిక పరమైన ముఖ్య ఘటనలు, అవి స్థూలంగా మానవ సమాజంపై, నిర్దిష్టంగా మనుషుల వ్యక్తిగత జీవితాలపై పడవేసే ప్రభావం వివరంగా 'ఫిక్షన్' లోనే నమోదై వుండి ఒక తరం నుండి మరో తరానికి తెలియ వస్తుందనేది కాదనలేని సత్యం. మరో విధంగా చెప్పాలంటే, భౌతికంగా అస్తిత్వంలో లేని వాస్తవాన్ని అక్షరబద్ధం చేసి దానికి శాశ్వతత్వం కట్టబెట్టేది కాల్పనికమే!

వాస్తవం, కాల్పనికం... ఈ రెండింటి నడుమ వుండే చిత్రమైన సంబంధాన్ని మరింత స్పష్టంగా చూడాలనుకుంటే మనం ఈ రెండూ అత్యంత సన్నిహితంగా సంచరించే 'చరిత్ర' అనే అంశంలోకి అడుగుపెట్టాలి. చరిత్ర అంటే ఒక అర్థంలో గతకాలపు ఘటనల రాశి లేదా పరిణామాల పరంపర: మరో అర్థంలో, గతంలో జరిగినవని భావించిన ఘటనలకు సంబంధించిన వ్యాఖ్యానాల, జనవాక్యాల అక్షరీకృత రూపం- అంటే దస్తావేజు. గతకాలాల ఘటనలరాశిగానూ, ఆ ఘటనలకు సంబంధించిన 'గాథ' గానూ చరిత్ర మనకు స్ఫురిస్తుందన్న మాట. దీనిని బట్టి, చరిత్రకు వాస్తవం, కాల్పనికం అనే ద్వంద్వ రూపాలున్నాయన్నది స్పష్టమవుతున్నది. సమకాలీన చరిత్రగతిని ప్రత్యక్షంగా, సంపూర్ణంగా వీక్షించడం

> **మానవ జాతి చారిత్రిక ప్రస్థానంలో సంభవించిన అనేక రాజకీయ పరమైన, ఆర్థిక పరమైన ముఖ్య ఘటనలు, అవి స్థూలంగా మానవ సమాజంపై, నిర్దిష్టంగా మనుషుల వ్యక్తిగత జీవితాలపై పడవేసే ప్రభావం వివరంగా 'ఫిక్షన్' లోనే నమోదై వుండి ఒక తరం నుండి మరో తరానికి తెలియ వస్తుందనేది కాదనలేని సత్యం. మరో విధంగా చెప్పాలంటే, భౌతికంగా అస్తిత్వంలో లేని వాస్తవాన్ని అక్షరబద్ధం చేసి దానికి శాశ్వతత్వం కట్టబెట్టేది కాల్పనికమే!**



ఎవరికీ సాధ్య పడదు. బ్రిటిష్ ఇండియాలో 1857 సిపాయిల తిరుగుబాటు పరిణామాలు, ద్వేషంతో రగిలిపోయిన భారతీయులు ఆంగ్లేయులపై సాగించిన హత్యాకాండ, దయాళువులైన దాదీలు ప్రాణాలకు తెగించి బ్రిటిష్ కుటుంబాలను రక్షించిన వైనం; లాహోర్ నుంచి హిందువుల, సిక్కుల, గురుదాస్ పూర్ నుంచి ముస్లిముల పీనుగులతో, కోసివేయబడిన స్త్రీల వక్షోజాల మూటలతో నిండిన రైలుపెట్టెలు, ఆడవాళ్ళ కిడ్నాపులు, హత్యలు, తలల నరికివేతలు, వయోభేదం చూడని అత్యాచారాలు, బలవంతపు నిఖాలు, ఆత్మరక్షణకై మతమార్పిడులు, నీటికి బదులు కిరోసిన్ చిమ్మిన అగ్నిమాపక దళాలు, లూటీలు, గృహదహనాల్లో సర్వం కోల్పోయి శోక తప్త హృదయాలతో పుట్టిన గడ్డ పైనే కాందిశీకులై శిబిరాల్లో తలదాచుకున్న ప్రజలు, వారి దీన, హీన స్థితిగతులు: నాజీ కాన్సెన్‌ట్రేషన్ క్యాంపుల్లోని ఘోర దురంతాలు, దహన బట్టీలలో, గ్యాస్ చాంబర్‌లలో యూదుల మూకుమ్మడి వధ, అథో మానవ పరిస్థితుల్లో ఆకలికి తాళలేని ఖైదీలు తలలు పేల్చివేయబడిన రష్యన్ యుద్ధ ఖైదీల పచ్చి మెదడుని ఆరగించిన వైనం; ఒక వైపు మొదటి ప్రపంచయుద్ధం, మరోవైపు బోల్షివిక్ విప్లవం రష్యాని అతలాకుతలం చేసిన సందర్భంగా రెడ్‌ఆర్మీ, జార్ సైన్యాలు, డాన్ నదీ తీర ప్రాంత కోసక్కుల మధ్య జరిగిన దారుణ రక్తపాతం, ప్రజల జీవితాల్లోని కల్లోలం; నైజాం నిరంకుశ పాలన కాలంలో రజాకార్ల దుర్మార్గాలు, తెలంగాణ ఫ్యూడల్ దొరల ఘాతుకాలు, ప్రజల బాధలు, పోరాటాలు... వీటిని ఎవరైనా చరిత్రకారుడు నేరుగా చూసి ఉంటాడని భావించలేము. బాధితుల అనుభవాలు, భౌతిక అవశేషాలు, ఆనవాళ్ళు, వార్తాకథనాలు, ఛాయాచిత్రాలు, శాసనాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, రికార్డులు, కైఫీయతుల ఆధారంగానే చరిత్రకారుడు గత చరిత్రను నిర్మిస్తాడు.

చరిత్రకు 'గాథ' మూలం కాబట్టి చరిత్ర నుంచే 'కథ' వ్యుత్పన్నమైనదని విదితమవుతుంది. 'వాస్తవం' కలకాలం నిలవాలంటే 'కాల్పనికం' అవాల్సిందే. ఈ కోణం లోంచి చూసినప్పుడు కాల్పనికం (fiction) వాస్తవానికి (fact) విరుద్ధమైనది కాదు, పైపెచ్చు దానికి పరిపూరకం.

ఆధునిక భారతదేశ చరిత్రలో దేశవిభజన ఒక నెత్తుటి మరక. దేశం రెండుగా చీలి పాకిస్తాన్ అనే కొత్త రాజ్యం ఏర్పడ బోతున్నదన్న ప్రకటన 1947 వేసవిలో వెలువడగానే దాదాపు ఒక కోటి మంది ప్రజలు సరిహద్దు ఇరువైపులా వలస బాట పట్టారు; వర్షాకాలం ప్రవేశించే సమయానికి దాదాపు 10 లక్షల మంది మరణించారు; ఉత్తర భారత్ యావత్తు ఆయుధాలు చేతపూని పిచ్చిభయంతో నిద్రలేని రాత్రుళ్ళు గడిపింది. మత విద్వేషాల కారణంగా చెలరేగిన అప్పటి కల్లోలం అమాయక ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేసిన తీరుని, పంజాబ్‌లోని ఒక కల్పిత ప్రదేశం (మనోమజ్రా ఊరు) నేపథ్య సెట్టింగ్‌గా, అద్భుతంగా చిత్రించిన క్లాసిక్ 'ట్రెయిన్ టు పాకిస్థాన్'. హిందూ, ముస్లిం, సిక్కు స్నేహితుల మైత్రికి దేశవిభజన పెట్టిన చిచ్చు, మత విద్వేషానికి బలైపోయిన శాంత అనే హిందూ యువతి దీనగాథ... లెన్నీ అనే పార్సీ బాలిక దృష్టికోణంలో ఆర్ద్రంగా చిత్రించిన నవల 'ద ఐస్‌కాండీ మేన్'. హిందూ-ముస్లిముల విద్వేషాలకు బలిపశువై, కుటుంబాల పరువు ప్రతిష్ఠల మాటున అస్తిత్వాన్ని కోల్పోయి, పురుషాధిపత్య పద ఘట్టనల కింద జీవచ్ఛవంలా నలిగిన పూరో అనే అభాగ్య స్త్రీ వ్యథాభరిత జీవితాన్ని అక్షరీకరించిన నవలిక 'పింజర్'.

అక్టోబర్ విప్లవం, తదనంతర అంతర్యుద్ధం నేపథ్యంలో, కోసక్కుల ఆరాటాలు పోరాటాలు ఇతివృత్తంగా, నాటి అల్లకల్లోల పరిస్థితుల్లో రష్యన్ ప్రజల జీవితాన్నిసర్వ దిగ్దర్శకంగా, రాజకీయ, చారిత్రిక, మిలిటరీ, రొమాన్స్ కోణంలో- రెడ్‌ఆర్మీ దళాల మితి మీరిన చర్యలతో సహా- చిత్రించిన బృహత్ నవల 'And Quiet Flows the Don'. దీని రచయిత మిఖాయిల్ షొలకోవ్ 1965లో సాహిత్యానికి నోబెల్ ప్రైజ్ అందుకున్నాడు. జర్మన్ పాలకుడు విల్హెల్మ్ కైజర్ ప్రేరేపించిన ఫ్రాన్స్‌తో యుద్ధంలో (1916) పాల్గొన్నప్పటి స్వీయానుభవాలను, యుద్ధం విగిల్చిన విషాద జ్ఞాపకాలను, పౌర జీవితంతో ఎడబాటుకి సంబంధించి సైనికుల శారీరక, మానసిక మనో వేదనని 'All Quiet on the Western Front'లో జర్మనీ రచయిత ఎరిచ్ మారియ కళ్ళకు కట్టినట్టు రెమార్క్ చిత్రించాడు. యుద్ధవ్యతిరేక నవలల్లో ఇది మొదటి స్థానం ఆక్రమిస్తుంది. వియెత్నాం యుద్ధంలో ఒక అమెరికన్ సైనిక ప్లాటూన్ అనుభవాల్ని అనేక ఎపిసోడ్స్‌గా చిత్రించిన 'The Things They Carried' కథా సంపుటి ద్వారా యుద్ధం ఒక వృథాప్రయాస అని నర్మగర్భంగా ప్రకటించిన టింఒ'బ్రియన్‌తో ఏకీభవించకుండా, తీవ్రంగా ప్రతిఘటించిన వియెత్నాం ప్రజల పట్ల సానుభూతి చూపకుండా ఉండలేము. తీవ్ర క్షుద్బాధ, చావుభయం అనుక్షణం వెంటాడే పరిస్థితుల్లో (నాజీ కాన్సంట్రేషన్ క్యాంపుల్లో) ఎలాగోలా బతకడమే పరమావధి అనుకున్న మనిషి ఎంతటి అనైతిక, అమానవీయ, అథో స్థితికి దిగజారుతాడో పోలిష్ కవి, రచయిత బోరోవ్‌స్కీ స్వీయానుభవాల క్వాజీ-కథలు 'This is the Way for the Gas, Ladies and Gentlemen' అద్దం పడతాయి. ఇవి మనల్ని నిద్ర పోనీయవు. ఆధునిక నాగరికత విలువలను అపహాస్యం చేసిన నియంతల యుద్ధోన్మాదం, విజ్ఞానశాస్త్ర దుర్వినియోగం, అది ప్రేరేపించిన హోలోకాస్ట్... వీటి గురించి విరివిగా వచ్చిన దేశ విదేశాల కాల్పనిక సాహిత్యం (ఫిక్షన్) చరిత్ర వేసిన తప్పటడుగులను మనకు నిత్యం గుర్తు చేస్తుంది.

ఆడెపు లక్ష్మీపతి
97012 27207

"తెలుగు ముస్లిం కథకు ఆదరణ పెరిగింది" - వేంపల్లె షరీఫ్

తెలుగు ముస్లిముల జీవన వైవిధ్యాలను, సంస్కృతీ సంప్రదాయాలను, పేదరికాన్ని శక్తిమంతంగా సాహిత్యంలోకి తెస్తున్న కొద్దిమంది కథకుల్లో వేంపల్లె షరీఫ్ ఒకరు. అలా అని షరీఫ్ ముస్లిం కథకుడు అంటూ ముద్రవేసి చూడటం పెద్ద మర్రిచెట్టును బోన్సాయ్ మొక్కగా కుండీలో కుదించి చూపడమే అవుతుంది. ఇతివృత్తం ఎంపికలో, కథానిర్మాణంలో, పాత్రల చిత్రీకరణలో, మొత్తం కథను ఉత్తమంగా మలచడంలో అతనిదొక ప్రత్యేకత.

కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కారం పొందిన 'జుమ్మా' కథల సంపుటితో పాటు 'టోపి జబ్బార్' అనే మరో కథల సంకలనాన్ని షరీఫ్ వెలువరించారు. మరో కథకుడు ఖదీర్ బాబుతో కలసి ముస్లిం నేపథ్య కథల సంకలనం 'కథామినార్' వెలువరించారు. ఇటీవలే తెలుగులో 40 ఏళ్లలోపు వయసున్న యువ కథకుల సంకలనం 'యువ-అండర్ ఫార్టీ'ని తీసుకొచ్చారు. ఇటీవల రాసిన 'మట్కా' కథను కేస్ స్టడీగా తీసుకుని కథ వెనక కథను నెమరు వేసుకున్నారు. తెలుగులో ముస్లిం సాహిత్యం స్థితిగతులనూ తలపోసుకున్నారు.

సంభాషణ: **గోవిందరాజు చక్రధర్**

ఇటీవల షరీఫ్ రాసిన 'మట్కా' కథ నేపథ్యం...

రాయలసీమలోని చాలా ఊళ్లలో ఇప్పటికీ మట్కా జాడ్యం వేళ్లూనుకుపోయి ఉంది. వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరులో కొంతమంది తెలిసినవాళ్ల మట్కా ఆడుతుంటే గమనించేవాణ్ణి. పేదరికంలో ఉన్న వారిని ఆశల పల్లకిలో ఊరేగిస్తోంది మట్కా. ఈ సమస్యపై కథ రాయాలని చాలా కాలంగా అనుకుంటున్నాను. మట్కాకు ప్రాంతాన్ని బట్టి రకరకాల పేర్లున్నాయి. కొన్ని చోట్ల దీన్ని బ్రాకెట్ అంటారు. కథలో మొదట నసీమూన్ పాత్ర ప్రతికూల పాత్రపై తిరుగుబాటు చేసినట్టు రాసుకున్నాను కానీ ఆ పాత్ర తిరుగుబాటు చేయడానికి నిరాకరించింది. పాత్ర చెప్పినట్టు వినాల్సి వచ్చింది.

> **ఇప్పుడున్న పరిస్థి తుల్లో ముస్లిం సాహిత్య అవసరాన్ని పాఠకులు, మేధావులు, పాత్రికేయులు గుర్తిస్తున్నారు. ఒక్క తెలుగులోనే కాదు ఇతర భాషల్లోనూ మైనార్టీ సాహిత్యానికి ఆదరణ పెరిగింది. అయితే తెలుగులో విమర్శ ముస్లిం కథ మీద అనుకున్నంత రాలేదు. మైనార్టీ సాహిత్య పరిధిని కుదించి చూడటం లేదా ఆ జీవితాన్ని దగ్గరగా పరిశీలించిన అనుభవం, ఆసక్తి లేకపోవడం అందుకు కారణం కావొచ్చు.**

పాత్ర గొప్పదా? రచయిత గొప్పవాడా?


పాత్రే గొప్పది అంటాను. ఎందుకంటే రచయిత పాత్రను సృష్టిస్తాడు. తర్వాత దాని గమ్యాన్ని అదే వెతుక్కుంటుంది. బలవంతంగా దాన్ని కంట్రోల్ చేయాలని చూస్తే కథ ఔచిత్యం దెబ్బతినే అవకాశం ఉంది. నా కథల్లో నేను చాలా సార్లు పాత్రల మాటే విన్నాను. నేనేదో అనుకుని మొదలు పెడితే పాత్ర ఇంకేదో అనుకుని అర్థాంతరంగా ముగిసిపోతుంది. మంచి రచయిత పాత్ర మాటే వింటాడని నా నమ్మకం. అయితే కథ ప్రధాన అంశాన్ని నిర్దేశించేది మాత్రం రచయితే.

ప్రతి కథా ఒక సవాలే!

నేను రాసిన 'తలుగు' అనే కథ కూడా నాకు మంచి పేరు తెచ్చి పెట్టింది. కులాలే లేవు అని నమ్మే ముస్లిం సమాజం కుల వ్యవస్థను ఎలా పాటిస్తుందో చెబుతూనే మొత్తం ముస్లిం సమాజాన్ని మెజార్టీ సమాజం ఎలా చూస్తుందో చెప్పే ప్రయత్నం చేశాను. ముస్లిముల్లో నువ్వు ఏ ఉపకులానికి చెందినవాడివైనా సరే అంతిమంగా మెజార్టీ సమాజం పెట్టే పరీక్షకు నిలబడాల్సిందే అనే అర్థాన్ని కూడా ప్రభావవంతంగా ఇవ్వదల్చుకున్నాను.

ఇలాంటి సమకాలీన, రాజకీయ, సాంస్కృతిక అంశాల కథలు రాస్తున్నప్పుడు ఇతర ఏ వర్గ రచయితకు లేని సవాళ్లు ముస్లిం రచయితకు ఎదురవుతాయి. కథలో లేని అర్థాలు ధ్వనించి ఏ వర్గం మనోభావాలు దెబ్బతిన్నా కథ ఉద్దేశ్యం నెరవేరదు. అందుకే స్వతహాగానే కథ రాయడం ఒక సవాలైతే ఇలాంటి ఇతి వృత్తాలతో రాయడం డబుల్ సవాల్. కథా లక్షణాలను పట్టించుకుంటూనే ఈ విషయాలను సమర్థవంతంగా రాయడంలో తెలుగు ముస్లిం కథకులు మంచి పరిణితితో వ్యవహరిస్తున్నారని నా అవగాహన.

ముస్లిం కథకు ఆదరణ పెరుగుతోంది



గతంతో పోల్చుకుంటే ఇప్పుడు తెలుగులో ముస్లిం కథకు ఆదరణ పెరిగింది. దేశ పరిణామాలను ఇవ్వాళ ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోగలుగుతుండటమే అందుకు కారణమని నేను భావిస్తాను. ఇప్పుడున్న పరిస్థితుల్లో ముస్లిం సాహిత్య అవసరాన్ని పాఠకులు, మేధావులు, పాత్రికేయులు గుర్తిస్తున్నారు. ఒక్క తెలుగులోనే కాదు ఇతర భాషల్లోనూ మైనార్టీ సాహిత్యానికి ఆదరణ పెరిగింది. అయితే తెలుగులో విమర్శ ముస్లిం కథ మీద అనుకున్నంత రాలేదు. మైనార్టీ సాహిత్య పరిధిని కుదించి చూడటం లేదా ఆ జీవితాన్ని దగ్గరగా పరిశీలించిన అనుభవం, ఆసక్తి లేకపోవడం అందుకు కారణం కావొచ్చు.

తెలుగులో ముస్లిం సాహిత్యం ఎవరు చదువుతున్నారు?

ఇది చాలా కీలకమైన ప్రశ్న. చాలామంది ముస్లిం రచయితలు తెలుగులో రాస్తున్నారు అంటే తెలుగొచ్చిన మెజారిటేరియన్లతో పాటు ముస్లిములు చదువుతారు. అయితే తెలుగు చదివే ముస్లిములు ఎంతమంది ఉన్నారనేది కచ్చితమైన లెక్కల్లేవు.

పైనుంచి గమనిస్తే మిగతా సమాజంతోపాటు ముస్లిములు కూడా తమ పిల్లలను ఇంగ్లిషు మీడియంలోనే చదివిస్తున్నారు. మదర్సాల్లో కూడా ఇంగ్లిష్ మీడియం అందుబాటులో ఉంది. ఒకవైపు ఉర్దూ మీడియం, మరోవైపు ఇంగ్లిష్ మీడియం చదువుతున్న పిల్లలు ముస్లిముల్లో పెరుగుతున్నారు. వీరికి తెలుగు సాహిత్యంతో ఏమాత్రం సంబంధం లేకుండా పోతోంది. అటు తెలుగు, ఉర్దూ రచయితల మధ్య సమన్వయం లేదు. వీరు అనువాదంతో ఆదాన ప్రదానాలు కూడా చేసుకోవడం లేదు. దీంతో అపార్థాలు వస్తున్నాయి. తెలుగు సాహిత్యం రాసే ముస్లిములు పూర్తిగా సొంత సమాజానికి వ్యతిరేకంగా రాస్తున్నారని కొంతమంది ఉర్దూ రచయితలు, ఉర్దూలో రచనలు చేసే వాళ్ల పూర్తిగా మతానికి అనుగుణంగా రాసి దాని పరిధి కుదిస్తున్నారని కొంతమంది తెలుగు రచయితలు భావిస్తున్నారు. వీళ్లిద్దరూ ఆ పరిధులు దాటి అపోహలను తుడిచేసుకోవాల్సిన సమయం వచ్చిందని అనుకుంటున్నాను.

మరి ఇన్ని అవరోధాల మధ్య తెలుగు ముస్లిం సాహిత్య ఉద్దేశ్యం నెరవేరుతోందా?

అసలు మొత్తం సాహిత్య ఉద్దేశ్యమే నెరవేరుతోందా లేదా అనేది ఇవ్వాళ ఎవరికి వారు తేల్చుకోవాల్సిన అంశం. ఎందుకంటే ప్రతి సాహిత్యానికి దాని పరిధిలో కొన్ని అవరోధాలు ఉండి తీర్తాయి. అంతమాత్రాన నిరుత్సాహ పడాల్సిన పనిలేదు.

మొత్తం ముస్లిం సాహిత్యం గురించి కాకుండా కథా సాహిత్యం గురించి నేను కొంత చెబుతాను. తెలుగులో ముస్లిం కథ ప్రధానంగా రెండు రకాలుగా వస్తోంది. మొదటిది సొంత సమాజంలో సంస్కరణలను ఆశిస్తోంది. ఈ రకం సాహిత్యం 1980ల ప్రాంతం నుంచే ఉంది. ఆ మాటకొస్తే తెలుగులో తొలి ముస్లిం కథ పుట్టిందే అంతర్గత సంస్కరణ కోసం. ఈ సాహిత్యం మరి అంతర్గత సమాజం దగ్గరికి పూర్తి స్థాయిలో వెళ్తోందా.. అంటే నేను అంతకు ముందు చెప్పిన అవరోధాలు ఉన్నాయి.

ఇక రెండో రకమైన సాహిత్యం.. మెజార్టీ సమాజానికి ముస్లిములపై ఉన్న అపోహలను తొలగించే సాహిత్యం. దీనికి ఎలాంటి భాషాపరమైన అవరోధాలు లేవు కదా. అందుకే అవకాశం ఉన్నంతవరకు ఈ సాహిత్యం తన ఉద్దేశ్యాన్ని తప్పక నెరవేస్తోంది. ముస్లిం కథకు తెలుగు కథాభిమానుల దగ్గర్నుంచి వస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనం.

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ సందర్భంగా మాతృభాషల ప్రాధాన్యత అంశం మీద విజయవాడ లయోల కళాశాలలో, ఆ కళాశాల సహకారంతో సదస్సు జరుగుతుంది. ఇందులో పాపినేని శివశంకర్, ఫాదర్ కిషోర్, గారపాటి ఉమామహేశ్వరరావు, వేంకటేశ మాచకనూర్ (కన్నడ), ఇందు మీనన్ (మలయాళం), ఎల్.రామమూర్తి(తమిళం)లు పాల్గొంటారు. పలుభాషల కవుల నుంచి కవితాపఠనం ఉంటుంది.

బండ్ల మాధవరావు

'నాగలి కూడా ఆయుధమే..!' కవితా సంపుటి

కొమ్మవరపు విల్సన్ రావు కవితా సంపుటి 'నాగలి కూడా ఆయుధమే..!' ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 25 ఉదయం 9:30కి మీటింగ్ హాల్, యు.టి.ఎఫ్.కార్యాలయం, శ్రీకాకుళంలో జరుగుతుంది. సభలో కె. శ్రీనివాసు (సాహితీ స్రవంతి కన్వీనర్), అట్టాడ అప్పలనాయుడు, కలిమి శ్రీ, కె.జి.వేణు, కె. ఉదయ్ కిరణ్, పాయల మురళీ కృష్ణ, బాల సుధాకర్‌మౌళి, కంచరాన భుజంగ రావు, సాంబమూర్తి లండ పాల్గొంటారు.

సాహితీ స్రవంతి

భూతపురి సాహిత్య పురస్కారం

భూతపురి సుబ్రహ్మణ్యశర్మ 87వ జయంతి సందర్భంగా 22వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం ఫిబ్రవరి 25 ఉదయం 10.00 గంటలకు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడపలో జరుగుతుంది. కవి, విమర్శకులు, గ్రంథ పరిష్కర్త వైద్యం వేంకటేశ్వరాచార్యులు పురస్కారంగా రూ.10,116/- నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకుంటారు. వివరాలకు: 9966624276.

భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.8 కనిష్ఠం 17.7



జన సందోహం

పుస్తక మహోత్సవ ప్రాంగణం ఆదివారం సందర్శకులతో కిటకిట లాడింది. ఎన్టీఆర్ స్టేడియంలోని ప్రతి పుస్తక స్టాలు కొనుగోలుదారులతో కిక్కిరిసింది. సెలవు రోజు కావడంతో పిక్నిక్‌కు, విహార యాత్రలకు వెళ్లినట్టుగా పిల్లలు, పెద్దలు అంతా కలిసి బుక్ ఫెయిర్‌కు తరలివచ్చారు. 36వ హైదరాబాద్ జాతీయ పుస్తక మహోత్సవం నేటితో ముగియనుంది. 8



సందర్శకులతో కిటకిటలాడుతున్న నుమాయిష్

49 రోజులు..
24 లక్షల మంది సందర్శన

- ముగిసిన నుమాయిష్

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎగ్జిబిషన్ మైదానంలో 49 రోజులపాటు కొనసాగిన నుమాయిష్‌ను సుమారు 24 లక్షలమంది సందర్శించారు. ఆదివారం చివరిరోజు కావడంతో అధిక సంఖ్యలో సందర్శకులు తరలి వచ్చారు. ఏ స్టాల్ చూసినా సందర్శకులతో కిటకిటలాడింది. చికుబుక్ రైలు, ఫుడ్‌కోర్టు, అమ్యూజ్‌మెంట్ పార్కు సందర్శకులను ఆకట్టుకుంది. ఎగ్జిబిషన్ సొసైటీ తరఫున సాంస్కృతిక కార్యక్రమాలు, లేడీస్ స్పెషల్, వెల్‌బేబీ షో, సంగీత విభావరి, గజల్స్ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బి.హన్మంతరావు మాట్లాడుతూ.. నుమాయిష్ ప్రశాంతంగా ముగియడం ఆనందంగా ఉందన్నారు.

సిటీ బస్సుల్లో ప్రయాణం..
4 రోజులు తిప్పలే

- మేడారం జాతరకు తరలుతున్న 1800 సిటీ బస్సులు
- బుధవారం నుంచి గ్రేటర్ ప్రయాణికులకు ఇక్కట్లే..
- హైదరాబాద్ నుంచి జాతరకు మరో 400 బస్సులు
- ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ నుంచి స్పెషల్ ఆపరేషన్స్





హైదరాబాద్ సిటీ/చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతర ఎఫెక్ట్‌తో నగరంలోని సిటీబస్సు ప్రయాణికులకు ఇక్కట్లు తప్పేట్లు లేవు. ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న మేడారం జాతరకు గ్రేటర్ జోన్‌నుంచి 1800 సిటీబస్సులను నడిపించాలని నిర్ణయించారు. దీంతో గ్రేటర్ జోన్‌లో పరిధిలో బుధవారం నుంచి శనివారం వరకు 800 బస్సులు మాత్రమే తిరగనుండడంతో ఏమేరకు సేవలు అందిస్తాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

గ్రేటర్‌జోన్ వ్యాప్తంగా ప్రతిరోజు ఆర్టీసీ 2,640 బస్సులు నడుపుతూ 21 లక్షలమంది సిటీ ప్రయాణికులను చేరవేస్తోంది. ఈనెల 21నుంచి మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభ నేపథ్యంలో గ్రేటర్‌జోన్ నుంచి సోమ, మంగళ, బుధవారాల్లో వరుసగా 600 చొప్పున మొత్తం 1800 సిటీ బస్సులను జాతరకు వెళ్లే భక్తులకోసం ఆర్టీసీ కేటాయించింది.

జాతరకు లక్షల సంఖ్యలో వెళ్లే భక్తులను దృష్టిలో పెట్టుకొని టీఎస్ఆర్టీసీ మొత్తం 6 వేల ప్రత్యేక బస్సులు నడుపుతోంది. జాతర ప్రాంగణానికి 20-30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాల నుంచి భక్తుల రద్దీకి అనుగుణంగా గ్రేటర్‌కు చెందిన సిటీబస్సులను నడపనున్నారు. ఈ బస్సులు ఈనెల 21నుంచి 24 వరకు అక్కడే ఉండి భక్తులకు సేవలందించనున్నాయి. దీంతో సోమవారం 2040 బస్సులు, మంగళవారం 1440 బస్సులు, బుధవారం నుంచి శనివారం వరకు గ్రేటర్ జోన్‌లో 800 బస్సులు మాత్రమే సిటీ ప్రయాణికులకు అందుబాటులో ఉండనున్నాయి. 70 శాతం సిటీబస్సులు జాతరకు తరలివెళ్లడంతో సిటీ ప్రయాణికులు ప్రత్యామ్నాయ ప్రయాణ మార్గాలు చూసుకోవాల్సి ఉంటుంది. మేడారం స్పెషల్ ఆపరేషన్స్‌కు బస్సులు వెళ్తుండడంతో సిటీ ప్రయాణికులు తమకు సహకరించాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు.

నగరం నుంచి సేవలకు 400 బస్సులు..

మేడారం జాతరను పురస్కరించుకుని నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఈనెల 19 నుంచి శనివారం వరకు ఆర్టీసీ 4 వందల ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రంగారెడ్డి రీజినల్ మేనేజర్ ఎ.శ్రీధర్ తెలిపారు. ఎంజీబీఎస్, జూబ్లీ బస్ స్టేషన్, ఉప్పల్ ప్రాంతాల నుంచి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు.



పేరుకే..!
గ్రేటర్‌లో గాడి తప్పిన పాలన

- నామ మాత్రంగా పాలకమండలి
- పౌర సేవల్లో తప్పని కష్టాలు
- ఆన్‌లైన్ సేవలైనా.. అదే అక్రమార్జన
- పట్టించుకోని అధికారులు
- బడ్జెట్‌పై చర్చ.. అనంతరం ప్రశ్నోత్తరాలపై..

గ్రేటర్‌లో పాలన గాడి తప్పింది. ప్రజల ఇబ్బందులను పట్టించుకునే వారు లేరు. మౌలిక వసతుల కల్పనను పక్కన పెడితే.. పౌర సేవలూ సక్రమంగా అందుతున్న దాఖలాలు లేవు. పాలకమండలి ఏర్పడి మూడేళ్లయినా.. కొత్తగా ఉన్నతాధికారులు బాధ్యతలు స్వీకరించినా అదే దుస్థితి. అధ్వాన పారిశుధ్య నిర్వహణ, ఆస్తి పన్ను మదింపులో అవకతవకలు.. యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఇక రోడ్ల నిర్వహణ, నాలాల పూడికతీత మరీ అధ్వానం. దోమలను నియంత్రించ లేని దైన్యం బల్దియాది.

- హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి)

చెత్త ఊడ్చరు.. తీసుకెళ్లరు

18 వేలకుపైగా పారిశుధ్య కార్మికులు, 4,500 చెత్త సేకరణ ట్రాలీలు, 950కిపైగా సానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ (ఎస్ఎఫ్ఏ)లు.. అయినా గ్రేటర్‌లో పారిశుధ్య నిర్వహణ అధ్వానమే. పలు ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీల్లో రెండు, మూడు రోజులకోమారు రోడ్లు ఊడుస్తున్నారు. అదేంటని అడిగితే.. అదనంగా రోడ్లు కేటాయించారన్నది సిబ్బంది సమాధానం. కొందరు కార్మికులు బయోమెట్రిక్ హాజరు వేసుకొని ఇంటికి వెళ్తుండగా వారి పని ఇతరులు చేయాల్సి వస్తోందని, అందుకే రోజూ స్వీపింగ్ జరగడం లేదని ఓ పారిశుధ్య కార్మికుడు పేర్కొన్నారు. హాజరు వేసుకొని వెళ్లే వారి వేతనాల్లో.. ఎస్ఎఫ్ఏ మొదలు, శానిటరీ జవాన్, ఏఎంఒహెచ్/డీఈఈ, డీసీ వరకు వాటాలు వెళ్తాయన్న ఫిర్యాదులున్నాయి.

ఇంటింటి చెత్త సేకరణపై యంత్రాంగం నియంత్రణ కోల్పోయింది. మెజార్టీ ఏరియాల్లో రోజు విడిచి రోజు.. కొన్నిచోట్ల వారంలో రెండు రోజులు మాత్రమే చెత్త తీసుకెళ్తున్నారు. కొందరు కార్మికులు రూ.150 నుంచి రూ.200 వసూలు చేస్తున్నారు. అంత మొత్తం ఇచ్చేందుకు ఆసక్తి చూపని కొందరు రోడ్లపైనే చెత్త వేస్తున్నారు. చెత్త తొలగింపు బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించి చేతులు దులుపుకున్న అధికారులు.. వారు ఎలా పని చేస్తున్నారన్నదీ పర్యవేక్షించకపోవడం గమనార్హం.

అక్రమార్జనకు కేరాఫ్.. టౌన్‌ప్లానింగ్...

పారదర్శక అనుమతుల జారీకి టీఎస్‌బీపాస్‌ను అమలులోకి తీసుకువచ్చినా పట్టణ ప్రణాళికా విభాగంలో అక్రమార్జన ఆగలేదు. కొందరు అధికారులు కొర్రీలు పెట్టి.. దరఖాస్తుదారులు నేరుగా వచ్చి కలవాల్సిన పరిస్థితి కల్పిస్తున్నారు. సర్కిల్, జోనల్ కార్యాలయాల్లో ఈ దందా ఎక్కువగా సాగుతోంది. ఈ విషయంపై గతంలో పలుపురికి మెమోలు జారీ చేశారు. ఇక అక్రమ నిర్మాణదారుల నుంచి వసూళ్లకు అంతులేదు.

నేడు కౌన్సిల్ సమావేశం..

ఆరు నెలల అనంతరం నేడు జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే మొదటి సెషన్‌లో 2024-25 బడ్జెట్‌పై చర్చించనున్నారు. రెండోసెషన్‌లో ప్రశ్నోత్తరాలపై చర్చ జరగనుంది. ప్రస్తుత పాలకమండలి కొలువుదీరిన అనంతరం ఇది ఎనిమిదో పాలకమండలి సమావేశం. ఇప్పటి వరకు నిర్వహించిన ఏ సమావేశంలోనూ ప్రజా సమస్యలపై సమగ్ర చర్చ జరిగిన దాఖలాలు లేవు. అధికార, ప్రతిపక్ష సభ్యులు ఎవరికి వారు మొండిగా వ్యవహరించి గత సమావేశాన్ని అర్థాంతరంగా వాయిదా వేశారు. అర్థవంతమైన చర్చకు ఇరు పక్షాలు పట్టువిడుపు ప్రదర్శించాల్సి ఉన్నా.. ఆ దిశగా ఆలోచన చేస్తోన్న దాఖలాలు లేవు.

పన్ను మదింపులో పైసా వసూల్...

ఆస్తి పన్ను మదింపులోనూ అక్రమాలు ఆగడం లేదు. స్వీయ మదింపు, రిజిస్ట్రేషన్ శాఖ వద్ద నమోదైన వివరాల ఆధారంగా మదింపు అవకాశం కల్పించినా.. కొందరు సిబ్బంది తమదైన చాతుర్యం ప్రదర్శిస్తున్నారు. షేక్‌పేటలో ఓ భవనం ఆస్తిపన్ను రూ.48 వేలు ఉండగా కొన్నాళ్ల క్రితం రూ.2.20 లక్షలకుపైగా పెంచారు. యజమానిని ముందుగా సంప్రదించిన స్థానిక సిబ్బంది.. ఆయన స్పందించకపోవడంతో

మిగతా 6వ పేజీలో..



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె. శ్రీనివాస్ తదితరులు

తెలంగాణ వికాసోద్యమ నాయకులు 'భాగ్యరెడ్డి వర్మ'

- 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె. శ్రీనివాస్ 8



శోభాయాత్ర

మహర్షి దయానంద సరస్వతి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యసమాజ్, మహర్షి స్వామిదయానంద సరస్వతి జయంతి ఉత్సవ సమితి, సాంస్కృతిక శాఖ మంత్రాలయం, భారత ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిజాం కళాశాల మైదానం నుంచి రవీంద్రభారతి వరకు శోభాయాత్రను నిర్వహించారు. ఈ శోభాయాత్రను హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రారంభించారు.

బర్కత్‌పుర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):

పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళన..



- ఏసీపీల బదిలీల్లో ప్రతిభకు పట్టం..
- అక్రమార్కులపై ఉక్కుపాదం
- గత ప్రభుత్వానికి కొమ్ముకాసిన వారికి అప్రాధాన్య పోస్టింగ్‌లు
- ఏళ్ల తరబడి లూప్‌లైన్‌లో ఉన్నవారికి గుర్తింపు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ప్రక్షాళన షురూ అయ్యింది. గ్రేటర్‌లోని ట్రై కమిషనరేట్లకు ఇటీవలే కొత్తగా వచ్చిన సీపీలు స్టేషన్ల వారీగా విధులు నిర్వహిస్తున్న వారిపై నిఘా పెట్టి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సామాజిక పరిస్థితులు, నేరాల నమోదుతోపాటు ఇన్‌స్పెక్టర్, ఎస్సై, క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరును, నేరనియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, ఒత్తిళ్లకు తలొగ్గి స్థానిక నేతలకు కొమ్ముకాసి నిర్లక్ష్యం చేసిన కేసులు, ఇలా అనేక అంశాలను పరిగణలోకి తీసుకున్న సీపీలు పలువురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేయడంతో పాటు.. కొంత మంది అక్రమార్కులను సస్పెండ్ చేశారు.

బదిలీల్లో తమదైన మార్కు

ఇటీవల రెండు దఫాల్లో గ్రేటర్ పరిధిలో లా అండ్ ఆర్డర్ విభాగంలో పనిచేస్తున్న సుమారు 50మంది ఏసీపీలు బదిలీ అయ్యారు. బదిలీ జరిగిన విధానంపై పోలీస్ శాఖలో తీవ్ర చర్చ జరుగుతోంది. అందరూ ఊహించినట్లుగానే కొత్తప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పోలీస్ ప్రక్షాళనపై దృష్టి సారించిన పోలీస్ బాస్‌లు ఏసీపీల బదిలీల్లో తమ మార్కును చూపించినట్లు స్పష్టమవుతున్నది. గత ప్రభుత్వ పాలనలో అక్రమార్కులకు అండగా నిలిచిన ఏసీపీలపై ఉక్కుపాదం మోపారని డిపార్ట్‌మెంట్‌లో చర్చించుకుంటున్నారు. గత పాలకుల అండతో రెచ్చిపోయి.. విధి నిర్వహణలో ఇష్టానుసారంగా వ్యవహరించి, ఇదేంటని ప్రశ్నించిన వారిని సైతం లెక్కచేయని ఏసీపీలందరినీ గుర్తుపెట్టుకొని దూరంగా బదిలీ చేసినట్లు స్పష్టమైందని పోలీస్ శాఖలో జోరుగా చర్చ జరుగుతున్నది.

లూప్‌లైన్ నుంచి ప్రాధాన్య పోస్టులకు..

కొన్నేళ్లుగా పోలీస్ డిపార్టుమెంట్‌లో మితిమీరిన రాజకీయ జోక్యం రాజ్యమేలిందనడంలో అతిశయోక్తి లేదు. పోలీస్ ఉన్నతాధికారులు మొదలుకొని.. డీసీపీలు, అడిషనల్

మిగతా 6వ పేజీలో..

2 రోజుల్లో 'గృహజ్యోతి' పరిశీలన పూర్తి..!

- మొత్తం కనెక్షన్లు 19.85లక్షలు
- ఇప్పటికే 12 లక్షల వివరాలు అప్‌డేట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో గృహజ్యోతి దరఖాస్తుల పరిశీలన మరో రెండు రోజుల్లో పూర్తి చేసేలా డిస్కం చర్యలు తీసుకుంటున్నది. గ్రేటర్ జోన్ 9 సర్కిళ్లలో 'గృహజ్యోతి' కింద 19.85 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుల్లో రేషన్/ఆధార్‌కార్డు నంబర్లను పరిశీలించి ఆదివారం నాటికి 12లక్షల కనెక్షన్ల వివరాలను అప్‌డేట్ చేశారు. విద్యుత్ కనెక్షన్‌తో సంబంధిత వినియోగదారుడి ఆధార్ నంబర్ జతచేస్తూ వందశాతం స్పాట్ బిల్లింగ్ మెషీన్లలో వివరాలను అప్‌డేట్ చేస్తున్నారు. వీటిని ఈనెల 20నాటికి పూర్తి చేసేలా అధికారులు సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. వివరాల నమోదులో ఎవరికైనా ఇబ్బందులుంటే సమీపంలోని విద్యుత్ కార్యాలయాలకు వినియోగదారులు వెళ్తే అధికారులు సమస్యలు పరిష్కరిస్తారని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

అదృశ్యమైన బాలుడిది హత్యే..

- నిర్ధారించిన పోలీసులు
- పార్క్‌లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నం
- అరిచి గోల చేయడంతో నాలాలోకి తోసేసిన వైనం
- నాలాలో మృతదేహం లభ్యం
- పోలీసుల అదుపులో నిందితుడు

8



పోలీస్‌శాఖలో భారీ ప్రక్షాళన..

(5వ పేజీ తరువాయి)

డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్‌లు, చివరకు సబ్ ఇన్‌స్పెక్టర్ల వరకు స్థానిక ప్రజా ప్రతినిధులు నచ్చిన, మెచ్చిన అధికారులకే పోస్టింగ్‌లు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులను అడ్డం పెట్టుకున్న అక్రమార్కులు చేయని దందా లేదు. అదే అదునుగా భావించి స్వామి కార్యం, స్వకార్యం నేరవేర్చుకున్న కొందరు ఏసీపీ, డీసీపీలు, ఇన్‌స్పెక్టర్‌లు భారీగానే కూడబెట్టినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జరిగిన పోలీసుల బదిలీలే అందుకు నిదర్శనం. ఎన్నికల్లో గెలవడానికి, తన అనుచరులకు పోస్టింగ్‌లు ఇప్పించుకోవడానికి జరిగిన బదిలీలుగా విమర్శలు వెల్లువెత్తాయి. అభ్యర్థులు పార్టీ మారినా, అభ్యర్థి పేరు మారినా వెంటనే అక్కడున్న ఇన్‌స్పెక్టర్, ఏసీపీలను మార్చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అణిచివేతకు గురై.. లూప్‌లైన్ పోస్టింగ్‌ల్లో కొనసాగిన సిబ్బందిలో ఆశలు చిగురించాయి.

గత పాలకుల నిర్లక్ష్యానికి గురై ఏళ్ల తరబడి అప్రాధాన్య పోస్టింగ్‌లలో కొనసాగిన ఏసీపీ (డీఎస్పీ)లను గుర్తించిన పోలీస్ బాస్‌లు వారి ప్రతిభను గుర్తించి ప్రాధాన్యత గల పోస్టింగ్‌లు ఇచ్చినట్లు సర్వత్రా చర్చ జరుగుతోంది.

ట్రై కమిషనరేట్ పూర్తిగా ప్రక్షాళన..

ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 205 మంది ఏసీపీల బదిలీల్లో గ్రేటర్‌లోని ట్రై కమిషనరేట్స్‌లో 90 శాతం డివిజన్‌లను పూర్తిగా ప్రక్షాళన చేసినట్లు తెలుస్తోంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్స్‌లో 50కి పైగా డివిజన్స్‌లో ఏసీపీలను మార్చిన పోలీస్‌బాస్‌లు ఒకటి, రెండు పోస్టింగులు మినహా.. ప్రతిభ గల వారికే పట్టం కట్టినట్లు తెలుస్తోంది. గతపాలనలో అక్రమార్కులకు అడ్డంగా కొమ్ముకాసిన పలువురు ఏసీపీలను ఊహించని చోటుకు బదిలీ చేసినట్లు స్పష్టమవుతోంది. వారిలో చాలామంది సైబరాబాద్, రాచకొండకు కమిషనరేట్స్‌కు చెందిన వారే కావడం గమనార్హం.

అయితే ఒకరిద్దరు ఏసీపీలు తమ పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వం మారినా తమకు తిరుగులేదంటూ తిరిగి ప్రాధాన్యం ఉన్న ప్రాంతాల్లో ఏసీపీలుగా పొందటం ఆశ్చర్యానికి గురిచేసిందని కొందరు అధికారులు చర్చించుకుంటున్నారు. ఒకటి, రెండు పోస్టింగ్‌లు మినహా.. అన్ని డివిజన్‌లలో పూర్తిస్థాయిలో ప్రక్షాళన జరిగిందనడంలో అతిశయోక్తిలేదు.







పేరుకే..!

(5వ పేజీ తరువాయి)

పన్ను డిమాండ్ పెంచుతూ నోటీసులిచ్చారు. చాలా ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది.

దోమలు నియంత్రించలేని స్థితి

డెంగీ, మలేరియా వంటి వ్యాధులతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా.. దోమల నియంత్రణను సంస్థ గాలికొదిలేసింది. ఎవరైనా ప్రాణాలు కోల్పోతేనో.. కేసుల తీవ్రత ఎక్కువగా ఉంటే తప్ప.. ఎంటమాలజీ విభాగం దోమల నివారణ చర్యలు చేపట్టడం లేదు. ఒక్కో ప్రాంతానికి వారానికోసారి వెళ్లి యాంటీ లార్వా ఆపరేషన్ (ఏఎల్ఓ) నిర్వహించాల్సి ఉండగా.. రెండు, మూడు నెలలకు ఒకసారి సిబ్బంది వస్తోన్న పరిస్థితి లేదని పలు కాలనీల వాసులు వాపోతున్నారు.

అంధకారం.. ఆగమాగం...

గ్రేటర్‌లో 5.40 లక్షల వీధిదీపాలున్నాయి. ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)తో ఒప్పందం ప్రకారం 98 శాతం లైట్లు వెలగాలి. కానీ.. గ్లోయింగ్ పర్సంటేజీ 70 నుంచి 75 శాతం దాటడం లేదు. జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్, మొబైల్ యాప్‌నకు వస్తోన్న ఫిర్యాదుల్లో అధికం వీధి దీపాలకు సంబంధించినవి కావడం గమనార్హం. పలుమార్లు మేయర్, కమిషనర్ హెచ్చరించినా పరిస్థితి మెరుగుపడలేదు.

వందల కోట్లు.. రోడ్లపాలు

రోడ్ల నిర్మాణం, నిర్వహణకు యేటా సగటున రూ.350 నుంచి రూ.400 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అయినా అంతర్గత రహదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. గుంతలు, కంకర తేలి వాహనదారులు నరకయాతన పడుతున్నారు. పైపులైన్లు, ఇతరత్రా పనుల కోసం తవ్వుతోన్న రోడ్ల పునరుద్ధరణను ఇంజనీరింగ్ విభాగం పట్టించుకోవడం లేదు.

నకిలీ సర్టిఫికెట్లు..
నామ్ కే వాస్తే తనిఖీలు..

సంస్థలోని వైద్యారోగ్య విభాగం పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకున్న సిబ్బంది.. 28 వేలకుపైగా నకిలీ జనన, మరణ ధృవీకరణ పత్రాలు జారీ చేశారు. పోలీస్ కేసు నమోదైనా.. ఇప్పటి వరకు ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. భారీ స్థాయిలో డబ్బులు చేతులు మారడం వల్ల కేసు కోల్డ్ స్టోరేజీలోకి వెళ్లిందన్న ఆరోపణలున్నాయి. నూతన సాఫ్ట్‌వేర్ వినియోగిస్తున్నా ఉద్యోగుల చేతివాటం ఆగలేదు. హోటళ్ల నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు పట్టించుకోవడం లేదు. లేదనకుండా తనిఖీలు నిర్వహిస్తూ కొందరు జేబులు నింపుకుంటున్నారన్న ఫిర్యాదులున్నాయి.

'మన బడి'కి మోక్షం

● బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ● త్వరలో పనులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మనబస్తీ-మనబడి పనులకు మోక్షం లభిస్తోంది. నిధుల కొరతతో ఏడాదికాలంగా మూలకు పడిన పనులు మళ్లీ మొదలు కానున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో అధికారులు పనులు చేపట్టేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ పథకంలో భాగంగా జిల్లాలోని 16 మండలాల పరిధిలో మొదటి విడత కింద 261 పాఠశాలలను ఎంపిక చేశారు. తరగతి గదులను పూర్తి చేయడం, కొత్త ఆడిటోరియంల నిర్మాణం, బెంచీల కొనుగోలు, మరుగుదొడ్ల మరమ్మతులు, పెయింటింగ్, విద్యుత్ కనెక్షన్లు, ఫర్నిచర్ ఏర్పాటుకు రూ.15 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు కేటాయించారు. మొత్తం 12 రకాల పనులను చేపట్టేందుకు పనులను ప్రతిపాదించారు. మొదటివిడతలో ఇప్పటివరకు 41 చోట్ల మాత్రమే పనులను పూర్తి చేశారు. బోయినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్లాబు, మరుగుదొడ్ల మరమ్మతుతో పాటు క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.23లక్షలు కేటాయించారు. కానీ.. ఇప్పటివరకు 30శాతం పనులు మాత్రమే చేశారు. ముషీరాబాద్ ప్రభుత్వపాఠశాలలో చేపట్టిన ప్రహరీ, మరుగుదొడ్లు, తాగునీటిసౌకర్యం పనుల్లో 20 శాతం పెండింగ్‌లో ఉన్నాయి. అంబర్‌పేట నియోజకవర్గం కాచిగూడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు రూ.86 లక్షలు కేటాయించారు. 680 మంది విద్యార్థులున్న స్కూల్‌లో అదనపు తరగతి గదులు, ప్రహరీ, డైనింగ్ హాల్, విద్యుత్ కనెక్షన్లు, మరుగుదొడ్లకు నీటి సరఫరా, బెంచీలు ఏర్పాటు చేసేందుకు పనులు ప్రతిపాదించారు. రూ.30లక్షలలోపు పనులకు మాత్రమే టెండర్లు పిలిచారు. నాలుగు నుంచి ఆరునెలల్లో పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పటివరకు కనీసం 55 శాతం పనులు కూడా పూర్తి చేయించలేదు. ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.21,389 కోట్లు కేటాయించడంతో పనుల పూర్తిపై ఆశలు చిగురిస్తున్నాయి.







ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

ఓంనగర్ కాలనీ సమస్యలను పరిష్కరించండి

నార్సింగ్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఓంనగర్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఆదివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఓంనగర్ నుంచి కోఠి ఇతర ప్రాంతాలకు బస్సు సదుపాయం కల్పించాలని, రోడ్లు, విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఓంనగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

కార్వాన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కార్వాన్ ఉప్పర్ బస్తీ బాలాంజనేయ భక్త సమాజం ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం గణపతిపూజ, పుణ్యాహవచనము, స్థాపిత మంటపదేవత పూజ, మూల మంత్ర హోమము, మహా లింగార్చన, ద్వాత్రింశత్ నదికలశ, మహాస్నపనం, ధాన్యధివాసము, శయధివాసము, తత్వహోమం, రుద్రహోమము, మంగళహారతి, మంత్రపుష్పము కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అంబటి క్రాంతి సాగర్ కుటుంబ సభ్యులు, హరి పంతులు, ఆలయ అధ్యక్షుడు గోపీసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

నార్సింగ్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): షేక్‌పేట్ ఓయూ కాలనీలోని విశాఖ శ్రీ శారదా పీఠపాలిత శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్ అన్నె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు నిత్యోపాసనము, 9 గంటలకు మహాసుదర్శన అభిషేకము, అర్చన, దుష్టగ్రహ నివారణార్థం మహాసుదర్శన హోమము. మధ్యాహ్నం 12 గంటలకు హారతి, తీర్థ ప్రసాదములు, సాయంత్రం 6 గంటలకు నిత్యోపాసన, సహస్ర దీపాలంకరణ సేవ, గరుడవాహన సేవ, రాత్రి 9 గంటలకు హారతి కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సదానంద్ గుప్తా, ప్రకాశ్ రావు తదితరులు

శివ జాగరణ పోస్టర్ ఆవిష్కరణ

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నామని జాగరణ సేవా సమితి అధ్యక్షుడు మామిడిశెట్టి సదానంద్ గుప్తా తెలిపారు. మార్చి 9న మా వైష్ణవ్‌దేవి జాగరణ్ మండల్ ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు శ్రీశంకర్‌జీ హనుమాన్‌జీ, అయ్యప్ప దేవాలయాల ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆదివారం శివ జాగరణ మహోత్సవ పోస్టరును ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎస్.రాజన్ కుమార్, కోశాధికారి డి.రాజేందర్ సింగ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రంజిత్ కుమార్, డి.లక్ష్మీనారాయణవర్మ, డి.శైలేందర్‌సింగ్, సిహెచ్.ప్రదీప్ కుమార్, బాల్‌రాజ్ గౌడ్, రామ్‌నాథ్, పురుషోత్తం సింగ్, తోట శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మురళీధర్‌రెడ్డిని అవార్డుతో సత్కరిస్తున్న నిర్వాహకులు జయప్రసాద్, సంధ్యారాణి, గౌతం రాజు

గాయకులు, కళాకారులకు అవార్డుల ప్రదానం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నేడు సమాజంలో సంగీత కళాకారులు, గాయకులకు ఎంతో గౌరవం ఉన్నదని, అలాంటి వారిని ఈ రోజు అవార్డులతో సత్కరించడం గొప్ప విషయమని డాక్టర్ బోయ భీమన్న అవార్డు గ్రహీత కె.మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో శ్రీలహరి క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో గాయకులు, సంగీత కళాకారులకు అవార్డుల ప్రదానం కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి కె.మురళీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పలువురు గాయకులు, సంగీత కళాకారులకు సరస్వతీ, నాట్య శిరోమణి అవార్డులతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సౌజన్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా కాంగ్రెస్ ఓబీసీ విభాగం జాయింట్ కో-ఆర్డినేటర్‌గా నిర్మల్ కుమార్ యాదవ్

గోషామహల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ విభాగం జాయింట్ కో-ఆర్డినేటర్‌గా గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ఎం.నిర్మల్ కుమార్ యాదవ్ నియమితులయ్యారు. ఆదివారం చుడీబజార్‌లోని వ్యాయమశాలలో ఎం.నిర్మల్ కుమార్ యాదవ్‌కు అభినందన సభను నిర్వహించారు. జైదీప్‌యాదవ్, బజరంగ్‌లాల్ యాదవ్ మాట్లాడుతూ... యాదవ సామాజిక వర్గానికి చెందిన నిర్మల్ కుమార్ సేవలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ ఆలిండియా లెవల్‌లో పదవీ ఇవ్వడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆనంద్ యాదవ్, కిషన్‌లాల్, భవానీ శంకర్, మహారాజ్, రఘునందన్ యాదవ్, నర్సింగ్ భాను యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్ కుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న జైదీప్ యాదవ్ తదితరులు

డబ్ల్యూబీఏఎఫ్ సీనియర్ అసోసియేట్‌గా నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ బిజినెస్ ఏంజిల్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరం (డబ్ల్యూబీఏఎఫ్) ఎంటర్‌ప్రెన్యూర్స్ గ్రూప్ డిప్లమసీ యాక్షన్ సీనియర్ అసోసియేట్‌గా హైదరాబాద్‌లోని రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ గౌరవ కాన్సులేట్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్‌కు అవకాశం దక్కింది. డబ్ల్యూబీఏఎఫ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బేలబర్స్ అల్తుంటాస్ సంబంధిత పత్రాలను మీర్ నాసిర్ అలీఖాన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్ మాట్లాడుతూ.. ప్రతిష్ఠాత్మక సంస్థలోకి సభ్యుడిగా ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్లోబల్ బిజినెస్‌లో సానుకూల పరిస్థితులను గమనించడం, మార్పులను తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. జీ20 గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ ఫర్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్(జీపీఎఫ్ఐ)కు అనుబంధ సంస్థ అయిన డబ్ల్యూబీఏఎఫ్‌లో పలు దేశాల అధ్యక్షులు, ప్రతినిధులు సభ్యులుగా కొనసాగుతున్నారు.



డబ్ల్యూబీఏఎఫ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బేలబర్స్ అల్తుంటాస్‌తో డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్

రోడ్డు విస్తరణలో వివాదం

- పెద్దమ్మ ఆలయాన్ని తొలగించాలని జీఎమ్మార్, ఎయిర్ పోర్టు అధికారుల ఫిర్యాదు
- అడ్డుకుంటామంటున్న మామిడిపల్లి ప్రజలు

పహాడిషరీఫ్ ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ వివాదానికి దారితీసింది. మామిడిపల్లి నుంచి శంషాబాద్ మార్గంలో రోడ్డును విస్తరించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. మామిడిపల్లి నుంచి శంషాబాద్ మార్గంలోని సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ ఎదురుగా 30 గుంటల స్థలంలో పెద్దమ్మతల్లి ఆలయం ఉంది. ఈ దేవాలయాన్ని తొలగించాలని జీఎమ్మార్, ఎయిర్‌పోర్టు అధికారులు ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల క్రితం కందుకూర్ ఆర్డీవో సురేష్‌కుమార్, బాలాపూర్ తహసీల్దార్ మాధవిరెడ్డి ఆ ప్రాంతానికి వచ్చి ఆలయాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న ఆలయాన్ని తొలగించి, సమీపంలోనే ప్రభుత్వ స్థలంలో ఆలయాన్ని పునర్నిర్మిస్తామని వారు అక్కడి ప్రజలు, భక్తులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం అధికారులు చూపిన స్థలం.. గతంలోనే విమానాశ్రయ భూ బాధితులకు ప్రభుత్వం కేటాయించింది.

దాంతో అక్కడ స్థలం కేటాయిస్తే మేము కొట్లాడుకోవాలా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణలో ప్రార్థనా మందిరాలు, దేవాలయాలకు ఎక్కడైనా మినహాయింపు ఇస్తున్నారని, ఇక్కడ మాత్రం జీఎమ్మార్ అధికారులు భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించడం మంచి పద్ధతి కాదంటున్నారు. చాలా ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై ప్రార్థనా మందిరాలు, దేవాలయాలు ఉన్నాయని, అక్కడ లేని ఇబ్బంది, మామిడిపల్లిలోనే అడ్డువస్తుందా అని ప్రశ్నిస్తున్నారు.

వెంటనే అధికారులు తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని దేవాలయం చుట్టూ ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దాంతో మామిడిపల్లిలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పెద్దమ్మ తల్లి దేవాలయం తరలించడానికి అధికారులు యత్నిస్తే ఊరుకునేది లేదని గ్రామస్తులు చెబుతున్నారు.



రోడ్డుకు పక్కన ఉన్న పెద్దమ్మ తల్లి దేవాలయం

యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

పహాడిషరీఫ్ ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి సూచించారు. ఆదివారం బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒమర్ ఫంక్షన్ హాల్‌లో ఇస్లాహి ముషాయిరా కమిటీ ఆధ్వర్యంలో 'మత్తు పదార్థాలు- వాటి వలన కలిగే నష్టాలు' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని అన్నారు. పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు పడినట్టు గుర్తిస్తే కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. అప్పటికీ వారు పద్ధతి మార్చుకోకుంటే పోలీసులకు సమాచారం ఇస్తే కౌన్సెలింగ్ ఇస్తామని అన్నారు. మెడికల్ షాపు నిర్వాకులు కూడా వైద్యులు రాసిన మందులు మాత్రమే ఇవ్వాలన్నారు. మత్తుకు సంబంధించిన ఏవీ ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మత్తు పదార్థాల వాడకం వలన రాష్ట్రంలో రోజు రోజుకూ నేరాలు పెరుగుతున్నాయని, ప్రభుత్వం కూడా ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నదని పేర్కొన్నారు. మీ ప్రాంత పరిధిలో ఎలాంటి మత్తు పదార్థాల విక్రయాలు, సరఫరా చేస్తున్నట్టు తెలిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏసీపీ ఉమా మహేశ్వర్‌రావు, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్, వెంకట్‌రెడ్డి, పహాడిషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, ఇస్లాహి ముషాయిరా కమిటీప్రతినిధి మొహమ్మద్ ఓమర్, జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాధి, మండల మాజీ ఉపాధ్యక్షుడు ఓమర్ బాయి, యూసుఫ్ పటేల్, శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి



కవులను సత్కరిస్తున్న అతిథులు

తెలుగు భాష ఎప్పటికీ సజీవమే: సిధారెడ్డి

రవీంద్రభారతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష ఎన్ని వేల సంవత్సరాలైన సజీవంగానే నిలుస్తుందని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. మహతి సాహితీ కవి సంగమం ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు. డా.అడిగొప్పుల సదయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డా.నందిని సిధారెడ్డి హాజరై మాట్లాడారు. కవులందరిని ఒకచోట చేర్చడం అభినందనీయమని అన్నారు. సమాజహితం కోరే సాహిత్యం రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు ఏనుగు నరసింహారెడ్డి, మామిడి హరికృష్ణ, నాళేశ్వరం శంకరం, సాధనాల వేంకటస్వామినాయుడు, మేక రవీంద్ర, పొర్ల వేణుగోపాలరావు, దాసరి చంద్రమౌళి, గీతాశైలజ, ఎస్వీ మహాలక్ష్మి, మోహనరావు, యనమంద్ర వరలక్ష్మి, కుందారపు గురుమూర్తి, కామేశ్వరరావు, కురవి వేంకటకృష్ణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



నాట్యం చేస్తున్న కళాకారులు

రసరమ్యంగా 'రామామృతం' నాట్యం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): త్యాగరాజస్వామి కీర్తనలకు రామభక్తి హృదయాన్ని చాటుతూ కళాకారులు ప్రదర్శించిన రామామృతం నాట్య ప్రదర్శన రసరమ్యంగా సాగింది. పరంపర ఫౌండేషన్, అభినేత్రి ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన వేదికపై 'రామామృతం ది నెక్టార్ ఆఫ్ త్యాగరాజ' శీర్షికన ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రదర్శించారు. ప్రముఖ నాట్య గురువు ప్రమోద్ రెడ్డి తన శిష్య బృందంతో కలిసి రామామృతం నాట్యాన్ని ప్రదర్శించారు. గణపతి కీర్తన, రామ కోదండరామ, నారాయణ హరి వంటి ఉత్సవ సంప్రదాయ కీర్తనలకు నర్తించి భళా అనిపించారు. ఇందులో భాగంగా రారా మా ఇంటికి అంటూ సాగిన కీర్తనకు పల్లకీలో రాముని ఊరేగింపు చేస్తూ నర్తించారు. కొలువై ఉన్నాడే కోదండ రాముడు అంటూ రామ పరివారాన్ని చూపిస్తూ సాగిన ప్రదర్శన రంజింపజేసింది. సుమారు 36 మంది నర్తకులు ప్రదర్శించిన ఈ నాట్యం ప్రేక్షకుల్ని సమ్మోహనపరిచింది. వైవిధ్యంగా సాగిన ఈ నృత్య ప్రదర్శన ఆహూతుల్ని మైమరిపించింది. ఈ కార్యక్రమంలో శశిరెడ్డి, ప్రతిభా మురళీధర్‌రావు, అనుపమ కైలాష్, కళాకృష్ణ తదితరులు పాల్గొని నాట్య గురువు ప్రమోద్ రెడ్డితో పాటు నర్తకులను ఘనంగా సత్కరించి అభినందించారు.

వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్‌కు చుక్కెదురు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్ తమ తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టుకు చెన్నై టీమ్‌లో చేతిలో చుక్కెదురైంది. స్థానిక నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోరులో హైదరాబాద్ 0-3తో చెన్నైపై నెగ్గింది. హోరాహోరీగా సాగిన తొలి సెట్‌లో 14-16తో హైదరాబాద్ త్రుటిలో సెట్‌ను కోల్పోయింది. రెండో సెట్‌లోనూ ప్రత్యర్థికి గట్టి పోటీ ఇచ్చిన హైదరాబాద్ చివరికి 11-15తో ఓడింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో ఒత్తిడికి లోనైన హైదరాబాద్ 7-15తో చెన్నైకు సునాయాస విజయాన్ని కట్టబెట్టింది.



బీసీ కులగణన చరిత్రాత్మక నిర్ణయం

- జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ యుగంధర్ గౌడ్

మంగళ్‌హాట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కులగణన కోసం బీసీలు ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నారని, 93 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల సాకారం అయ్యేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేపడతామని తీర్మాణం చేయడం చరిత్రాత్మకమని బీసీ పొలిటికల్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బీసీ సమగ్ర కులగణన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందిన సందర్భంగా యుగంధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం నాంపల్లి అసెంబ్లీ ఎదురుగా వున్న గన్ పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యుగంధర్‌గౌడ్ మాట్లాడుతూ దేశ ప్రధాని బీసీ కులస్థుడై ఉండి కుడా బీసీలను పట్టించుకున్న పాపన పోలేదని విమర్శించారు.

2014లో కేసీఆర్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేసి ఆ లెక్కలు వెల్లడించకుండా, స్థానిక సంస్థలు, పంచాయతీ రాజ్ ఎన్నికల్లో బీసీలను రాజకీయంగా అణచివేసిందని మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా బీసీ వర్గాలకు సరైన న్యాయం జరగడం లేదని, బీసీలు విద్య , ఉద్యోగ, సామాజిక, ఆర్థిక, రంగాల్లో వెనకబడ్డారని, కుల గణనతో న్యాయం జరిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ నాయుడు కార్తిక్, అనిల్‌కుమార్, సాయి, సైదులు, రవి కుమార్, భాస్కర్, సోమయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పేరు తేవాలి

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు తమ నైపుణ్యంతో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని దేశానికి పేరు తేవాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ సూచించారు. క్రీడలు ప్రతి ఒక్కరికీ శరీర ధారుడ్యం, మానసిక ప్రశాంతను ఇస్తాయని ఆయన అన్నారు. ఆదివారం కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఆడిటోరియంలో నేషనల్ ఓపెన్ కరాటే-కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్-2024 పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన మొదటి విజేతకు రూ.18 వేలు, రెండో విజేతకు రూ.12 వేలు, మూడో విజేతకు రూ.10లు, మెమెంటోలు అందజేసి సత్కరించారు.



గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

హైదరాబాద్ రన్నర్స్ క్లబ్ 10కే, 21కే రన్

రాయదుర్గం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రన్నర్స్ క్లబ్ వార్షిక ఈవెంట్-2024 హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లక్ష ఆదివారం జరిగింది. 10కే, 21కే రన్ నిర్వహించారు. రన్‌లో రెండువేల మంది పాల్గొన్నారు. హెచ్‌సీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ పి.తుకారం, బిజీపీ రమేష్‌రెడ్డి, డీసీపీ వినీత్ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి మెడల్స్ అందజేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లో ఫిట్‌నెస్ కార్యకలాపాల ప్రాధాన్యం తెలియజేయడం ఈ రన్ ఉద్దేశమన్నారు.



జెండా ఊపి రన్‌ను ప్రారంభిస్తున్న తుకారం, బిజీపీ రమేష్‌రెడ్డి

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

- తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని, పాత పెన్షన్ అమలు చేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. నాంపల్లి తెలుగు యూనివర్సిటీలో ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ కాన్ఫెడరేషన్ ఆదివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంప్లాయిస్ అసోసియేషన్ 2024 డైరీ ఆవిష్కరించి, నూతనంగా ఎనుకున్న కార్యవర్గాన్ని ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్షురాలు డా. జి. నిర్మల మాట్లాడుతూ.. ఐఆర్ 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సెక్రటరీ జనరల్ యాకుబ్ పాషా మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల విషయమై ప్రభుత్వ నిర్ణయం ప్రకటించాలన్నారు. అసోసియేషన్ చైర్మన్ సంపత్‌కుమార్ స్వామి, వైస్‌చైర్మన్ గడ్డం బాలస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంకే రాజు, హెచ్‌అండ్‌టీ ఫోరం అధ్యక్షుడు తత్వానంద చారి పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/x5Y6PnM లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయగలరు.

అనారోగ్యంతో 'పోతరాజు' శ్రీనివాస్ మృతి

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో 'పోతరాజు' శ్రీనివాస్ మృతిచెందారు. పాతబస్తీ గౌలిపురాకు చెందిన ఎ.శ్రీనివాస్ అలియాస్ పోతరాజు శ్రీనివాస్ (37) దాదాపు 15 ఏళ్ల నుంచి బోనాల ఉత్సవాల్లో పోతరాజు వేషం ధరించి తన ఆటపాటలతో అలరించారు. కొద్దిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం తుదిశ్వాస విడిచారు. పోతరాజు శ్రీనివాస్ అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం చాంద్రాయణగుట్ట నల్లవాగు హిందూ శ్మశానవాటికలో జరిగాయి.



శ్రీనివాస్ (ఫైల్)

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మదీన, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హుసేనీ ఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ ప్రియాంక వివరాల ప్రకారం... ఈనెల 16న మధ్యాహ్నం పేట్లబురుజు మెటర్నరీ హాస్పిటల్ ముందు గుర్తుతెలియని మృతదేహం ఉందని స్థానికులు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పార్కు చేసిన రెండు కార్లు దగ్ధం

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పార్కు చేసిన రెండు కార్లు దగ్ధం అయ్యాయి. ఈ ఘటన ఛత్రినాక పోలీస్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికంగా ఉంటున్న రఘు యాదవ్ తన రెండు స్విఫ్ట డిజైర్ కార్లను గౌలిపుర శివపార్వతి ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో పార్కు చేశాడు. ఆదివారం కార్లలో మంటలు చెలరేగి కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ఛత్రినాక పోలీసులు కేసు నమోదు చేసుకుని వేడికి కార్లలో మంటలు చెలరేగాయా..? లేదా ఎవరైన నిప్పు పెట్టారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో, స్కూల్ బస్సు ఢీకొని నలుగురికి గాయాలు

పహాడిషరీఫ్ ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆటోను స్కూలు బస్సు ఢీకొట్టడంతో నలుగురికి గాయాలయ్యాయి పహాడిషరీఫ్ ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం వెంకటేష్, ప్రవీణ్‌కుమారు, పాండు, శివకుమార్ ఆటోలో రాంగ్ రూట్‌లో మామిడిపల్లికి వెళ్తున్నారు. జీఎంఆర్ చిన్మయ స్కూల్ చెందిన బస్సును ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయాలపాలైన వారిని ఆస్పత్రికి తరలించారు.

డెలివరీ బాయ్ అదృశ్యం

బాలానగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న యువకుడు అదృశ్యమయ్యాడు. బాలానగర్ రాజూకాలనీకి చెందిన శబ్బం, కాసీ దంపతుల కుమారుడు సహీద్‌ఖాన్ ఈ నెల 12న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. మరుసటి రోజు తల్లి ఫోన్ చేయగా, ఎత్తి తర్వాత ఫోన్ చేస్తానని పెట్టేశాడు. అప్పటి నుంచి సెల్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. అన్నిచోట్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సహీద్‌ఖాన్‌ను ఎవరైనా గుర్తిస్తే 94906 17114 ఫోన్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ నవీన్‌కుమార్ సూచించారు.



సహీద్‌ఖాన్

రెండుచోట్ల అధికారుల దాడి

- అక్రమంగా విక్రయిస్తున్న మందులు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఔషధ నియంత్రణ అధికారులు నగరంలో రెండు చోట్ల దాడిచేసి పెద్దమొత్తంలో నిల్వ చేసిన మందులను స్వాధీనం చేసుకున్నారు. నాగోల్‌లో అక్రమంగా గోడౌన్ నిర్వహిస్తూ మందులు విక్రయిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ సమాచారంతో అధికారులు శనివారం దాడిచేశారు. యాంటీబయాటిక్స్, పీడియాట్రిక్ సిరప్‌లు, యాంటీ-అల్సర్ మందులు, మల్టీవిటమిన్లు, మల్టీమినరల్ మొదలైన ఎనిమిది రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు.

కుత్బుల్లాపూర్‌లో శ్రీబ్లూటెన్ ఫార్మసీపై దాడి చేసిన అధికారులు, ఫుడ్ లైసెన్స్‌తో మల్టీ విటమిన్ క్యాప్సూల్స్ అక్రమంగా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఆహార ఉత్పత్తి, న్యూట్రాస్యూటికల్స్ పేరుతో మలక్‌పేట్‌లో యాక్సెనిక్ హెల్త్‌కేర్ ద్వారా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఉత్పత్తులు నకిలీవని అధికారులు వెల్లడించారు.

అదృశ్యమైన బాలుడిది హత్యే..

బంజారాహిల్స్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇంటిముందు ఆడుకుంటూ అదృశ్యమై మరుసటిరోజు నాలాలో శవమై లభించిన బాలుడిది హత్య అని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. బాలుడిని బస్తీకి చెందిన వ్యక్తి నాలాలోకి తోసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. బాలుడిపై లైంగిక దాడికి యత్నించిన అతడు, సహకరించకపోవడం, గొడవ చేయడంతో నాలాలోకి తోసి చంపినట్లు పోలీసుల విచారణలో తేలింది. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 5లో ఓ బస్తీకి చెందిన బాలుడు మూడో తరగతి చదువుతున్నాడు. ఈనెల 12న ఇంటి ఎదుట ఆడుకుంటూ అదృశ్యమయ్యాడు. మరుసటి రోజు ఉదయం బస్తీ సమీపంలో పార్కు నాలాలో మృతదేహం లభించింది.

అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బాలుడు అదృశ్యమైన రోజు నుంచి అదే బస్తీకి చెందిన మన్నెం కూడా కనిపించడం లేదు. సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించగా మన్నెంతో కలిసి బాలుడు సమీపంలోగల పార్కుకు వెళ్లిన దృశ్యాలు కనిపించాయి. పోలీసులు పరారీలో ఉన్న మన్నెంను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా.. బాలుడిని నాలాలో తోసి హత్య చేసినట్లు అంగీకరించాడు. కేసుకు సంబంధించిన మరిన్ని విషయాలను పోలీసులు అధికారికంగా తెలియజేయాల్సి ఉంది.


శరత్‌చంద్ర రచనలు చదవాలి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శరత్‌చంద్ర రచనలకు నేటికీ ప్రాసంగికత ఉందని, ముఖ్యంగా మతం, కులం విషయాల్లో ఆయన రచనల ద్వారా చర్చించిన విషయాలు చాలా అమూల్యమైనవి అని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి పేర్కొన్నారు. ఆయన రచనల్లో స్త్రీ పాత్రలు చాలా ఉదాత్తంగా ఉంటాయన్నారు. ఎస్.యూ.సీ.ఐ(సీ) జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రవాష్ ఘోష్ రచించిన "శరత్ సాహిత్యాన్ని నేటికీ అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఏమిటి.?" తెలుగు అనువాదాన్ని యువ సాహితీ ఆధ్వర్యంలో ఆదివారం బుక్ ఫెయిర్ వేదికపై జస్టిస్ రాధారాణి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ పుస్తకం శరత్ సాహిత్యాన్ని అర్థం చేసుకోడానికి ఓ కరదీపికలా పనిచేస్తుందని అన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ రాధారాణి; చిత్రంలో ఆలూరి విజయలక్ష్మి, ప్రమీల తదితరులు

శరత్ సాహిత్యంలోని పాత్రల ఔచిత్యాన్ని ప్రవాష్ ఘోష్ చాలా బాగా విశ్లేషించారని కొనియాడారు. "ఒక రచయిత సమాజాన్ని ముందుగా దర్శించి, కదిలించేలా రాయగలగాలి. తద్వారా మార్పు తీసుకురాగలగాలి. అప్పుడే ఆ రచన సఫలీకృతం అవుతుంది. అది వందేళ్ల కిందట ప్రఖ్యాత బెంగాలీ రచయిత శరత్ చేయగలిగారు" అని జస్టిస్ రాధారాణి వివరించారు. సమాజం మరింత మానవీయం కావడానికి శరత్ రచనలు మళ్లీ చదవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ముఖ్య అతిథి ప్రముఖ వైద్యురాలు, రచయిత్రి డాక్టర్ ఆలూరు విజయలక్ష్మి మాట్లాడుతూ.. శరత్ రచనల ద్వారా భారతీయ స్త్రీలకు హృదయాన్ని, వెన్నెముకను కూడా ఇచ్చాడని శ్లాఘించారు. ఆయన్ను తెలుగువాడిగానే ఇక్కడి వారంతా ఆరాధించారని, అంతగా శరత్ భారతీయ సాహిత్యాన్ని ప్రభావితం చేశారని అన్నారు. భావ స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తూ, తిరోగమన భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో శరత్ రచనలు తప్పకుండా వెలుగు దారిని చూపుతాయని పేర్కొన్నారు. సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మురహరి శరత్ సాహిత్యం ఔన్నత్యం గురించి విశ్లేషిస్తూ ప్రసంగించారు. యువతరం శరత్‌ను చదివి, అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. ఆల్ ఇండియా మహిళా సాంస్కృతిక సంఘం జాతీయ ఉపాధ్యక్షురాలు సీహెచ్ ప్రమీల సభాధ్యక్షత వహించగా, ప్రముఖ కవి రాపోలు సుదర్శన్, యువ సాహితీ బాధ్యులు వై. నాగరాజు, ఎస్. శైలజ తదితరులు పాల్గొన్నారు.

అరుదైన పుస్తకం 'కులం'



- ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి చెందిన తెలుగు వ్యక్తి పి. లక్ష్మీ నరసు 1922లో రాసిన "స్టడీ ఆఫ్ క్యాస్ట్"ను "కులం" పేరుతో ఏఎన్. నాగేశ్వరరావు తెలుగులోకి అనువదించారు. అంబేడ్కర్ "కుల నిర్మూలన" రాకముందే వచ్చిన లక్ష్మీ నరసు పుస్తకాన్ని ఆనాడు బాబాసాహెబ్ కొనియాడారు. కుల నిర్మూలనోద్యమ దృక్పథంతో ఆయన ఈ పుస్తకం రాశారని, తద్వారా విలువైన సూచనలు, ప్రతిపాదనలు, ఆలోచనలను అందించారని కొందరు సామాజిక ఉద్యమకారులు కొనియాడారు. ఈ అరుదైన పుస్తకాన్ని భూమి బుక్ ట్రస్ట్ తెలుగులోకి తెచ్చింది. పి. లక్ష్మీ నరసు "కులం" పుస్తకం స్టాల్ నంబరు 192లో అందుబాటులో ఉంది.
- తెలుగు సాహిత్యాభిమానులకు కాల్పనిక, కాల్పనికేతర సాహిత్యం, నవలలు, కథలు, కవిత్వం, జీవిత చరిత్రలు, వ్యక్తిత్వ వికాసం, అనువాదాలతో పాటు భిన్న భావజాలలకు, విభిన్న దృక్పథాలకు సంబంధించిన పుస్తకాల కోసం 33, 39, 50, 76, 83, 87, 102, 124, 139, 149, 171, 189, 190, 212, 236, 242, 254, 280, 288, 289, 316, 330, 338 స్టాళ్లను సందర్శించవచ్చు.

ఏ స్టాల్‌లో ఏమున్నాయి..

పిల్లల్లో పాఠనాసక్తిని పెంపొందించేందుకు తోడ్పడే బొమ్మల పుస్తకాలు, కాల్పనిక గాథలు, జానపద కథలు, మహనీయుల జీవిత గాథలు తదితర తెలుగు, ఇంగ్లిషు పుస్తకాలకు 18, 23, 46, 80, 158, 166, 171, 180, 184, 191, 201, 203, 217, 218, 259, 271, 344 స్టాళ్లను సందర్శించవచ్చు.

- దళిత, బహుజన, మైనార్టీ, స్త్రీ వాద తదితర అస్తిత్వ వాద సాహిత్యం 11, 129, 148, 154, 192, 205, 260,288, 300, 306, 319 స్టాళ్లలో లభిస్తుంది.
- హిందీ, సంస్కృత భాషా సాహిత్యాల కోసం 163, 183, 193, 256, 311 స్టాళ్లను సందర్శించవచ్చు.
- పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉపయుక్తమయ్యే పుస్తకాలు 4, 32, 56, 59, 107, 214, 253, 261, 321, 335 స్టాళ్లలో ఉన్నాయి.
- దళిత సాహిత్య, సామాజిక ఉద్యమానికి తెలుగు నాట కొత్త చూపు అందించిన వారిలో ప్రముఖుడు దివంగత కవి, రచయిత మద్దూరి నగేష్ బాబు సమగ్ర సాహిత్యం లిఖిత ప్రచురణలు స్టాల్ నంబరు 288లో లభ్యమవుతుంది. పుస్తక ప్రదర్శనలో పది శాతం రాయితీ ఇస్తున్నారు.
- ప్రముఖ రచయిత సతీష్ చందర్, గంటి భానుమతి తదితరుల రచనలతో పాటు కాంతి ఫౌండేషన్ ప్రచురించిన చిన్నారుల ఆటలు, ఓషో పుస్తకాలకు "బైరి ఇందిర స్మారక రచయితల స్టాల్ -256"ను సందర్శించవచ్చు.

బుక్‌ఫెయిర్‌లో పుస్తకావిష్కరణలు

మామిడి హరికృష్ణతో తగుళ్ల గోపాల్ కవిత్వపు ముచ్చట్లు "జల" పుస్తకాన్ని కవి యాకూబ్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ ఆదివారం బుక్ ఫెయిర్ వేదికపై ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత తగుళ్ల గోపాల్, నంద కిషోర్ పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవి యాకుబ్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ తదితరులు

- పద్మజ బొలిశెట్టి రచించిన "ఆమె ఒక నది అని ఎవరికి తెలుసు" కవితా సంపుటిని తెలంగాణ జుడీషియల్ అకాడమీ డైరెక్టర్ రాజేందర్ జింబో, ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ స్త్రీవాద రచయిత్రి కుప్పిలి పద్మ, తోట మహేష్, శ్రీరామ్ పుప్పాల, ప్రముఖ కవులు యాకూబ్, డాక్టర్ ఎస్. రఘు తదితరులు పాల్గొన్నారు.
- గాదె వెంకటేష్ రచించిన "అన్న" దీర్ఘ కవిత, "పొలి" కవితా సంపుటాలను ప్రముఖ కవి ఆచార్య ఎన్. గోపీ, సాహిత్య విమర్శకుడు సుంకిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో చరిత్ర పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్, గుడిపల్లి నిరంజన్, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్ పాల్గొన్నారు.
- పుస్తక మహోత్సవం ముగింపు సభ సాయంత్రం 5.30 గంటలకు ఉంటుంది. బుక్ ఫెయిర్ సోమవారం సందర్శన వేళలు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

'తెలుగు కవిత్వ పరిణామం'

తెలంగాణ సాహిత్య చరిత్రకు పెద్దబాల శిక్ష

డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి రచించిన తాత్విక నేపథ్యంలోని తెలుగు కవిత్వ పరిణామం తెలంగాణ సాహిత్య చరిత్రకు పెద్దబాల శిక్ష లాంటిదని వక్తలు కొనియాడారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ వేదికపై ఆదివారం డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి రచించిన 'తాత్విక నేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామం' పుస్తకాన్ని సీనియర్ రచయిత గుడిపాటి, 'తెలంగాణ అస్తిత్వ నిర్మాణ వ్యాసాలు వినిర్మాణం' పుస్తకాన్ని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ పుస్తకాలను ప్రముఖ కవి ఆచార్య ఎన్ గోపీకి అంకితమిచ్చినట్లు రచయిత ప్రకటించారు. ఆచార్య ఎన్. గోపీ మాట్లాడుతూ.. వాటిని లోతైన విశ్లేషణాత్మక రచనలుగా అభివర్ణించారు. డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ సభాధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కాసుల ప్రతాపరెడ్డి, డాక్టర్ ఎస్. రఘు, పుప్పాల శ్రీరామ్, ఎన్. వేణుగోపాల్, పసునూరి రవీందర్ తదితరులు పుస్తకాల మీద మాట్లాడారు.

శివశంకర్ జీవితాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శివశంకర్ జీవితం అనేక పాఠాలను కళ్లకు కడుతుందని, ఆయన జీవితం - పోరాటం ఈ తరం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని, ఆయన జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాలలో సిలబస్‌గా చేర్చాలని వక్తలు అన్నారు. శివశంకర్ తెలుగు నేలపై జన్మించిన పూలే వారసుడని కొనియాడారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఆదివారం "పి. శివశంకర్ ఆత్మకథ - అదొక్కటే ముగింపు" పుస్తకంపై చర్చాగోష్ఠి జరిగింది. జస్టిస్ ఈశ్వరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ.. శివశంకర్ భారతరత్నకు అర్హుడని పేర్కొన్నారు. శివశంకర్ అంటే సామాజిక న్యాయానికి సిలబస్ అని జూలూరు గౌరీశంకర్ అన్నారు. ఆయన జీవితం రేపటి బహుజన ఉద్యమాలకు దిశా నిర్దేశమని పేర్కొన్నారు. ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కె. లక్ష్మణ్, శివశంకర్ తనయుడు డాక్టర్ వినయ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ.. కష్టపడితే జీవితంలో దేనినైనా సాధించవచ్చు అనడానికి శివశంకర్ జీవితమే నిదర్శనం అని అన్నారు. పుస్తక మహోత్సవంలో ఆదివారం చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు జరిగాయి. పోటీల్లో పాల్గొన్న చిన్నారులకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలతో పాటు మహనీయుల సంక్షిప్త జీవిత చరిత్ర పుస్తకాలను బహూకరించారు.

తెలంగాణ వికాసోద్యమ నాయకుడు 'భాగ్యరెడ్డి వర్మ'

ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): 'భాగ్యరెడ్డి వర్మ కేవలం దళితులకు మాత్రమే కాదు, ఆయన విస్తృత భారతీయ సమాజానికి సంబంధించిన గొప్ప వ్యక్తి' అని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె. శ్రీనివాస్ కొనియాడారు. ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్‌లోని ఆది హిందూ భవన్‌లో ఆదివారం భాగ్యరెడ్డి వర్మ 85వ వర్ధంతి సభ జరిగింది. ఆయన చిత్రపటానికి కె.శ్రీనివాస్ పుష్పాంజలి ఘటించి 'తెలంగాణ సామాజిక ఉద్యమాల్లో భాగ్యరెడ్డి వర్మ పాత్ర' అంశంపై స్మారకోపన్యాసం చేశారు.



మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్

నిజాం వ్యతిరేక పోరాటానికి ముందే 1900-1940 మధ్య తెలంగాణ వికాసోద్యమాన్ని ముందుండి నడిపిన వారిలో భాగ్యరెడ్డి వర్మ ముఖ్యులని అన్నారు. తద్వారా రాజకీయ సంస్కరణలకు అవసరమైన చైతన్యాన్ని తన కార్యాచరణ ద్వారా ఈ నేలకు అందించారని పేర్కొన్నారు. వందేళ్ల కిందటే ఆదిమాంధ్ర సభలో ఆర్థిక పరమైన అవసరాలను, ఆత్మగౌరవ హక్కులను మేళవించి తీర్మానాలను ప్రవేశపెట్టారని, అది ఈనాటి సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమని నొక్కి చెప్పారు. భాగ్యరెడ్డి వర్మ మీద తన పరిశోధనానుభవాలను కె. శ్రీనివాస్ చెప్పారు. సంగిశెట్టి శ్రీనివాస్ లాంటి వాళ్లు ఆయన రాసిన కథలను వెలుగులోకి తెచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. తెలుగు పాఠశాలల స్థాపన, జోగినీ వ్యవస్థ నిర్మూలన, మద్యపాన నిషేధ ఉద్యమం, ప్లేగు సమయంలో సేవా కార్యక్రమాలు.. ఇలా భాగ్యరెడ్డి వర్మ నిర్వహించిన ప్రతి కార్యాచరణ మీద లోతైన పరిశోధనలు జరగాలని ఆకాంక్షించారు. అంబేడ్కర్‌తో భాగ్యరెడ్డి వర్మకున్న అనుబంధాన్ని ప్రస్తావించారు. తెలంగాణ వికాసోద్యమానికి భాగ్యరెడ్డి వర్మ ప్రధాన చిహ్నం, ఈ నేల వైతాళికుడు అంటూ ప్రసంగించారు. ఆయన ప్రాసంగికతను వివరించారు. కార్యక్రమంలో ఆది హిందూ సోషల్ లీగ్ ట్రస్టీ జ్ఞానప్రకాష్, సంయుక్త కార్యదర్శి శ్రీలతా గౌతమ్, సభాధ్యక్షుడు బాల నర్సింహ, అంబేడ్కర్ పీపుల్స్ ట్రస్ట్ నిర్వాహకుడు రత్నం, గద్దర్ కుమారుడు సూర్యం, భాగ్యరెడ్డి వర్మ మనుమడు అజయ్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగబ్బాయి.. అమెరికా అమ్మాయి

- హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు యువకుడు, అమెరికా అమ్మాయి ప్రేమించుకున్నారు. హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకోవాలని నగరానికి వచ్చారు. పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. అబ్బాయి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్న దేవిరెడ్డి నారాయణరెడ్డి, అపర్ణారెడ్డి దంపతుల కుమారుడు డాక్టర్ నితిన్ అమెరికాలో ప్రముఖ వైద్యుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఫ్యామిలీ, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంలో నిపుణుడైన అతడికి అమెరికాకు చెందిన విట్నీ స్నిడర్(అనస్థీషియన్)తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారటం, పెద్దలు అంగీకరించటంతో ఆదివారం నార్సింగ్‌లో ఓ కన్వెన్షన్‌లో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు.


వధూవరులు డాక్టర్ నితిన్, విట్నీ స్నిడర్

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డులకు 13 ప్రాజెక్టులు ఎంపిక

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు డీఈఓ రోహిణి, జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్‌రావు తెలిపారు. జిల్లాస్థాయిలో 127 ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో ప్రదర్శించగా.. న్యాయనిర్ణేతలు 13 ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు చెప్పారు. త్వరలో విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు వివరించారు.

స్మగ్లర్ స్టాన్లీకి ముగిసిన పోలీసు కస్టడీ

- విచారణలో కీలక ఆధారాలు సేకరించిన నార్కోటిక్ బ్యూరో

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): డగ్స్ కింగ్‌పిన్ అంతర్జాతీయ నైజీరియా ఘరానా స్మగ్లర్ ఉవాల ఉడొక స్టాన్లీని ఇటీవల తెలంగాణ నార్కోటిక్ బ్యూరో (టి న్యాబ్) పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అతడి నుంచి రూ. 8కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. తక్కువ సమయంలో దేశవ్యాప్తంగా అతిపెద్ద డ్రగ్స్ నెట్‌వర్క్‌ను విస్తరించుకున్న స్టాన్లీకి దేశవ్యాప్తంగా 600 మంది వినియోగదారులు ఉన్నట్లు టీ న్యాబ్ పోలీసులు గుర్తించారు. అరెస్టయిన స్టాన్లీని పోలీస్ కస్టడీకి ఇవ్వాలని టీ న్యాబ్ పోలీసులు నాంపల్లి కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. న్యాయస్థానం ఐదురోజులు పోలీస్ కస్టడీకి అనుమతించింది. విచారణలో పోలీసులకు దేశవ్యాప్తంగా నిర్మించిన నెట్‌వర్క్‌కు సంబంధించి, సరుకు రవాణా, ఆర్డర్, స్మగ్లింగ్‌లో అతడికి సహకారం అందించిన వారి గురించి పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. స్టాన్లీ పోలీసు కస్టడీ ఆదివారంతో ముగిసింది.

స్టాన్లీకి సరుకు పంపుతున్న ఓక్రా అలియాస్ రాఫెల్ గోవా జైల్లోనే ఉన్నట్లు సమాచారం. తన ఐడెంటిటీని దాచిపెట్టిన ఓక్రా డబుల్ రోల్ పోషిస్తూ నైజీరియా నుంచి మాదక ద్రవ్యాలు దిగుమతి చేసుకోవడంలో కీలక పాత్ర పోషించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సరుకును స్వాధీనం చేసుకున్న తర్వాత తన నెట్‌వర్క్‌కు సరఫరా చేయడంలో ట్యాక్సీ డ్రైవర్స్ ఎక్కువగా సహకరించేవారని తెలిసింది. స్టాన్లీ భార్య ఉషాచాందిల్ సైతం స్మగ్లింగ్‌లో స్టాన్లీకి సహకరించినట్లు ఆధారాలను టీ న్యాబ్ పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. పోలీస్ కస్టడీలో సేకరించిన సాంకేతిక ఆధారాలను పరిశీలించిన అనంతరం స్టాన్లీతో లింక్ ఉన్న స్మగ్లర్స్, వినియోగదారులను పోలీసులు గుర్తించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లో ఏడుగురు వినియోగదారులున్నట్లు మొదట గుర్తించిన పోలీసులు ప్రస్తుతం ఇద్దరు మాత్రమే నగరానికి చెందినవారిగా తేల్చారు. వారి పూర్తి వివరాలు తెలియరాలేదు. మిగిలిన ఐదుగురు ఇతర నగరాల్లో ఉంటున్నట్లు గుర్తించారు.


రైతుకు వెండి కాయిన్ అందజేస్తున్న శేఖర్‌రెడ్డి, జీవీ సుబ్బారెడ్డి

అగ్రిటెక్ ప్రదర్శనకు విశేష స్పందన

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆవరణలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రీస్ సహకారంతో నాలుగోసారి నిర్వహిస్తున్న అగ్రిటెక్ సౌత్-2024 ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ఆదివారం ప్రదర్శనను తిలకించడానికి వచ్చిన రైతులతో భారత పరిశ్రమల సమాఖ్య చైర్మన్ శేఖర్‌రెడ్డి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవసాయ విభాగం సీజీఎం శాంతన్, కోరమండల్ తెలుగు రాష్ట్రాల ఉపాధ్యక్షుడు జీవీ సుబ్బారెడ్డి ముఖాముఖి చర్చలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు మేలు చేసేందుకు ప్రణాళికలు చేపట్టాలన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర వచ్చినప్పుడే వ్యవసాయానికి భవిష్యత్ ఉంటుందన్నారు. జిల్లా, మండల స్థాయిలో ఇలాంటి వ్యవసాయ ప్రదర్శనలు నిర్వహించాలని, గ్రామీణ యువతకు వ్యవసాయం పట్ల ప్రోత్సాహం కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రదర్శనకు వచ్చిన రైతుల పేరుతో తీసిన డ్రాలో పేర్లు వచ్చిన వారికి వెండి కాయిన్స్ అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ నిర్ణయాలు విప్లవాత్మక మార్పునకు నాంది

మంత్రి శ్రీధర్‌బాబు

మంగళ్‌హాట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దళితులు, అట్టడుగు స్థాయి వారిని విద్యావంతులుగా తయారు చేయాలనే ముందు చూపుతో గురుకులాలను ప్రారంభించిన మహోన్నత వ్యక్తి పీవీ నరసింహారావు అని మంత్రి శ్రీధర్‌బాబు కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రకటించడంతో బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆబిడ్స్ చిరాక్ అలీలేన్‌లోగల ఆలిండియా మైనింగ్ ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యాలయంలో పీవీ నరసింహారావు కుటుంబ సభ్యులకు ఆదివారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. పీవీ నిర్ణయాలు విప్లవాత్మక మార్పునకు నాంది పలికాయని గుర్తు చేశారు. ముందుగా పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీవీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. నర్సింహారావుకు భారతరత్న ఇవ్వడంపై విశ్లేషణలు కాదు అర్హతల విషయం మాత్రమే చర్చకు రావాలన్నారు. 14 యూనివర్సిటీల నుంచి డాక్టరేట్‌లతో పాటు పలు దేశాలలో అత్యున్నత పురస్కారాలను అందుకున్న మేధావి, ఐటీకి నాంది పలికి నేడు విప్లవాత్మక మార్పునకు కారకులయ్యారన్నారు. ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, పీవీ మనోహర్‌రావు, శారద మాట్లాడుతూ.. ప్రభుత్వం పీవీ సేవలను గుర్తించి భారతరత్న ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పీవీ కుటుంబ సభ్యులను సన్మానించారు. బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుశీష్‌కుమార్, విద్యావతి, సుధాకర్, యమునా పాఠక్, శ్రీనివాస్, వి. పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మూడు ఎంపీ సీట్లపై మజ్లిస్ గురి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న లోకసభ ఎన్నికల్లో మజ్లిస్ మూడు సీట్లను కైవసం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. హైదరాబాద్ కేంద్రంగా ఏళ్ల తరబడి ఒకే ఒక్క ఎంపీ సీటుతో జాతీయ రాజకీయ కార్యకలాపాలను నిర్వహిస్తున్న ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎఐఎంఐఎం) గత పార్లమెంట్ ఎన్నికల్లో ఔరంగాబాద్ స్థానాన్ని చేజిక్కించుకుంది. ఈ సారి బిహార్ కిషన్‌గంజ్ నుంచి అభ్యర్థిని నిలబెట్టడంతోపాటు ఆ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ మూడురోజులపాటు బిహార్‌లో పర్యటించి లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారంచుట్టారు.

విద్యార్థినులది ఆత్మహత్య కాదు

- మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల డిమాండ్

పంజాగుట్ట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థినుల మృతిపై అనుమానాలు ఉన్నాయని, వారు ఆత్మహత్య చేసుకునేంత పిరికివారు కాదని, అత్యాచారం చేసి మృతదేహాలను హాస్టల్ గదిలో పెట్టి, ఆత్మహత్య చేసుకున్నారని కట్టుకథలు అల్లారని వక్తలు ఆరోపించారు. హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.విద్యార్థినుల న్యాయ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

మహిళా, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థినుల కుటుంబ సభ్యులు, తదితరులు మాట్లాడారు. పథకం ప్రకారం వారిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. వారి శరీరాలపై సిగరెట్లతో కాల్చిన గుర్తులు, గాట్లు ఉన్నాయన్నారు. సూసైడ్ నోట్‌లో ఉన్నది వారి చేతిరాత కాదన్నారు. సంఘటన జరిగిన రోజున మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారిని హాస్టల్ వార్డెన్ శైలజారెడ్డి ఎక్కడికి తీసుకెళ్లింది, ఎందుకు తీసుకెళ్లింది, వచ్చేటప్పుడు వారు ఏ పరిస్థితిలో వచ్చారో వార్డెన్ శైలజారెడ్డి, ఆటో డ్రైవర్ ఆంజనేయులును విచారిస్తే నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. దర్యాప్తు చేయకుండానే ఆత్మహత్య చేసుకున్నారని భువనగిరి సీఐ ఎలా చెబుతారని అన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై ప్రభుత్వ నియంత్రణ లేదని, హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఘటనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాజీనామా చేయాలని, స్థానిక ఏసీపీ, సీఐలను సస్పెండ్ చేయాలని, వార్డెన్, ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని చైతన్య మహిళా సంఘం ప్రతినిధి జ్యోతి హెచ్చరించారు.

సమావేశంలో వివిధ సంఘాల నాయకులు వాసు కె. యాదవ్, స్వరూప, వరలక్ష్మి, రాజారామ్ యాదవ్, లక్ష్మి, మధు యాదవ్, పరీక్షన్ రాజ్, శ్రీనివాస్, చామకూర రాజు, మేకల కృష్ణ, విజయ్‌మోహన్, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణంలో..

ఎన్నో పాఠాలు నేర్చుకున్నా!

ఆమె నటి, మోడల్, పొలిటీషియన్. పేరు ఇషా కొప్పికర్. 'ప్రేమతో రా', 'చంద్రలేఖ' చిత్రాలతో తెలుగు తెరకు పరిచయమై... ఆ తర్వాత బాలీవుడ్‌కు పరిమితమైంది. ఇటీవలే 'ఏలియన్' అనే తమిళ చిత్రంలో నటించింది. ఇషా కొప్పికర్ గురించి కొన్ని విశేషాలు..

"మోడలింగ్‌లో పేరు తెచ్చుకోవటం.. నటిగా నిలదొక్కుకోవటం.. రాజకీయాల్లోకి రావటం.. ఇదంతా ఊరికే జరగలేదు. ఎన్నో కష్టాలు పడ్డాను. ఇబ్బందులెదుర్కుంటేనే జీవితం తెలిసేది. ఎక్కడా ఆగలేదు. ఏ కష్టానికి భయపడలేదు. ముందడుగులేశా కాబట్టి ఇలా ఉన్నా. జీవిత ప్రయాణంలో ఎన్నో పాఠాలు నేర్చుకున్నా. ఏదీ సాఫీగా సాగిపోలేదు. ఎప్పుడూ నా సోల్‌ను పోగొట్టుకోలేదు. అదే నా లైఫ్‌లో ఉండే గొప్పతనం.

అలా సినిమాల్లోకి..

ఇషా కొప్పికర్ ముంబైలో పుట్టి పెరిగింది. లైఫ్ సైన్సెస్ చదివింది. కాలేజీ రోజుల్లోనే మోడలింగ్ చేసేది. అలా ఫొటోషూట్స్ చేసేది. ఆమె లుక్స్ చూసి లక్స్, రెగ్జోనా, కామె.. లాంటి



ప్రముఖ సబ్బుల సంస్థలు ఆమెను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నాయి. కోకోకోలా యాడ్ కూడా చేసింది. 1995లో మిస్ ఇండియా పోటీల్లో పాల్గొంది. ఆమెకు 'మిస్ టాలెంట్ క్రౌన్' అవార్డును అందుకుంది. అప్పుడే 'ప్రేమతో రా' చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. అలా ఈ ముంబై భామ తెలుగు చిత్రాలతోనే తెరమీదకొచ్చింది. ఆ తర్వాత 'చంద్రలేఖ'తో మంచి పేరు తెచ్చుకుంది. తమిళ, కన్నడ చిత్రాల్లో నటించింది. హిందీలో 'ఫిజా' చిత్రంతో ఎంటరైంది. 'కంపెనీ', 'డాన్', 'ఏక్ వివాహ్..', 'షబ్రీ', 'డార్లింగ్' లాంటి పదుల చిత్రాల్లో నటించింది. అయితే ఆమెకు నచ్చేది మాత్రం 'డాన్', 'ఖల్లాస్' చిత్రాలేనట.

అందుకే కొన్ని చిత్రాలు చేయలేకపోయా..

"స్పెషల్ అప్పియరెన్స్‌తో పాటు సెకండ్ క్యారెక్టర్స్ కూడా నటించా. కొన్ని మంచి చిత్రాల్లో నటించే అవకాశం వచ్చింది. అయినా అవకాశాలెదుర్కున్నా. ఓ హీరోతో క్యాస్టింగ్ కౌచ్ సమస్య ఎదుర్కున్నా. 1999 చివర్లో.. ఓ హీరో నన్ను ఒంటరిగానే రమ్మని తన ఇంటికి ఆహ్వానించాడు. పదే పదే 'నీ స్టాఫ్‌ను తీసుకురాకు' అన్నాడు. నేను వెళ్లలేదు. ఆ తర్వాత ఆ చిత్రం ఓ ప్రముఖ నిర్మాత బిడ్డ ఆ సినిమా హీరోయిన్‌గా కనిపించింది. అవేమీ పట్టించుకోలేదు. ఇలాంటి ఇబ్బందులు కొన్ని ఎదుర్కున్నా. ప్రతిభ, గుడ్ లుక్స్‌తోనే పాత్రలు దొరికాయి.



అదే చాలనుకుంటా..

ఇషా కొప్పికర్ 2009లో పెళ్లి చేసుకుంది. ఆమెకో కూతురు. న్యూమరాలజీని నమ్ముతుంది. తనకు రణ్‌బీర్ కపూర్ యాక్టింగ్ అంటే ఇష్టమని చాలా ఇంటర్వ్యూల్లో చెబుతుంది. 'వర్కవుట్స్ చేయటంలో ముందుంటాను. అదో అలవాటు. మూడ్ బాలేకుంటే మంచి మ్యూజిక్ పెట్టుకుని డ్యాన్సేయటం.. స్నేహితులతో చిల్ అవటం చేస్తుంటా. ప్రయాణాలు చేస్తుంటా' అంటుందామె. 'సినిమా నటిని అవుతానని.. ఇలా ఫేమ్ అవుతానని అనుకోలేదు. ఇదంతా అదృష్టం. ఇదే చాలనుకుంటా'నంటుంది ఇషా కొప్పికర్. 'దహనం' వెబ్‌సిరీస్‌తో నటిగా మంచి పేరొచ్చింది. 'అమ్మగా.. లైఫ్ స్టయిల్ ఇన్‌ఫ్లూయన్సర్‌గా.. వెల్‌నెస్ ఎక్స్‌పర్ట్‌గా జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నా' అంటూ మురిసిపోతుందీమె.

ఆమె లక్ష్యం అగ్ని రక్ష

గొప్ప గాయని కావాలనే ఆమె ఆశ మంటల్లో కాలిపోయింది. అందమైన ఆమె రూపం తనకే భయం పుట్టేంత వికారంగా మారింది. కానీ తల్లి సంకల్పాన్ని తన దృఢ నిశ్చయంగా మార్చుకున్నారు డాక్టర్ ప్రేమా ధనరాజ్. పాతికవేల మందికి పైగా అగ్నిప్రమాద బాధితులకు ప్లాస్టిక్ సర్జరీతో కొత్త జీవితాన్నిచ్చారు. తన స్వచ్ఛంద సంస్థ ద్వారా వారి జీవనోపాధికి సైతం దోహదం చేస్తున్నారు.

తమిళనాడులోని వెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి (సిఎంసిహెచ్). డైరెక్టర్ జోసెఫ్ గదిలోకి అటెండర్ వచ్చి "సార్! ఎవరో డాక్టర్. మిమ్మల్ని కలవడానికి వచ్చారు" అని చెప్పాడు. "లోపలికి పంపించు" అని అన్నారు జోసెఫ్. గదిలోకి ఒక అమ్మాయి ప్రవేశించి "డాక్టర్! నేను గుర్తున్నానా?" అని అడిగింది. లేదు అన్నారు జోసెఫ్. "నా పేరు ప్రేమా ధనరాజ్ సర్! మీరు నాకు సర్జరీలు చేశారు. చాలా రోజులు ఈ ఆసుపత్రిలోనే పేషెంట్‌గా ఉన్నాను. ఇప్పుడు డాక్టర్‌నయ్యాను" అని చెప్పిందామె. జోసెఫ్ ఆశ్చర్యంగా చూస్తూ "నిజమా? నువ్వు డాక్టర్ అయ్యావా?" అని అడిగారు. అవునన్నట్టు తల ఊపిందామె. ఆమె వైద్యురాలు కావాలనే నిర్ణయానికి బీజం పడింది కూడా ఆ ఆసుపత్రిలోనే.

వైద్యులు కనిపిస్తే అరిచేదాన్ని..

ప్రేమ స్వస్థలం బెంగళూర్. రోజీ స్టెల్లా, ధనరాజ్ దంపతుల నలుగురు సంతానంలో ఆమే పెద్దది. బంగారు రంగులో, చక్కటి కళ్లతో... ఎంతో అందంగా ఉండే ప్రేమకు సంగీతం అంటే ప్రాణం. పోటీల్లో పాల్గొంటే బహుమతి గెలవాల్సిందే. అది 1965. ఎనిమిదేళ్ల ప్రేమ స్కూల్‌లో జరిగే పాటల పోటీకి సిద్ధమవుతోంది. అమ్మా, నాన్నా బయటకు వెళ్లడంతో... కాఫీ కాచడానికి స్టవ్ వెలిగించింది. కిరోసిన్ లేకపోవడంతో స్టవ్ మండలేదు. సీసాతో కిరోసిన్ తెచ్చి, స్టవ్‌లో పోస్తుండగా... హఠాత్తుగా మంటలు చెలరేగి ఆమె ముఖాన్ని తాకాయి. స్టవ్ పేలిపోయింది. ఆమె కేకలు విని ఇరుగు పొరుగు వారు వచ్చి, ఆసుపత్రికి తీసుకువెళ్లారు. "అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. నా కింది పెదవి ఛాతీకి అంటుకుపోయింది. నా మెడ ఉందో లేదో తెలియడం లేదు. యాభై శాతం కాలిన గాయాలతో ఆసుపత్రిలో చేరిన నాకు ప్రథమ చికిత్స చేసిన తరువాత... వెల్లూరు సిఎంసిహెచ్‌కు బెంగళూరు వైద్యులు రిఫర్ చేశారు. నా గొంతులోంచి ట్యూబ్ అమర్చడానికి మూడు సర్జరీలు చేసినా... మెడ దగ్గర అవరోధం వల్ల అవన్నీ ఫెయిలయ్యాయి. ఆ సర్జరీల సమయంలో నరకం చూశాను. వైద్యులు కనిపిస్తే వారి మీద అరిచేదాన్ని" అని గుర్తు చేసుకున్నారు ప్రేమ. నాలుగో సర్జరీకి ఏర్పాట్లు జరుగుతున్నప్పుడు... ఆమె తల్లి "దేవుడా! ఎలాగైనా నా బిడ్డను కాపాడు. ఆమెను వైద్యురాల్ని చేస్తాను. ఇదే ఆసుపత్రిలో ఆర్తులైన రోగులకు సాయపడేలా తీర్చిదిద్దుతాను" అని మొక్కుకున్నారు. పన్నెండు గంటల పాటు జరిగిన ఆ సర్జరీ విజయవంతమయింది. ఆరు నెలల తరువాత వెల్లూరు ఆసుపత్రి నుంచి బెంగళూరుకు ప్రేమ తిరిగొచ్చారు. "కాస్త కోలుకున్నాక మళ్ళీ బడికి వెళ్ళాలనుకున్నాను. కానీ నా ముఖం అందవికారంగా తయారైంది. పూర్తిగా కాలిపోయిన జుట్టు అప్పుడప్పుడే కాస్త వస్తోంది. అందరికీ ఎంతో ఇష్టమైన నా గొంతు బొంగురుగా మారిపోయింది. మంచి గాయని కావాలనుకున్న నా ఆశ నాశనమైపోయింది. రోజూ నాతో ఆడుకొనే పిల్లలు నా దగ్గరకు రావడం మానేశారు. అద్దంలో నా ముఖాన్ని చూసుకోవడానికి భయపడేదాన్ని. ఆ సమయంలో నా తోబుట్టువులు నాకు ధైర్యం చెప్పేవారు" అని తెలిపారు ప్రేమ.

అది దైవ నిర్ణయం

ఆమె హైస్కూల్ చదువంతా ప్రైవేటుగానే సాగింది. దాదాపు ఆరేళ్ళలో పద్నాలుగు సర్జరీలు చేయించుకోవాల్సి రావడంతో... చదువుకు మూడేళ్ళ విరామం వచ్చింది. ఎక్కువసేపు మెడను నిలబెట్టి కూర్చోలేకపోవడంతో పాఠాలు చదవడానికి ఇబ్బందయ్యేది. కానీ డాక్టర్ కావాలనే తపన ఆ కష్టాన్నీ, వేదననూ భరించేలా చేసింది. మంచి మార్కులతో టెన్త్ పాసవడం ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఇంటర్ పూర్తి చేశారు. హుబ్లీ మెడికల్ కాలేజీ నుంచి ఎంబిబిఎస్ డిగ్రీ అందుకున్నారు. తల్లి దేవుడికి చేసిన వాగ్దానం ప్రకారం... సిఎంసిహెచ్‌లో... డైరెక్టర్ హోదాకు చేరుకున్న డాక్టర్ జోసెఫ్‌ను కలిశారు. అక్కడే వైద్యురాలుగా చేరారు. ఆయన ప్రోత్సాహంతో... లూధియానాలోని సిఎంసిలో ప్లాస్టిక్, రీకన్‌స్ట్రక్షన్ సర్జరీలో స్పెషలైజేషన్ చేశారు. సర్జన్‌గా సిఎంసిహెచ్‌లో సేవలు అందించడం ప్రారంభించారు. "నన్ను ఆసుపత్రికి తీసుకువెళ్ళిన ప్రతిసారీ... మా అమ్మ నన్ను డాక్టర్ కుర్చీలో కూర్చున్నట్టు ఊహించుకొనేది. నన్ను రోగుల సేవకే అంకితం చేయాలన్న అమ్మ నిర్ణయాన్ని దేవుడి నిర్ణయంగానే పరిగణిస్తాను" అంటారు ప్రేమ. అగ్ని ప్రమాద బాధితులకు ప్లాస్టిక్ సర్జరీ చేయడంలో నిపుణురాలుగా అతి తక్కువ కాలంలోనే ఆమె పేరు పొందారు. మరోవైపు దేశ, విదేశీ వైద్య విద్యార్థులెందరికో సర్జరీలో శిక్షణ ఇచ్చారు. పాతికవేలకు పైగా ప్లాస్టిక్ సర్జరీలు చేసి, అగ్నిప్రమాద బాధితులకు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. ప్రస్తుతం వెల్లూరు సిఎంసిహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగం అధిపతిగా, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా వ్యవహరిస్తున్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి పురస్కారాలు అందుకున్నారు.

బాధ్యత పెరిగింది...

సమాజానికి తన వంతు సేవ చేయాలనే ఆలోచనతో... 2002లో 'అగ్ని రక్ష' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. అగ్నిప్రమాదాలకు గురైనవారికి సంపూర్ణమైన చికిత్స, పునరావాసం కల్పించడం ఈ సంస్థ లక్ష్యం. అంతేకాదు, బాధితులకు ఆరోగ్య కార్యకర్తలుగా శిక్షణనిచ్చి, ఉపాధి కూడా కల్పిస్తున్నారు. "మా సంస్థ ద్వారా ఇప్పటివరకూ 18 వేల మంది అగ్ని ప్రమాద బాధితులకు చికిత్స చేశాం. సుమారు 17 మందికి కౌన్సెలింగ్ ఇచ్చాం. ఇంటి దగ్గరే వైద్యం, ఫిజియోథెరపీ, న్యాయపరమైన సహాయం లాంటివి పొందినవారి సంఖ్య దాదాపు 15 వేల వరకూ ఉంటుంది. పేద కుటుంబాల వారికి, ముఖ్యంగా మహిళలకు, పిల్లలకు సమగ్రమైన వైద్యంతో పాటు ఆదాయాన్ని పొందే అవకాశాలను కూడా కల్పిస్తున్నాం. వాళ్ళ జీవితాల్లో మార్పు కనిపించినపుడు... నన్ను వారి సేవకు అంకితం చేస్తానని మొక్కుకొని, అది సాధ్యం కావడానికి దోహదం చేసిన మా అమ్మ సంకల్పాన్ని తలచుకుంటాను. అది నాకు నిరంతరం ప్రేరణ ఇస్తూనే ఉంటుంది" అంటారామె. డాక్టర్ ప్రేమ సేవానిరతిని గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆమెకు ఈ ఏడాది 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించింది. "ఇది నాకు ఎంతో ప్రత్యేకం. ఎందరెందరో అభినందనలు చెబుతూ ఉంటే... నా బాధ్యత మరింత పెరిగినట్టు అనిపిస్తోంది. నాకు ప్రమాదం జరిగిన తరువాత ఎన్నో ఏళ్ళ పాటు శారీరకంగా, భావోద్వేగపరంగా, సామాజికంగా ఎన్నో సవాళ్ళను ఎదుర్కొన్నాను. అలాంటి బాధ ఎవరూ పడకూడదు. బాధితుల్లో చాలామంది కుంగిపోతూ ఉంటారు. కానీ జీవితం అక్కడితో ముగిసిపోదు. ఇది కొత్త జీవితానికి ఆరంభంగా భావిస్తే... కొత్త దారులు కనిపిస్తాయి. దానికి నాకన్నా పెద్ద ఉదాహరణ అవసరం లేదు" అంటున్నారు ప్రేమ.



లిల్లీ పూలతో లక్షలు సంపాదిస్తోంది!



ఆమెకు పూలంటే ఇష్టం. కుండీల్లో పూలను పెంచటం భలే ఇష్టం. ఆ ఇష్టమే కాస్త వ్యాపారంగా మార్చుకుంది. తన పేరు విజి అబి. ఉండేది కేరళలో. అందరిలా కాకుండా వాటర్ లిల్లీలను పెంచుతోందీమె. నెలకు లక్ష రూపాయలను సంపాదిస్తూ తన పూల వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటోన్న విజి అబిని 'వాటరాఫ్ లిల్లీ' అని పిలుస్తున్నారిప్పుడు.

"నేనిప్పుడు నీళ్లలో పెరిగే లిల్లీ పూలను ఫేస్‌బుక్, ఇన్‌స్టా ద్వారా దేశంలోనే కాకుండా ఇతర దేశాలకూ అమ్ముతాను. నెలకు కనీసం లక్ష రూపాయల సంపాదన ఉంటుంది. పిల్లలకంటే ప్రేమగా ఈ పూలను పెంచాలి. అప్పుడే ఇందులో రాణించగలం. నా వరకు ఈ వాటర్ లిల్లీ పూల వ్యాపారం అంత సులువేమీ కాదు. అనుభవంతోనే పూల పెంపకాన్ని నేర్చుకున్నా.

అలా పూల వ్యాపారంలోకి..

ఎందుకో తెలీదు చిన్నప్పటి నుంచి గార్డెనింగ్ అంటే ఇష్టం. మల్లెపూలు, రోజా, గులాబీ పూలను పెంచేదాన్ని. ఏదో ఆసక్తితో ప్రతి ఆడపిల్ల పెంచినట్టే పూల మొక్కలను పెంచేదాన్ని. కుండీల్లో నీళ్లను పోయటం, మట్టి తీసుకురావటం.. పూలను గమనించటం చేసేదాన్ని. పెళ్లయ్యాక కూడా ఇంట్లో పూలను పెంచుకునేదాన్ని. మా అబ్బాయి పుట్టాక ఖాళీగా ఉండేదాన్ని. ఉద్యోగంలో మళ్లీ చేరదామనుకున్నా. ఆ సమయంలో ఇంట్లోనే ఉండి ఏదైనా చేయాలనుకున్నా. బాబును చూసుకుంటూ పూల మొక్కలు ఎక్కువగా ఇంట్లోనే పెంచాలనుకున్నా. అందుకే ఉద్యోగానికి రాజీనామా చేశా. లిల్లీ పూల పెంపకం బావుంటుందని తెలిస్తే ఐదేళ్ల కితం తొలి వాటర్ లిల్లీ మొక్కలను కొన్నా. కేరళలో త్రిశూర్ ప్రాంతంలోని వాతావరణానికి ఆ మొక్కలు బతకలేదు. దీంతో ఇక్కడ బతికే పూలేవీ అని ఇంటర్నెట్‌లో వెతికా. ఫేస్‌బుక్‌లో వాటర్ లిల్లీ పూల గురించి తెలిసింది. ఇంటర్నేషనల్ వాటర్ లిల్లీ గ్రూప్స్‌తో పాటు గార్డెనింగ్ గ్రూప్స్‌లో జాయిన్ అయ్యా. వారితో మాట్లాడటం, మెసేజుల్లో సలహాలు తీసుకునేదాన్ని. వాటర్ లిల్లీను పెంచా. మంచి గిరాకీ ఉండటంతో.. వాటర్ లిల్లీల పెంపకం పూర్తి స్థాయిలో చేయాలనుకున్నా.

అందుకే సక్సెస్..

మా ఇంట్లోవారి ప్రోత్సాహం ఉంది. దీనికి తోడు ఈ వాటర్ లిల్లీ పూల కోసం మంచి వాతావరణాన్ని క్రియేట్ చేశా. ఇంట్లో పనులు చేసుకుని, మా అబ్బాయిని బడికి పంపించి.. ఈ లిల్లీ పూల మొక్కలను ప్రాణంగా చూసుకునేదాన్ని. నాకంటూ ఓ కొత్త ప్రపంచాన్ని ఏర్పరచుకోవాలి. అందులో నేనే డైరక్టర్‌గా ఉండాలనుకుండేదాన్ని మనసులో. అలా ఈ వాటర్ లిల్లీ వ్యాపారంలో నిజమైంది. మంచి సక్సెస్ అందుకున్నా. ఇంటి వద్దకే కాదు.. ఆన్‌లైన్‌లో ఆర్డర్స్ పెరిగాయి. వంద రకాల వాటర్ లిల్లీ మొక్కలను పెంచుతాను. ఆర్గానిక్ ఫామింగ్ చేస్తాను. దగ్గరుండి ఈ పని ప్రేమతో చేస్తాను కాబట్టే పూల గురించి ఎన్నో విషయాలు తెలిసాయి. విభిన్న పూలకోసం వెతకటం.. అంటు కట్టడం చేస్తుంటా. ఏ సీజన్‌లో ఏ పూలకు డిమాండ్ ఉంటే అక్కడకు సరఫరా చేస్తాను. అంతర్జాతీయ వాటర్ లిల్లీ మెంబర్స్ గుర్తించారు. కేరళలో అవార్డులు ఇచ్చారు. ప్రకృతికి మంచి చేసే ఈ పూల వ్యాపారం ఎవరైనా చేసుకోవచ్చని చెబుతా. నాకు తెలిసింది నేర్పిస్తా. విత్తనాలను, పూల మొక్కలను ఇస్తుంటా. నాలా ఈ వ్యాపారం ఇష్టం ఉండేవారికి నా వంతు సాయం చేస్తా. పూలంటే ఎవరికి ఇష్టం ఉండదు? నాకూ అంతే. అయితే కాస్త ఎక్కువ ఇష్టం. అందుకే పూల మనసును అర్థం చేసుకుని.. ఈ వాటర్ లిల్లీ పూలతో లక్షలు సంపాదిస్తున్నా."

నవ్య | చిత్రజ్యోతి

అన్ని భాషల్లో అద్భుతాలు సృష్టిస్తుంది



ప్రతి భారతీయుడు కచ్చితంగా చూడాల్సిన సినిమా 'రికార్డ్ బ్రేక్' అని నిర్మాత, దర్శకుడు చదలవాడ శ్రీనివాస రావు చెప్పారు. ఆయన దర్శకత్వంలో చదలవాడ పద్మావతి నిర్మించిన 'రికార్డ్ బ్రేక్' చిత్రం టీజర్, ట్రైలర్‌లను ఆదివారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ' ఈ సినిమాలో హీరో అంటూ ఎవరూ లేరు ఇందులో పని చేసిన ఆర్ట్ డైరెక్టర్, ఫైట్ మాస్టర్, మ్యూజిక్ డైరెక్టర్.. వీళ్లే హీరోలు. నాకున్న అనుభవంతో మంచి కథ తీసుకుని సమాజానికి ఉపయోగపడే సినిమా అందించాలనే తపనతో ఐదేళ్లు కష్టపడి 'రికార్డ్ బ్రేక్' తీశాం. ఈ చిత్రానికి ఆ టైటిల్ కరెక్ట్ అని చూసిన వాళ్లంతా చెప్పారు. తెలుగుతో సహా ఎనిమిది భాషల్లో చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. అన్ని భాషల్లో అద్భుతాలు సృష్టిస్తుంది. కచ్చితంగా అందరికీ ఈ సినిమా నచ్చుతుంది' అన్నారు. దర్శకుడు అజయ్‌కుమార్ మాట్లాడుతూ 'ఇప్పుడు వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఈ సినిమా ఉంటుంది. ఇద్దరు అనాథలు దేశానికి గర్వకారణంగా ఎలా ఎదిగారు అనే కథతో ఈ సినిమా తీశాం. ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్‌ను ఇందులో చూపిస్తున్నాం' అని చెప్పారు. నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'మంచి మనసున్న వ్యక్తి, ఎన్నో అద్భుత చిత్రాలు నిర్మించిన నిర్మాత శ్రీనివాస రావుగారు. సామాజిక కథాంశంతో ఆయన రూపొందించిన 'రికార్డ్ బ్రేక్' చిత్రం మంచి విజయం సాధించాలి' అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, హీరోయిన్ రగ్గా, నటి సత్యకృష్ణ, హీరోల్లో ఒకరైన నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

భయపెట్టనున్న వేదిక



హీరోయిన్ వేదిక ప్రధాన పాత్ర పోషిస్తున్న 'ఫియర్' చిత్రం షూటింగ్ పూర్తయింది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంతో హరిత గోగినేని దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. అరవింద్ కృష్ణ ఒక ప్రత్యేక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. ఆయన ఈ చిత్రం గురించి వివరిస్తూ 'మా దర్శకురాలికి ఇది తొలి చిత్రమే అయినా ఎంతో క్లారిటీతో ఉండడం వల్ల పక్కాగా ప్లాన్ చేసి తక్కువ టైమ్‌లో సింగిల్ షెడ్యూల్‌తో చిత్రాన్ని పూర్తి చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పారు. జయప్రకాశ్, పవిత్రా లోకేశ్, అనిష్ కురివిల్లా, షాయాజీ షిండే, సత్యకృష్ణ, సాహితి దాసరి, షాని తదితరులు నటించిన ఈ చిత్రానికి పాటలు: కృష్ణకాంత్, సంగీత: అనూప్ రూబెన్స్, ఫొటోగ్రఫీ: ఆండ్రూ, కో ప్రొడ్యూసర్స్: సుజాత రెడ్డి, సురేందర్ రెడ్డి.

ఏఐ జనరేటెడ్ తొలి లిరికల్ వీడియో



శివ కందుకూరి హీరోగా రూపొందిన యూనిక్ క్రైమ్ థ్రిల్లర్ 'భూతద్దం భాస్కర్ నారాయణ' మార్చి ఒకటిన విడుదల కానుంది. పురుషోత్తమ్ రాజ్ దర్శకత్వంలో స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకున్న ఈ చిత్రం నుంచి 'శివ ట్రాప్ ట్రాన్స్' పాటను సంగీత దర్శకుడు కీరవాణి విడుదల చేశారు. చైతన్యప్రసాద్ రాసిన ఈ పాటకు శ్రీ చరణ్ పాకాల స్వరాలు అందించారు. ఏఐ చాట్ జీపీటీని ఉపయోగించి లిరికల్ విజువల్స్ తయారు చేశారు. ఈ లాంచింగ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన హీరో సుహాస్ మాట్లాడుతూ 'శివ చాలా మంచోడు. ఈ సినిమా ప్రొడక్షన్ వాల్యూస్ బాగున్నాయి. చైతన్యప్రసాద్ రాసిన పాటలు గూస్ బంప్స్ తెప్పించాయి. శ్రీ చరణ్ మంచి సంగీతం ఇచ్చారు' అని ప్రశంసించారు. హీరో శివ కందుకూరి మాట్లాడుతూ 'సినిమాలో చాలా కీలకమైన సన్నివేశంలో ఈ పాట వస్తుంది. నా ఫేవరెట్ సాంగ్ ఇది' అన్నారు. 'మార్చి ఒకటిన సినిమాను విడుదల చేస్తున్నాం. తప్పకుండా థియేటర్‌లో చూడండి. అందరికీ అద్భుతంగా నచ్చుతుంది' అన్నారు నిర్మాతలు.

ఎప్పటికీ మాతోనే ఉంటావు

తారకరత్న భార్య ఎమోషనల్ పోస్ట్



హీరోగా, విలన్‌గా ప్రేక్షకులను అలరించిన నందమూరి తారకరత్న గుండెపోటుతో అకాల మరణం పొంది ఈ ఆదివారానికి ఏడాది అయింది. ఆయన తొలి వర్ధంతి సందర్భంగా ఆయన భార్య అలేఖ్య రెడ్డి సోషల్ మీడియాలో ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'నిన్ను నేను చివరిసారిగా చూసిన రోజు దగ్గరయ్యే కొద్దీ.. నేను పడుతున్న బాధ ఎవరికీ చెప్పలేనిది. నీకు, నాకు మధ్య సరిహద్దులు లేవు. రెండు విభిన్న ప్రపంచాల నుంచి మా ప్రయాణాన్ని ఇలాగే కొనసాగిస్తాం. ఎలాంటి మార్పు లేదు. నీ ఉనికి, నీ ప్రేమ, మాపై చూపించే ప్రభావం ఎప్పటికీ మరువలేం. నేను నిన్ను ముట్టుకోలేను కానీ నీ ఉనికి ఎప్పుడూ మా చుట్టే ఉంటుంది. మీరే మా బలం.. ఎప్పటికీ మాతోనే ఉంటావు' అంటూ పేర్కొన్న అలేఖ్య పిల్లలతో ఉన్న ఫొటో షేర్ చేశారు.

గాంజా శంకర్ చిత్ర యూనిట్‌కు.. నార్కోటిక్ బ్యూరో నోటీసులు

సాయిధరమ్‌తేజ్ హీరోగా నటిస్తున్న గంజా శంకర్ చిత్రానికి తెలంగాణ నార్కోటిక్ బ్యూరో అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇటీవల విడుదలైన గంజాశంకర్ ప్రచార చిత్రాన్ని చిత్ర బృందం యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసింది. అందులో లీఫీ వెజిటబుల్స్ మాటున గంజాయి స్మగ్లింగ్, డ్రగ్స్ వినియోగంతో యువతను పెడదోవ పట్టించే అంశాలు ఉన్నాయని పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రాష్ట్ర, అంతరరాష్ట్ర ఘరానా స్మగ్లర్స్ ఆటకట్టిస్తూ మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతుంటే.. మరోవైపు సినిమా ఇండస్ట్రీ వారు గంజాయి, డ్రగ్స్ వంటి కంటెంట్‌ను పెట్టి సినిమాలు తీస్తున్నారని అన్నారు. సినిమా ఇండస్ట్రీ పెద్దలకు కూడా సామాజిక బాధ్యత ఉండాలని తెలంగాణ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య నోటీసుల్లో పేర్కొన్నారు.

- హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

తండ్రి దర్శకుడు.. తనయుడు హీరో



తన తనయుడు హేమచంద్రారెడ్డిని హీరోగా పరిచయం చేస్తూ కుల్లపరెడ్డి సురేశ్‌బాబు స్వీయ దర్శకత్వంలో 'ఇద్దరికీ కొత్తేగా' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా సురేశ్‌బాబు మాట్లాడుతూ 'ఇంతకుముందు నేను 'వకాలత్ నామా' అనే చిత్రంలో హీరోగా నటించాను. ఇప్పుడు మా అబ్బాయిని హీరోగా పరిచయం చేస్తూ 'ఇద్దరికీ కొత్తేగా' చిత్రాన్ని నా దర్శకత్వంలో నిర్మిస్తున్నాను. నా లైఫ్‌స్టోరీనే ఇతివృత్తంగా ఎన్నుకున్నాను. ఇందులో ముగ్గురు హీరోయిన్లు ఉంటారు. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలూ ఉంటాయి' అని తెలిపారు. ఈ చిత్రానికి ఫొటోగ్రఫీ: కోట తిరుపతిరెడ్డి, మాటలు: కరుణాకర్, కె.కె.రెడ్డి, సంగీతం: ఎం.ఎం.ఎస్.

హైదరాబాద్ ● సోమవారం 19 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com

టీఎస్‌పీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికైన వివిధ వర్గాల్లోని ప్రముఖులు

- భారత జాతీయ కాంగ్రెస్- నెహ్రూ, రాజేంద్రప్రసాద్.
- ముస్లింలు- మౌలానా అబుల్ కలాం ఆజాద్, సయ్యద్ సాదుల్లా.
- మైనారిటీలు- హెచ్.సి.ముఖర్జీ
- పారశీకులు- హెచ్.పి.మోడి
- సిక్కులు- సర్దార్ బలదేవ్‌సింగ్, హుకుంసింగ్
- యురోపియన్లు- ఫ్రాంక్ ఆంథోని.
- హిందూ మహాసభ- డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ
- కార్మిక వర్గాలు- బాబూ జగ్జీవన్ రామ్.
- అఖిల భారత మహిళా సమాఖ్య- హంసా మెహతా.
- అఖిల భారత జమిందారుల సంఘం- దర్భాంగా మహారాజు.
- బెంగాల్ నుంచి ఎంపికైన డాక్టర్ అంబేద్కర్ దేశ విభజన తరవాత తన ప్రాతినిధ్యాన్ని కోల్పోయారు. బాంబే రాష్ట్రం నుంచి రాజ్యాంగ పరిషత్‌కు నామినేట్ అయ్యారు.
- రాజ్యాంగ పరిషత్‌లో నామినేట్ అయిన సభ్యుల సంఖ్య 15.
- రాజ్యాంగ పరిషత్ కార్యదర్శి- హెచ్.బి.అయ్యంగార్

రాజ్యాంగ పరిషత్ మొదటి సమావేశం

- రాజ్యాంగ పరిషత్ మొదటి సమావేశం 1946 డిసెంబరు 9న ఢిల్లీలో జరిగింది.
- మొదటి సమావేశానికి 211 మంది హాజరయ్యారు. ఈ సమావేశం డిసెంబరు 12 వరకు కొనసాగింది. డిసెంబరు 9న రాజ్యాంగ పరిషత్‌లో సీనియర్ సభ్యుడైన సచ్చిదానంద సిన్హాను తాత్కాలిక అధ్యక్షునిగా, ఫ్రాంక్ ఆంథోనిని ఉపాధ్యక్షునిగా నియమించారు.

రాజ్యాంగ పరిషత్



ఇండియన్ పాలిటీ

- డిసెంబరు 11న రాజేంద్రప్రసాద్ రాజ్యాంగ పరిషత్ శాశ్వత అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- హెచ్‌సి.ముఖర్జీ, టి.టి.కృష్ణమాచారిని రాజ్యాంగ పరిషత్ ఉపాధ్యక్షులుగా, బెనగళ్ నరసింగరావును రాజ్యాంగ పరిషత్ ముఖ్య సలహాదారుగా నియమించారు.
- 1946 డిసెంబరు 13న నెహ్రూ ఆశయాల తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ ఆశయాల తీర్మానమే రాజ్యాంగ తత్వానికి, ఆదర్శాలకు, లక్ష్యాలకు మూలం. ఇది ప్రవేశికకు ఆధారం కూడా. ఆశయాల తీర్మానాన్ని రాజ్యాంగ పరిషత్ 1947 జనవరి 22న ఏకగ్రీవంగా ఆమోదించింది. రాజ్యాంగ పరిషత్‌లో వివిధ అంశాల పరిశీలనకు 22 కమిటీలను ఏర్పాటుచేశారు. దీనిలో 12 విషయ కమిటీలు, 10 ప్రక్రియ కమిటీలు అలాగే వీటికి అనుబంధంగా ఏడు ఉప కమిటీలు, 15 మైనర్ కమిటీలను కూడా నియమించారు. ఈ కమిటీల్లో అత్యంత ముఖ్యమైన కమిటీ డ్రాఫ్టింగ్ కమిటీ (ముసాయిదా కమిటీ). 1947 ఆగస్టు 29న బి.ఆర్.అంబేద్కర్ అధ్యక్షతన ఆరుగురు సభ్యులతో ముసాయిదా కమిటీని నియమించారు.

ముసాయిదా కమిటీ

1. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ - చైర్మన్
2. ఎస్.గోపాలస్వామి అయ్యంగార్ - సభ్యుడు
3. కె.ఎం.మున్షీ - సభ్యుడు
4. అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ - సభ్యుడు
5. సయ్యద్ మహమ్మద్ సాదుల్లా - సభ్యుడు
6. ఎన్.మాధవరావు - సభ్యుడు(బి.ఎల్.మిత్తల్ అనారోగ్యం కారణంగా ఎన్నికయ్యారు).
7. టి.టి.కృష్ణమాచారి - సభ్యుడు(డి.పి.ఖైతాన్ మరణించడంతో ఆ స్థానంలో వచ్చారు).



వి.చైతన్యదేవ్,
పోటీ పరీక్షల నిపుణులు

భారతదేశంలోనే ఉన్నత ఉద్యోగాలైన ఐఏఎస్, ఐపీఎస్ తదితర కీలక సర్వీసులకి సంబంధించి 1056 పోస్టులకుగాను సివిల్ సర్వీసెస్ నోటిఫికేషన్‌ను యూపీఎస్సీ విడుదల చేసింది. నిర్ణీత వయోపరిమితి, బ్యాచిలర్స్ డిగ్రీ ఉన్న అభ్యర్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. జనరల్ అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితి 32 సంవత్సరాలు. ఆరుసార్లు ఈ పరీక్ష రాయవచ్చు. రిజర్వుడు వర్గాలకు వయస్సు, అటెంప్టుల విషయంలో నిబంధనల మేరకు సడలింపు ఉంటుంది.

సివిల్స్ ప్రిలిమ్స్ ప్రిపరేషన్

తొలి మెట్టు నుంచే పట్టు సాధించాలి

సివిల్ సర్వీసెస్ పరీక్షను మూడు అంచెలలో నిర్వహిస్తారు. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్స్, ఇంటర్వ్యూ అనే మూడు దశల ద్వారా నిర్వహణ ప్రక్రియ ఉంటుంది. ప్రిలిమినరీ పరీక్ష ఈ ఏడాది మే 26న నిర్వహిస్తున్నారు.

మెయిన్స్‌కు నిగ్గుతేల్చే పరీక్ష

ప్రిలిమినరీ(ప్రాథమిక) పరీక్షను అర్హత పరీక్షగానే పరిగణించాలి. ఈ మార్కులను మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు మాత్రమే పరగణనలోకి తీసుకుంటారు. ఇది ఆబ్జెక్టివ్ రూపంలో నిర్వహించే పరీక్ష. ప్రిలిమినరీ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కొక్క పేపరు 200 మార్కులకి ఉంటుంది. ఇందులో నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది. అందువల్ల విద్యార్థి జాగ్రత్తగా వ్యవహరించాలి. మొదటి పేపర్ జనరల్ స్టడీస్‌కి సంబంధించింది. దీనిలో 100 ప్రశ్నలకు 200 మార్కులు ఉంటాయి. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా మెయిన్స్ పరీక్షకి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

జనరల్ స్టడీస్

ప్రధానంగా భారతదేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, భారతదేశ - ప్రపంచ భౌగోళిక శాస్త్ర అంశాలు; పాలిటీలో భారత రాజ్యాంగం, పరిపాలన, పంచాయతీ రాజ్ వ్యవస్థ; ఎకానమీలో సుస్థిరాభివృద్ధి, పేదరికం, బడ్జెట్, ద్రవ్య విధానం - కోశ విధానం; సైన్స్ అండ్ టెక్నాలజీలో స్పేస్ టెక్నాలజీ, ఐటీ, రోబోటిక్స్, డిఫెన్స్, కమ్యూనికేషన్స్‌కు తోడు వర్తమాన అభివృద్ధి; పర్యావరణంలో సంబంధిత అంశాలు, జనరల్ సైన్స్ అలాగే వర్తమాన జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ప్రశ్నలు ఉంటాయి.

గత సంవత్సరం(2023) పరీక్ష పేపరును పరిశీలిస్తే సబ్జెక్టుల వారీగా మార్కులు ఇలా ఉన్నాయి.

- చరిత్ర(14)
- జాగ్రఫీ(16)
- పాలిటీ(15)
- ఎకానమీ(14)
- పర్యావరణం(14)
- కరెంట్ అఫైర్స్(15)
- సైన్స్ అండ్ టెక్నాలజీ(12)


చరిత్ర

చరిత్రకు సంబంధించి 2012 నుంచి 2023 వరకు ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే అత్యల్పంగా 2017, 2023లలో 14; అత్యధికంగా 2014లో 22 ప్రశ్నలు వచ్చాయి. చరిత్రలో ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక భారతదేశ చరిత్రతోపాటు కళలు - సంస్కృతి(ఆర్ట్ అండ్ కల్చర్)కి సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. చరిత్ర విషయంలో ప్రాథమిక అంశాలు బాగా చదవాలి. 75 వసంతాల భారతదేశంలో 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'పై తప్పనిసరిగా ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ప్రాచీన భారత చరిత్ర విషయానికి వస్తే ముఖ్యంగా ఇటీవలి కాలంలో సింధు నాగరికతకి సంబంధించిన కట్టడాలు తవ్వకాలలో బయటపడ్డాయి. దీనికి సంబంధించి ప్రశ్న వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత తవ్వకాలలో బయల్పడిన కట్టడం గురించి అయినా అడగవచ్చు లేదా సింధు నాగరికత పట్టణాలకి సంబంధించి ఏ అంశం అయినా అడగవచ్చు. అందువల్ల ఈ విషయంలో పూర్తిగా చదివితే పరీక్షలో సులభంగా సమాధానాన్ని గుర్తించవచ్చు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, దయానంద సరస్వతి వంటి ప్రముఖులపై ఇటీవలి కాలంలో దిన పత్రికలలో వార్తలు బాగా వస్తున్నాయి. వీరిపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది.

చరిత్ర కోసం 6, 7, 8, 12వ తరగతి నూతన ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలతోపాటు ప్రాచీన భారతదేశ చరిత్ర(ఆర్.ఎస్.శర్మ), మధ్యయుగ భారతదేశ చరిత్ర(సతీష్ చంద్ర), ఆధునిక భారతదేశ చరిత్ర(బిపిన్ చంద్ర), స్వాతంత్ర్యోద్యమ చరిత్ర(బిపిన్ చంద్ర) పుస్తకాలు చదివితే సబ్జెక్టుపై సమగ్ర అవగాహన వస్తుంది. ఇవి చదివితే 60 నుంచి 70 శాతం మార్కులు సాధించినట్లే. వీటితోపాటు టాటా మెగ్రాహిల్, స్పెక్ట్రమ్, సివిల్ సర్వీసెస్ క్రానికల్ వంటి సంస్థలకి సంబంధించి ఏదైనా ఒక స్టాండర్డ్ పుస్తకాన్ని ఆసాంతం చదివితే సరిపోతుంది.

2023లో చరిత్ర నుంచి అడిగిన ప్రశ్నలు (ఉదాహరణకు):

- మహాసాంఘిక ఆధ్వర్యంలో, ప్రముఖ బౌద్ధ కేంద్రంగా విలసిల్లిన ధాన్యకటకం కింది ప్రాంతాల్లో ఎక్కడ ఉంది?
  - ఎ) ఆంధ్ర
  - బి) గాంధార
  - సి) కళింగ
  - డి) మగధ
- ప్రాచీన దక్షిణ భారతదేశానికి సంబంధించి, కొర్కై, పూంపుహార్, ముచిరి అనేవి ఏ విధంగా ప్రసిద్ధి చెందాయి?
  - ఎ) రాజధాని నగరాలు
  - బి) ఓడరేవులు
  - సి) ఇనుము-ఉక్కు తయారీ కేంద్రాలు
  - డి) జైన తీర్థంకరుల పుణ్యక్షేత్రాలు



జాగ్రఫీ

దీనిలో అత్యల్పంగా 2016లో 7 ప్రశ్నలు రాగా, అత్యధికంగా 2013లో 18 ప్రశ్నలు వచ్చాయి. జాగ్రఫీలో భారతదేశ భౌగోళిక పరిస్థితులేగాక ప్రపంచ భౌగోళానికి సంబంధించిన అంశాలను చదవాలి. అయితే భౌతిక భౌగోళిక అంశాలపై ప్రధానంగా ప్రశ్నలు వస్తాయి. ఉదాహరణకి టోంగా అగ్నిపర్వతం గురించి ఇటీవల వార్తలు వచ్చాయి. టోంగా అగ్నిపర్వతం గురించి ప్రత్యేకంగా చదవాలి. అదే సమయంలో అగ్నిపర్వతం(ఓల్కనో) రకాలు, అవి ఏర్పడటానికి కారణాలు, ఎక్కడెక్కడ ఉన్నాయి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఇటీవలి కాలంలో తరచూ నదుల అనుసంధానం ప్రస్తావన వచ్చింది. కెన్-బెట్వా అనుసంధానం గురించి చదవాలి. అలాగే నదులు, వాటి ఉపనదులను మ్యాప్ సహాయంతో నేర్చుకోవాలి. ఫారెస్ట్ రిపోర్ట్ 2021 ప్రకారం అడవుల విస్తీర్ణం పెరిగింది. అడవుల రకాలు,

విస్తీర్ణం ఏ రాష్ట్రాలలో ఏవిధంగా ఉంది సమగ్రంగా చదవాలి. మడ అడవులను అధ్యయనం చేయాలి. ఇండియాకి సంబంధించి రామ్సర్ సైట్స్ 80కి చేరాయి. చిత్తడి నేలలు అంటే ఏమిటో, ఎక్కడెక్కడ ఉన్నాయో చదువుకోవాలి. ప్రతి సంవత్సరం ఏదైనా ఒక సముద్రం సరిహద్దులను పరీక్షలో ఇస్తున్నారు. ఈ సంవత్సరం నల్లసముద్రం, ఎర్రసముద్రం తరచూ వార్తల్లో నిలిచాయి. వాటి చుట్టుపక్కల ప్రాంతాలు, జలసంధులపై ప్రశ్నలు అడగవచ్చు. వార్తల్లో నిలిచిన వివాదాస్పద ప్రాంతాలు పాలస్తీనా - ఇజ్రాయెల్; నగోర్నో కారాబాగ్, హెల్మండ్ నది వివాదం వంటివి పరిశీలించండి. వివిధ దేశాల సరిహద్దులు, సమగ్ర సరిహద్దులు మ్యాప్ పాయింటింగ్ ద్వారా చదువుకోవాలి. జాగ్రఫీకి సంబంధించి 6-12 ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్ బాగా చదివితే సరిపోతుంది. వీటితోపాటు ఏదైనా ఒక స్టాండర్డ్ బుక్ చదివితే మంచిది.

కటాఫ్

2022 ప్రిలిమ్స్ పేపర్ కట్ ఆఫ్ మార్కులు పరిశీలిస్తే 200 మార్కులకిగాను జనరల్ అభ్యర్థులు 88.22 మార్కులు, ఈడబ్ల్యుఎస్ -82.83, ఓబీసీ-87.54, ఎస్సీ-74.08, ఎస్టీ-69.35, దివ్యాంగుల కేటగిరి 1 - 49.84, కేటగిరి 2 - 58.59, కేటగిరి 3 - 40.40, కేటగిరి5 - 41.76 వచ్చాయి. ఈ మార్కులకి అటు ఇటుగా 5 మార్కులు అంచనా వేసుకుని ముందస్తు ప్రణాళిక చేసుకుంటే ఎవరికైనా మెయిన్స్‌కు మార్గం సుగమం అవుతుంది.

పాలిటీ

ఇందులో అంతర్జాతీయ అంశాలకు సంబంధించి అత్యల్పంగా 2016లో 7 ప్రశ్నలు, అత్యధికంగా 2017లో 22 ప్రశ్నలు వచ్చాయి. పాలిటీలో భారత రాజ్యాంగంలోని అంశాలకు వర్తమాన విషయాలు జోడించి చదవాలి. ఉదాహరణకు దేశంలో గవర్నర్ వ్యవస్థ వివాదాస్పదం అవుతోంది కాబట్టి దానిపై ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నిక, కొలీజియం వ్యవస్థ, కేంద్ర ఎన్నికల సంఘం-కమిషనర్ల నియామకం- సుప్రీం కోర్టు తీర్పు, ఎన్నికల సంస్కరణలు, ఎలక్టోరల్ బాండ్స్ - సుప్రీం తీర్పు, ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్స్ - సుప్రీం కోర్టు తీర్పు, భారత రాజ్యాంగం, దానిలోని మౌలికాంశాలు, కేశవానంద భారతి కేసు వంటి వాటితోపాటు, రాజ్యాంగంలోని అంశాలు ఎక్కడ నుంచి తీసుకున్నారు వంటి అంశాలు చదవాలి. పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బిల్లుల గురించి చదవాలి. సుప్రీంకోర్టు, హైకోర్టులు ఇచ్చిన వివిధ ముఖ్యమైన తీర్పులు చదవాలి. వివిధ కమిటీల రిపోర్టులు చదవాలి. 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, మహిళ వివాహ వయస్సుకి సంబంధించిన అంశాలతోపాటు వారికి సంబంధించిన హక్కులు చదవాలి. ఓబీసీ జాబితాకి చేసిన రాజ్యాంగ సవరణ బిల్లుతోపాటు ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన రాజ్యాంగ ఆర్టికల్స్, వారికి సంబంధించిన కమిషన్ల గురించి చదవాలి.



సిశాట్

ప్రిలిమ్స్‌లో రెండో పేపర్ సిశాట్ 200 మార్కులకిగాను 80 ప్రశ్నలతో నిర్వహిస్తారు. ఈ పేపర్ క్వాలిఫైయింగ్ పేపర్ మాత్రమే. ఈ పేపర్‌లో 33 శాతం మార్కులు సాధించాలి.

ఈ పేపర్‌లో సాధారణ న్యూమరసీ, అర్థమెటిక్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, గ్రాఫ్స్, టేబుల్స్‌కి సంబంధించి పదో తరగతి పరిజ్ఞానం సరిపోతుంది. ఇంగ్లిష్ ప్యాసేజ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి.

రీజనింగ్, అర్థమెటిక్‌కు సంబంధించి చాంద్ బుక్స్ లేదా, అరిహంట్ బుక్స్ గానీ చదవాలి. ఇంగ్లిష్ పాసేజ్‌కి సంబంధించి టాటా మెగ్రాహిల్ లేదా అరిహంట్ లేదా పియర్సన్ బుక్స్ చదవాలి.

ప్రిలిమినరీ పరీక్షకి చదువుతూనే మెయిన్స్ సంబంధించి కూడా చరిత్ర, భౌగోళికశాస్త్రం, ఎకానమీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ, పాలిటీలను అనుసంధానం చేసుకుంటూ వెళ్లాలి. తద్వారా మెయిన్స్‌కి ప్రిలిమ్స్ తరవాత చదవడం కూడా సులభతరమవుతుంది.

2023లో పాలిటీలో అడిగిన ప్రశ్నలు (ఉదాహరణకు)

- 'డ్యూ ప్రాసెస్ ఆఫ్ లా' అంటే ఏమిటి?
  - ఎ) సహజ న్యాయ సూత్రం
  - బి) చట్టం ద్వారా ఏర్పాటు చేసిన విధానం
  - సి) న్యాయమైన చట్టం దరఖాస్తు
  - డి) చట్టం ముందు సమానత్వం
- కింది వాటిలో ఏది దేశ రాజ్యాంగం ముఖ్య ఉద్దేశాన్ని ప్రతిబింబిస్తుంది?
  - ఎ) అవసరమైన చట్టాలను రూపొందించడానికి ఇది లక్ష్యాన్ని నిర్ణయిస్తుంది.
  - బి) ఇది రాజకీయ కార్యాలయాలు, ప్రభుత్వాన్ని సృష్టించడానికి వీలు కల్పిస్తుంది.
  - సి) ఇది ప్రభుత్వ అధికారాలను నిర్వచిస్తుంది, పరిమితం చేస్తుంది.
  - డి) ఇది సామాజిక న్యాయం, సామాజిక సమానత్వం, సామాజిక భద్రతను కల్పిస్తుంది.

పాలిటీ విషయంలో ఎన్‌సీఈఆర్‌టీ ప్రచురించిన ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ ఎట్ వర్క్ అనే 11వ తరగతి పుస్తకం చదవాలి. ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ పుస్తకంతోపాటు లక్ష్మీకాంత్ ఇండియన్ పాలిటీ లాంటి స్టాండర్డ్ బుక్ ఏదైనా ఒకటి చదవాలి. పాలిటీ చదివేటప్పుడు ముఖ్యంగా వర్తమాన అంశాలు కలుపుకొని బాగా చదవాలి. రాజ్యాంగ ప్రకరణలపై అవగాహన రావాలి.

జనరల్ సైన్స్

శాస్త్ర సాంకేతికతకి సంబంధించి 2019లో 7 అత్యల్పంగా, 2014లో అత్యధికంగా 16 ప్రశ్నలు వచ్చాయి. జనరల్ సైన్స్‌లో వ్యాధులు, విటమిన్‌లు, వృక్ష, జంతువులకి చెందిన సాధారణ అంశాలు ముఖ్యం. సైన్స్ అండ్ టెక్నాలజీలో కమ్యూనికేషన్స్, స్పేస్, ఐటీ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, డిఫెన్స్ వంటి అంశాల్లో నూతన ఆవిష్కరణలు, సమకాలీన డెవలప్‌మెంట్స్ పైన ప్రశ్నలు అధికంగా వస్తాయి. ఇటీవలి కాలంలో భారతదేశంతోపాటు ఇతర దేశాల అంతరిక్ష ప్రయోగాల గురించి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఈసారి చంద్రయాన్-3, ఆదిత్య ఎల్1 ప్రయోగం తదితరాలపై కచ్చితంగా చదవాలి. వార్తల్లో నిలిచిన వ్యాధులు - సంక్రమణ, నివారణ చర్యల గురించి చదవాలి.

(మిగతా రేపటి దిక్సూచిలో)




ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

మిస్సింగ్ నంబర్ టెస్ట్

ఈ మిస్సింగ్ నెంబర్ టెస్ట్‌కి సంబంధించిన ప్రతి ప్రశ్న ఒక లాజిక్‌ను అనుసరించి ఉంటుంది. కూడిక, తీసివేత, గుణకారం, భాగాహారం, వర్గం(స్క్వేర్స్), ఘనం (క్యూబ్) వర్ణమాల అక్షరాల సవ్య, అపసవ్యదిశలు మొదలైన వివిధ అంశాలపై ఈ లాజిక్ ఆధారపడి ఉంటుంది. ఆ లాజిక్‌ను అవగాహన చేసుకోవాలంటే ఎక్కువ ప్రశ్నలు సాధన (ప్రాక్టీస్) చేయాల్సిన అవసరం ఉంది.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నలు బాక్సుల రూపంలో గాని, వివిధ రకాల రేఖాచిత్రాలుగా గాని ఉంటాయి. అవి కొన్ని విడిభాగాలుగా విభజించి ఉంటాయి. ఒక భాగం మినహా మిగిలిన అన్ని భాగాలలో ఒక సక్రమమైన పద్ధతిని అనుసరించే సంఖ్యలను లేదా వర్ణమాల అక్షరాలను ఇస్తారు. ఖాళీగా ఉన్న భాగంలో ప్రశ్నార్థకం ఉంటుంది. రేఖాచిత్రంలో గల సంఖ్యలు లేదా వర్ణమాల అక్షరాలు కచ్చితంగా ఒక నిర్దిష్టమైన నియమా(లాజిక్)న్ని అనుసరిస్తుంది. ఈ సంఖ్యలు లేదా వర్ణమాల అక్షరాలను అభ్యర్థి జాగ్రత్తగా విశ్లేషించుకొని, అవగాహన చేసుకొని ప్రశ్నార్థకం గల ప్రదేశంలో ఏ సంఖ్య లేదా వర్ణమాల అక్షరం సరైనదో దానిని సమాధానాలుగా ఇచ్చిన ఎ, బి, సి, డి ల నుంచి గుర్తించాలి.

1. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 364 బి) 392 సి) 599 డి) 485


సమాధానం: (సి)

వివరణ: వృత్తంపైన గల అంకెలను, వృత్తం కింది భాగంలో గల అంకెలను కూడగా వృత్తం లోపలి సంఖ్య వస్తుంది.

345+562=907, 285+329=614

కావున 356+243=599 సమాధానం అవుతుంది.

2. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 38 బి) 26 సి) 52 డి) 40

సమాధానం: (డి)

వివరణ: ప్రతి డయాగ్రమ్‌లో పైన గల అంకెలలో ఎడమవైపు అంకె వర్గం నుంచి కుడివైపు అంకె వర్గాన్ని తీసివేస్తే కింది భాగంలోని సంఖ్య వస్తుంది

$9^2 - 4^2 = 81 - 16 = 65$

$8^2 - 5^2 = 64 - 25 = 39$ కావున

$7^2 - 3^2 = 49 - 9 = 40$ సమాధానం అవుతుంది.

3. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?

13	16	14
18	10	15
17	?	11

ఎ) 18 బి) 12 సి) 15 డి) 21

సమాధానం: (సి)

వివరణ: పై డయాగ్రమ్‌లో అడ్డువరుసల్లోని అంకెలను కూడగా మూడు వరుసల్లోని అంకెల మొత్తం సమానంగా ఉండాలి. 13+16+14=43, 18+10+15=43.17+ 15 +11=43

కావున 15 సమాధానం అవుతుంది.

4. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?

9	84	3
5	31	6
8	?	4

ఎ) 68 బి) 72 సి) 56 డి) 45

సమాధానం: (ఎ)

వివరణ: పై డయాగ్రమ్‌లో అడ్డువరుసలో మొదటి సంఖ్య వర్గానికి ఆ వరుసలోని చివరి అంకెను కూడితే మధ్యలోని సంఖ్య వస్తుంది.

$9^2 + 3 = 81 + 3 = 84$, $5^2 + 6 = 25 + 6 = 31$

కావున $8^2 + 4 = 64 + 4 = 68$ సమాధానమవుతుంది.

5. కింద ఇచ్చిన రేఖాచిత్రంలో ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?

6	4	52
5	3	34
8	1	?

ఎ) 65 బి) 72 సి) 56 డి) 80


సమాధానం: (ఎ)

వివరణ: మొదటి వరుస $6^2 + 4^2 = 36 + 16 = 52$


రెండో వరుస $5^2 + 3^2 = 25 + 9 = 34$

కావున మూడో వరుస $8^2 + 1^2 = 64 + 1 = 65$ సమాధానం అవుతుంది.

టీఎస్‌పీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం



6. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 44 బి) 37 సి) 63 డి) 46

సమాధానం: (బి)

వివరణ: ప్రతి బాక్సులోను ఎడమవైపు పై సంఖ్య, కింది వైపు కుడిసంఖ్య గుణించడం, ఎడమవైపు కింది, కుడివైపు పై సంఖ్యలను గుణించి ఆ రెంటిని కూడగా మధ్యలో సంఖ్య వస్తుంది.


$6 \times 4 = 24$ $8 \times 5 = 40$ $9 \times 3 = 27$

$3 \times 2 = 6$ $4 \times 7 = 28$ కావున $2 \times 5 = 10$

$24 + 6 = 30$ $40 + 28 = 68$ $27 + 10 = 37$

సమాధానం అవుతుంది.

7. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 18 బి) 22 సి) 26 డి) 20

సమాధానం: (డి)


వివరణ: P అంటే 16వ అక్షరం. F అంటే 6వ అక్షరం =16+6=22

E అంటే 5వ అక్షరం. T అంటే 20వ అక్షరం=5+20=25

M అంటే 13వ అక్షరం. J అంటే 10వ అక్షరం=13+10=23

కావున L అంటే 12వ అక్షరం. Hఅంటే 8వ అక్షరం = 12+8=20 సమాధానం అవుతుంది.

8. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 46 బి) 32 సి) 35 డి) 40


సమాధానం: (సి)

వివరణ: త్రిభుజానికి మూడువైపుల గల సంఖ్యలను గుణిస్తే త్రిభుజంలోని సంఖ్య వస్తుంది

$4 \times 6 \times 3 = 72$ $8 \times 4 \times 2 = 64$ కావున

$7 \times 5 \times 1 = 35$ సమాధానం అవుతుంది.

9. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 48 బి) 42 సి) 54 డి) 60


సమాధానం: (బి)

వివరణ: పై వృత్తంలోని పెద్ద సంఖ్యలైన 30, 40, 56 అనేవి ఆ సంఖ్యలకు ఇరువైపున గల అంకెల లబ్ధం.

$6 \times 5 = 30$, $5 \times 8 = 40$, $8 \times 7 = 56$ కావున

$7 \times 6 = 42$ సమాధానం అవుతుంది.

10. ప్రశ్నార్థకం గుర్తుస్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 118 బి) 106 సి) 120 డి) 119

సమాధానం: (డి)

వివరణ: వృత్తానికి నాలుగు వైపుల గల అంకెల వర్గాలను కూడిన వృత్తంలోని సంఖ్య వస్తుంది

$6^2 + 8^2 + 2^2 + 1^2 = 36 + 64 + 4 + 1 = 105$

$7^2 + 6^2 + 5^2 + 4^2 = 49 + 36 + 25 + 16 = 126$

కావున $9^2 + 5^2 + 3^2 + 2^2 = 81 + 25 + 9 + 4 = 119$ సమాధానం అవుతుంది.

11. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?


R	K	T	P	L	F
9	16	7	11	?	21

ఎ) 10 బి) 15 సి) 12 డి) 18

సమాధానం: (బి)

వివరణ: ప్రతి అక్షరానికి కింద గల సంఖ్య వర్ణమాల అపసవ్యదిశ (రివర్స్) ప్రకారం ఆ అక్షరానికి సంబంధించిన సంఖ్య. వర్ణమాల అపసవ్యదిశ (రివర్స్) ప్రకారం L అంటే 15వ అక్షరం.

12. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 49 బి) 52 సి) 38 డి) 56

సమాధానం: (ఎ)

వివరణ: ప్రతి డయాగ్రమ్‌లో పై అంకెల లబ్దానికి కింది సంఖ్యను కూడితే మధ్యలోని సంఖ్య వస్తుంది

8 x 4+5=37, 6 x 7+3=45 కావున 5 x 9+4=49 సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

గ్రూప్ దశలో చైనా గోడ బద్దలు.. క్వార్టర్స్‌లో హాంకాంగ్ చిత్తు.. సెమీస్‌లో పటిష్ఠ జపాన్‌కు ఝలక్.. ఫైనల్లో జెయింట్‌కిల్లర్ థాయ్‌లాండ్‌కు షాక్.. ఇదీ ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో మనమ్మాయిల అద్భుత ప్రదర్శన గురించి క్లుప్తంగా. ప్రతి దశలోనూ ఎన్నోరెట్లు మెరుగైన ప్రత్యర్థి ఎదురైనా.. మన అమ్మాయిలు విజయమే లక్ష్యంగా ముందుకెళ్లారు.

సీనియర్లు సింధు, అశ్వినితో సమన్వయం చేసుకుంటూ యువ కెరటాలు అన్‌మోల్, అస్మిత, గాయత్రి, ట్రీసా జాలీ అసమాన ఆటతీరుతో విజృంభించారు. కాంస్యం దక్కినా చాలన్న దశను దాటుకొని ఏకంగా స్వర్ణంతో సరికొత్త చరిత్ర సృష్టించారు. ఫైనల్ చేరిన మొదటి ప్రయత్నంలోనే చాంపియన్‌షిప్‌ను దక్కించుకొని 'ఆసియా' రారాణులుగా నీరాజనాలందుకున్నారు.



'ఆసియా'ను కొల్లగొట్టారు

మనమ్మాయిల మరో చరిత్ర

స్వర్ణంతో సత్తా చాటిన భారత్

ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ టైటిల్ కైవసం

ఉత్కంఠ ఫైనల్లో థాయ్‌లాండ్‌పై గెలుపు

టీనేజర్ అన్‌మోల్ అద్భుత ప్రదర్శన



షా అలమ్ (మలేసియా): ఆసియా టీమ్ చాంపియన్‌షిప్ చరిత్రలో ఇప్పటిదాకా కనీసం సెమీఫైనల్ కూడా చేరలేకపోయిన భారత అమ్మాయిల జట్టు ఈసారి అమోఘమైన ప్రదర్శనతో ఏకంగా టైటిల్ కొల్లగొట్టారు. ఆదివారం అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు సారథ్యంలోని భారత బృందం 3-2తో రెండు సార్లు కాంస్య పతక విజేత థాయ్‌లాండ్ జట్టుపై విజయభేరి మోగించి తొలిసారి దేశానికి మొదటిసారి పసిడి పతకాన్ని అందించారు. జపాన్‌తో పోరులో సంచలన ఆటతీరుతో అలరించి జట్టును ఫైనల్‌కు చేర్చిన 17 ఏళ్ల అన్‌మోల్ కర్బ్ ఫైనల్లోనూ భారత్ విజయంలో కీలకపాత్ర పోషించింది. బ్యాడ్మింటన్‌లో రెండేళ్ల క్రితం ప్రతిష్ఠాత్మక థామస్‌కప్ నెగ్గిన భారత్‌కు ఆ తర్వాత ఇదే అతిపెద్ద గెలుపు కావడం విశేషం. ఇక 2016, 2020లో పురుషుల జట్టు కాంస్య పతకాలు నెగ్గడమే ఆసియా టీమ్ బ్యాడ్మింటన్‌లో ఇప్పటిదాకా భారత జట్ల అత్యుత్తమ ప్రదర్శన. తాజాగా సింధు బృందం ఆ రికార్డును అధిగవించి బంగారు పతకాన్ని అందుకోవడం చరిత్రాత్మకం.

నువ్వా..నేనా

సెమీస్ తరహాలోనే ఫైనల్ పోరు కూడా హోరాహోరీగా సాగింది. ప్రత్యర్థి థాయ్‌లాండ్ నుంచి గట్టిపోటీ ఎదురైనా ఒత్తిడిని అధిగమించి మన షట్లర్లు ఫలితాన్ని రాబట్టారు. జపాన్‌తో సెమీఫైనల్లో సింగిల్స్ పోరులో అనూహ్యంగా ఓటమిపాలైన సింధు ఈసారి మాత్రం ఎక్కడా తడబడలేదు. తొలి సింగిల్స్ బరిలో దిగిన సింధు 21-12, 21-12తో ప్రపంచ 17వ ర్యాంకర్ సుపనిద కాటేతాంగ్‌ను వరుసగేముల్లో ఓడించి భారత్‌కు శుభారంభాన్నిచ్చింది. ఆ తర్వాత తొలి డబుల్స్‌లో పోటీపడ్డ పుల్లెల గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ మూడుగేముల పాటు పోరాడి పైచేయి సాధించింది. ప్రపంచ 23వ ర్యాంకరైన గాయత్రి జంట 21-16, 18-21, 21-16తో 10వ ర్యాంక్ ద్వయం జాంగ్‌కోల్ఫాన్ కితితరకుల్-రవిందా ప్రజోంగ్జాయ్‌పై గెలిచి 2-0 ఆధిక్యాన్ని అందించింది. అయితే, సెమీస్ పోరులో ప్రపంచ మాజీ విజేత నొజొమి ఒకుహరాకు షాకిచ్చి సంచలనం సృష్టించిన అస్మిత చాలిహా ఈసారి ఆస్థాయి ప్రదర్శన చేయలేకపోయింది. రెండో సింగిల్స్‌లో అస్మిత 11-21, 14-21తో 18వ ర్యాంకర్ బుసానన్ ఓంగ్బారున్‌గాపాన్ చేతిలో ఓటమిపాలైంది. ఇక, ఏమాత్రం అనుభవం లేని భారత యువ జంట శ్రుతి మిశ్రా-ప్రియ రెండో డబుల్స్ మ్యాచ్‌లో 11-21, 9-21తో 13వ ర్యాంకర్ జోడీ బెన్యాపా అమ్‌సార్డ్-నున్‌తాకర్న్ అమ్‌సార్డ్‌కు తలొగ్గింది. దీంతో ఇరుజట్లు 2-2తో సమంగా నిలిచాయి. సెమీస్ తరహాలోనే మరోసారి తీవ్ర ఒత్తిడి మధ్య నిర్ణాయక మూడో సింగిల్స్‌లో తలపడ్డ అన్‌మోల్ అమోఘమైన పోరాటాన్ని ప్రదర్శించింది. తనపై ఉన్న అంచనాలను నిలబెడుతూ అన్‌మోల్ 21-14, 21-9తో ప్రపంచ 45వ ర్యాంకర్ పోర్న్‌పిచా చోకీవాంగ్‌ను వరుసగేముల్లో చిత్తుచేసి భారత్‌కు 3-2తో చరిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టింది.

భవితపై ఆశలు రేకెత్తించిన విజయం

ఇది అద్భుత ప్రదర్శన. జట్టులోని క్రీడాకారిణులంతా సమష్టిగా పోరాడారు. టోర్నీలో చైనా, జపాన్, థాయ్‌లాండ్ లాంటి టాప్ జట్లను ఓడించడమంటే సాధారణ విషయం కాదు. సీనియర్లు సింధు, అశ్విని, జూనియర్లు గాయత్రి, ట్రీసా జాలీ, అన్‌మోల్, అస్మిత అమోఘమైన ఆటతీరు కనబరిచారు. ఇప్పుడు మన జట్టులో బలమైన సింగిల్స్, డబుల్స్ షట్లర్లు ఉన్నారు. వచ్చే ఏప్రిల్‌లో జరిగే ఉబెర్ కప్‌లో సత్తా చాటేందుకు ఈ విజయం మరింత ఉత్సాహాన్నిస్తుంది.

- జాతీయ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్

మన ప్రతిభకు తార్కాణం

ఈ విజయం మనందరికీ గర్వకారణం. ప్రపంచ బ్యాడ్మింటన్‌లో మన ప్రతిభ ఏస్థాయిలో ఉందనేందుకు ఇదే నిదర్శనం. సీనియర్లు, జూనియర్ల మేళవింపుతో కూడిన ఈ జట్టు భవిష్యత్‌లో మరిన్ని పతకాలు కొల్లగొడుతుందన్న విశ్వాసం ఉంది.


- భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్)

పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వేళ.. ఈ టెస్టు అయినా ఐదు రోజుల వరకు సాగుతుందని అంచనా వేశారు. కానీ భారత బౌలర్ల పరాక్రమం ముందు ప్రత్యర్థి ఇంగ్లండ్ బేలగా మారింది. యశస్వీ రెండో డబుల్ సెంచరీ, గిల్ అద్భుత ఇన్నింగ్స్, సర్ఫరాజ్ దూకుడుతో టీమిండియాకు ఏకంగా 557 రన్స్ ఆధిక్యం దక్కింది. ఇక ఈ కష్టసాధ్య ఛేదనలో స్టోక్స్ సేన బజ్‌బాల్ గేమ్ మచ్చుకు కూడా కానరాలేదు. 'రాజ్‌కోట్ రాజా' జడేజా తన మాయాజాలంతో ఉచ్చు బిగించగా, బ్యాటర్లంతా కనీసం ఓ సెషన్ పాటు క్రీజులో నిలిచేందుకే ఆపసోపాలు పడ్డారు. ఫలితంగా భారత్ ఖాతాలో అతి పెద్ద విజయంతో పాటు సిరీస్‌లో పైచేయి సాధించింది.

రాజ్‌కోటలో రాజసంగా..

భారత్ రికార్డు విజయం

- 434 రన్స్ తేడాతో ఇంగ్లండ్ చిత్తు
- భారత్ రెండో ఇన్నింగ్స్ 430/4 డిక్లేర్
- యశస్వీ మరో డబుల్
- గిల్ శతకం మిస్
- ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 122 ఆలౌట్
- జడేజాకు ఐదు వికెట్లు



యశస్వీ జైస్వాల్ (241 నాటౌట్)

జడేజా (12.4-4-41-5)

1 కెరీర్‌లో తొలి మూడు టెస్టు సెంచరీలను 150+ స్కోర్లుగా మలిచిన భారత బ్యాటర్‌గా జైస్వాల్. ఓవరాల్‌గా ఏడో బ్యాటర్. అలాగే ఓ సిరీస్‌లో ఎక్కువ పరుగులు సాధించిన భారత లెఫ్టహ్యాండర్‌గా నిలిచాడు.

ఒకే ఇన్నింగ్స్‌లో ఎక్కువ సిక్సర్లు (12) బాదిన బ్యాటర్‌గా వసీం అక్రమ్‌తో కలిసి టాప్‌లో ఉన్న జైస్వాల్. అలాగే ఓ సిరీస్‌లో ఎక్కువ సిక్సర్లు (22) బాదిన ఆటగాడు.

రాజ్‌కోట్: రికార్డులను బద్దలుకొడుతూ టీమిండియా మూడో టెస్టులో అద్భుత విజయాన్ని నమోదుచేసింది. నాలుగో రోజే ముగిసిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై ఏకంగా 432 పరుగుల తేడాతో రోహిత్ సేన సూపర్ విక్టరీని అందుకుంది. తమ టెస్టు చరిత్రలో పరుగుల పరంగా ఇదే అతి పెద్ద గెలుపు కావడం విశేషం. దీంతో ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలో నిలిచింది. నాలుగో టెస్టు ఈనెల 23 నుంచి జరగనుంది. ఆదివారం ఆటలో ఆద్యంతం భారత్‌దే హవా. యశస్వీ జైస్వాల్ (241 నాటౌట్) అజేయ డబుల్ సెంచరీతో చెలరేగాడు. అటు గిల్ (91) కొద్దిలో శతకాన్ని కోల్పోగా, సర్ఫరాజ్ (68 నాటౌట్) తన సత్తాను మరోసారి చాటాడు. వీరి ఆటతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 430/4 పరుగుల వద్ద డిక్లేర్ చేయగా, అప్పటికే 556 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. ఇక ఛేదనలో ఇంగ్లండ్ 39.4 ఓవర్లలో 122 పరుగులకే తమ రెండో ఇన్నింగ్స్‌ను ముగించి ఓటమి పాలైంది. పదో నెంబర్ బ్యాటర్ ఉడ్ (33) టాప్ స్కోరర్‌గా నిలవడం గమనార్హం. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ జడేజాకు ఐదు, కుల్దీప్‌కు రెండు వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 445, ఇంగ్లండ్ 319 పరుగులు సాధించాయి.

జైస్వాల్, సర్ఫరాజ్ అలవోకగా..: ఓవర్‌నైట్ స్కోరు 196/2 తో రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన భారత్‌ను ఇంగ్లండ్ బౌలర్లు ఏ దశలోనూ ఇబ్బంది పెట్టలేకపోయారు. ముంబై కుర్రాళ్లు యశస్వీ, సర్ఫరాజ్ వారిని చెడుగుడు ఆడేశారు. లంచ్ బ్రేక్‌కల్లా జట్టు 440 పరుగుల తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. తొలి గంటపాటు గిల్, కుల్దీప్ (27) తమ వికెట్‌ను కాపాడుకుంటూ ప్రత్యర్థిని విసిగించారు. అయితే నాలుగో వికెట్‌కు 55 రన్స్ జోడించాక రనౌట్‌తో గిల్ సెంచరీని కోల్పోయాడు. కుల్దీప్ సింగిల్ కోసం పిలుపునిచ్చి ఆగిపోగా, అటు తిరిగి వెనక్కి వెళ్లే క్రమంలో స్టోక్స్ త్రోతో గిల్ పెవిలియన్‌కు చేరాడు. లంచ్ బ్రేక్‌కు ముందు కుల్దీప్‌ను రెహాన్ అవుట్ చేశాడు. ఇక మూడో రోజు ఆటలో 104 పరుగుల దగ్గర ఆగిన జైస్వాల్ ఆదివారం అదే ఊపును కొనసాగించాడు. టీ సెషన్‌లో సర్ఫరాజ్‌తో కలిసి ఇంగ్లండ్‌పై దాడికి దిగాడు. ఓవర్‌కు ఏడు పరుగుల రన్‌రేట్‌తో స్కోరుబోర్డు కదలడంతో పరుగుల వరద పారింది. ఆదిలోనే పేసర్ అండర్సన్ ఓవర్‌లో జైస్వాల్ వరుసగా మూడు సిక్సర్లు బాదడం హైలైట్‌గా నిలిచింది. అండర్సన్ సుదీర్ఘ కెరీర్‌లో ఇలా జరగడం కేవలం రెండోసారి మాత్రమే. అటు సర్ఫరాజ్ సైతం వరుస ఫోర్లతో తన సహకారం అందిస్తూనే రెండో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఇక రూట్ ఓవర్‌లో ద్విశతకం పూర్తి చేసిన వెంటనే యశస్వీ రెండు భారీ సిక్సర్లు బాదాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో సర్ఫరాజ్ వరుసగా 6,4,6తో అదరగొట్టాడు. వీరి మధ్య ఐదో వికెట్‌కు అజేయంగా 172 పరుగులు సమకూరాయి.

పేకమేడలా..: కొండంత లక్ష్యంతో రెండో సెషన్ ఆఖర్లో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ పసికూన మాదిరి ఆడింది. గతంలో పాక్‌పై ఒక్క రోజులోనే 500కు పైగా పరుగులు చేసిన ఈ జట్టు కనీసం ఐదో రోజుకు మ్యాచ్‌ను తీసుకెళ్లలేకపోయింది. అదేంటో.. భారత బ్యాటింగ్‌కు అద్భుతంగా సహకరించిన పిచ్ వీరిని మాత్రం తెగ భయపెట్టింది. డిఫెన్స్ ఆడేందుకే కష్టపడుతూ.. తొలి రెండు ఓవర్లను మెయిడిన్‌గా మొదలెట్టి ఆరు ఓవర్లలో 15 రన్స్ మాత్రమే చేసింది. ఇక లేని పరుగు కోసం ముందుకువెళ్లిన ఓపెనర్ డకెట్ (4), కీపర్ జురెల్ అద్భుత రనౌట్‌తో వెనుదిరిగాడు. కాసేపటికే క్రాలే (11) అవుట్‌తో టీ బ్రేక్‌కు వెళ్లిన ఇంగ్లండ్.. చివరి సెషన్‌లో మిగిలిన ఎనిమిది వికెట్లను టపటపా కోల్పోయింది. జడేజా వరుస ఓవర్లలో పోప్ (3), బెయిర్‌స్టో (4) పనిబట్టడంతో పాటు స్వల్ప వ్యవధిలోనే రూట్ (7)ను అవుట్ చేయడంతో ఇంగ్లండ్ ఓటమి కళ్లముందు కనిపించింది. మరోవైపు కెప్టెన్ స్టోక్స్ (15), రెహాన్ (0)లను కుల్దీప్ వరుస ఓవర్లలో అవుట్ చేయడంతో 50/7 స్కోరుతో ఇంగ్లండ్ మరిక కోలుకోలేదు. 38వ ఓవర్‌లో ఉడ్ వరుసగా 4,4,4,6,4తో 23 పరుగులు సాధించి ఓటమి అంతరాన్ని కాస్త తగ్గించగలిగాడు. ఇక ఉడ్‌ను కూడా జడేజా ఐదో వికెట్‌గా అవుట్ చేయడంతో ఇంగ్లండ్ కథ కంచికి చేరింది.

పట్టుదలతో సత్తాచాటాలనుకొన్నా

టెస్టు క్రికెట్ ఎంతో కఠినం. కానీ, జట్టు కోసం పట్టుదలతో ఆడాలనుకొన్నా. క్రీజులో నిలదొక్కుకొన్న ప్రతిసారీ భారీ స్కోర్లు చేయడానికే శ్రమించా. ఆరంభంలో కొంత కష్టపడినా.. సెట్ అయిన తర్వాత సులువుగా బ్యాటింగ్ చేయగలిగా. నాలుగో రోజు మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చిన తర్వాత చివరి వరకు నిలవాలనుకొన్నా. పిచ్ నుంచి బౌలర్లకు ఎంతో కొంత మద్దతు లభిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో జట్టుకు శుభారంభం అందించడమే నా లక్ష్యంగా భావించా. తొలి ఇన్నింగ్స్‌లో రోహిత్, జడేజా శతకాల స్ఫూర్తితో డబుల్ సెంచరీ సాధించా.

- యశస్వీ జైస్వాల్

అశ్విన్ బరిలోకి..

శుక్రవారం ఆట ముగిశాక తల్లి అనారోగ్యంతో చెన్నైకి వెళ్లిన స్పిన్నర్ అశ్విన్ నాలుగో రోజు ఆఖరి సెషన్‌లో మైదానంలోకి దిగాడు. ఈ క్రమంలో ఎలాంటి పెనాల్టీ టైమ్ లేకుండానే ఆరు ఓవర్లు కూడా వేసి హార్ట్‌లీ వికెట్ తీశాడు. 'ఓ ప్లేయర్ సరైన కారణంతో మైదానం వీడి, తిరిగి ఫీల్డ్ అంపైర్ల అనుమతితో జట్టులోకి వచ్చాక పెనాల్టీ టైమ్ విధించాల్సిన అవసరం లేదు' అని ఐసీసీ రూల్ చెబుతోంది. మరోవైపు అశ్విన్ ప్రయాణానికి బీసీసీఐ చార్టర్ ఫ్లయిట్ ఏర్పాటు చేయడం విశేషం.

రావాలా? వద్దా?

భారత్ రెండో ఇన్నింగ్స్ డిక్లేర్ సమయంలో కాస్త అయోమయం చోటు చేసుకుంది. జైస్వాల్ డబుల్ సెంచరీ అయ్యాక ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేస్తారని అంతా భావించారు. దీనికి తగ్గట్టుగానే 97వ ఓవర్‌లో అతడు ఈ ఫీట్ పూర్తి చేశాడు. వెంటనే డ్రింక్స్ రాగా అటు డ్రెస్సింగ్ రూమ్‌లో భారత ఆటగాళ్లంతా మైదానంలోకి వచ్చేందుకు సిద్ధమవుతూ కనిపించారు. ఇక్కడ యశస్వీ, సర్ఫరాజ్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేశారనే భావనలో పెవిలియన్ వైపు కదిలారు. అటు డకెట్ అయితే బౌండరీ లైన్ కూడా దాటేశాడు. కానీ ఇదంతా గమనిస్తున్న రోహిత్ తమ బ్యాటర్లను సీరియస్‌గా చూస్తూ 'ఎక్కడికి వస్తున్నారు.. గో బ్యాక్' అంటూ సైగలు చేయడం కనిపించింది. దీంతో కుర్రాళ్లు క్రీజులోకి వెళ్లారు. కానీ ఒక ఓవర్ ఆడాక భారత కెప్టెన్ అధికారికంగా డిక్లేర్ చేశాడు.

2 ఓ టెస్టులో సెంచరీ+5 వికెట్లు తీయడం జడేజాకిది రెండోసారి. ఓవరాల్‌గా వినూ మన్కడ్, పాలీ ఉమ్రిగర్, అశ్విన్ తర్వాత నాలుగో భారత క్రికెటర్.

1 టెస్టుల్లో పరుగుల పరం (434)గా భారత్‌కిదే అతిపెద్ద విజయం

ఓ టెస్టు సిరీస్‌లో ఎక్కువ (48) సిక్సర్లు బాదిన తొలి జట్టుగా భారత్.

2 ఇంగ్లండ్‌కు పరుగుల పరంగా ఇది రెండో ఘోర ఓటమి

3 రెండు వరుస టెస్టుల్లో డబుల్ సెంచరీలు చేసిన మూడో భారత బ్యాటర్‌గా జైస్వాల్. గతంలో వినోద్ కాంబ్లీ, విరాట్ ఈ ఫీట్ సాధించారు.

రెండో ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ చేసిన మూడో పిన్నవయస్కుడిగా జైస్వాల్.

రెండు ఇన్నింగ్స్‌లోనూ 400+ స్కోర్లు సాధించడం భారత్‌కిది మూడోసారి.

4 అరంగేట్ర టెస్టు రెండు ఇన్నింగ్స్‌లోనూ హాఫ్ సెంచరీలు చేసిన నాలుగో భారత బ్యాటర్‌గా సర్ఫరాజ్. దిలావర్, గవాస్కర్, శ్రేయాస్ ముందున్నారు.



రోహిత్ ధైర్యంగా..

ఇంగ్లండ్ 'బజ్ బాల్' శకంలో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన తొలి కెప్టెన్‌గా రోహిత్ శర్మ నిలిచాడు. స్టోక్స్, కోచ్ మెకల్లమ్ హయాంలో 20 టెస్టులు ఆడిన ఇంగ్లండ్ 14 మ్యాచ్‌లు గెలిచి.. ఐదు టెస్టులు ఓడింది. ఒకటి డ్రాగా ముగిసింది. అయితే, ఏ జట్టు కూడా ఇన్నింగ్స్ డిక్లేర్ చేయడానికి సాహసించలేదు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 445; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 319.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (నాటౌట్) 214; రోహిత్ (ఎల్బీ) రూట్ 19; గిల్ (రనౌట్) 91; రజత్ (సి) రెహాన్ (బి) హార్ట్‌లీ 0; కుల్దీప్ (సి) రూట్ (బి) రెహాన్ 27; సర్ఫరాజ్ (నాటౌట్) 68; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 98 ఓవర్లలో 430/4. వికెట్ల పతనం:** 1-30, 2-191, 3-246, 4-258; **బౌలింగ్:** అండర్సన్ 13-1-78-0; రూట్ 27-3-111-1; హార్ట్‌లీ 23-2-78-1; ఉడ్ 10-0-46-0; రెహాన్ 25-1-108-1.

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (ఎల్బీ) బుమ్రా 11; డకెట్ (రనౌట్) 4; పోప్ (సి) రోహిత్ (బి) జడేజా 3; రూట్ (ఎల్బీ) జడేజా 7; బెయిర్‌స్టో (ఎల్బీ) జడేజా 4; స్టోక్స్ (ఎల్బీ) కుల్దీప్ 15; ఫోక్స్ (సి) జురెల్ (బి) జడేజా 16; రెహాన్ (సి) సిరాజ్ (బి) కుల్దీప్ 0; హార్ట్‌లీ (బి) అశ్విన్ 16; ఉడ్ (సి) జైస్వాల్ (బి) జడేజా 33; అండర్సన్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 39.4 ఓవర్లలో 122 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-15, 2-18, 3-20, 4-28, 5-50, 6-50, 7-50, 8-82, 9-91, 10-122; **బౌలింగ్:** బుమ్రా 8-1-18-1; సిరాజ్ 5-2-16-0; జడేజా 12.4-4-41-5; కుల్దీప్ 8-2-19-2; అశ్విన్ 6-3-19-1.

ఐపీఎల్ ఆల్‌టైమ్ గ్రేట్

టీమ్ కెప్టెన్ ధోనీ

రోహిత్‌కు దక్కని చోటు

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఆల్‌టైమ్ గ్రేట్ టీమ్ కెప్టెన్‌గా ధోనీ ఎంపికయ్యాడు. మాజీలు వసీం అక్రమ్, మాథ్యూ హేడెన్, టామ్ మూడీ, డేల్ స్టెయిన్‌లతోకూడిన సెలెక్షన్ ప్యానెల్ ఈ ఐపీఎల్ డ్రీమ్ టీమ్‌ను ఎంపిక చేసింది. 70 మంది జర్నలిస్టులు కూడా ఈ సెలెక్షన్ ప్రక్రియలో పాల్గొన్నారు. వార్నర్, విరాట్ కోహ్లీని ఓపెనర్లుగా ఎంపిక చేయగా.. వన్‌డౌన్‌లో క్రిస్ గేల్‌కు, మిడిలార్డర్‌లో రైనా, డివిల్లీర్స్, సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా, జడేజా, పొలార్డ్‌లకు స్థానం లభించింది. స్పిన్ విభాగంలో రషీద్ ఖాన్, నరైన్, చాహల్‌కు చోటు దక్కగా.. పేసర్లుగా మలింగ, బుమ్రాలను ఎంపిక చేశారు. 16 ఏళ్ల తన ఐపీఎల్ ప్రయాణంలో చెన్నై సూపర్ కింగ్స్ సారథిగా ధోనీ తనదైన ముద్రవేశాడు. ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా రోహిత్ శర్మ కూడా ఎంతో పాపులారిటీ సాధించాడు. అయితే, ఆల్‌టైమ్ టీమ్ కెప్టెన్ ఎంపికలో మహీ, హిట్‌మ్యాన్ మధ్య తీవ్రపోటీ నెలకొన్నా.. ధోనీవైపు ప్యానెల్ సభ్యులు మొగ్గు చూపారు. కాగా, ఐదుసార్లు ముంబైను విజేతగా నిలిపిన రోహిత్‌కు అసలు టీమ్‌లోనే చోటు దక్కపోవడం గమనార్హం.





సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ప్రోక్టర్ ఇక లేరు

జొహాన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా దిగ్గజ ఆల్‌రౌండర్ మైక్ ప్రోక్టర్ (77) మరణించాడు. దర్బన్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశాడు. గుండెకు శస్త్రచికిత్స తర్వాత పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు తెలిసింది. నిషేధం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోని పునరాగమనం చేసిన సౌతాఫ్రికా జట్టు తొలి కోచ్‌గా ప్రోక్టర్ వ్యవహరించాడు. తాను ఆడే సమయంలో ఫాస్ట్ బౌలర్, ఆఫ్ స్పిన్నర్, మిడిలార్డర్ బ్యాటర్‌గా భిన్న పాత్రలు పోషించిన మైక్.. రిటైర్మెంట్ తర్వాత కోచ్, సెలెక్టర్, కామెంటేటర్, బోర్డు సభ్యుడిగా, ఎలిట్ ఐసీసీ రెఫరీగా కూడా పనిచేశాడు. తన జీవిత చరమాంకంలో పేద పిల్లలకు కోచింగ్ ఇస్తూ గడిపాడు. వర్ణ వివక్ష కారణంగా సౌతాఫ్రికాపై నిషేధం విధించడంతో.. ప్రోక్టర్ తన కెరీర్‌లో 7 టెస్టులు మాత్రమే ఆడాడు. 2008లో సిడ్నీ టెస్టులో జరిగిన మంకీ గేట్ వ్యవహారంలో భారత స్పిన్నర్ హర్భజన్ సింగ్‌పై మూడు టెస్టుల నిషేధం విధిస్తూ వివాదాస్పద నిర్ణయం తీసుకొన్న మ్యాచ్ రెఫరీ ప్రోక్టరే. అయితే, టీమిండియా నిరసన తర్వాత ఆ నిషేధాన్ని రద్దు చేశారు.

రెండో స్థానానికి టీమిండియా

రాజ్‌కోట్: మూడో టెస్టులో ఇంగ్లండ్‌ను చిత్తుగా ఓడించడంతో భారత్ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పట్టికలో తిరిగి రెండో స్థానానికి ఎగబాకింది. గతవారం దక్షిణాఫ్రికాపై వరుసగా రెండు టెస్టులు నెగ్గిన న్యూజిలాండ్ 75 శాతంతో అగ్రస్థానానికి చేరుకోగా, అప్పటిదాకా టాప్‌లో ఉన్న ఆస్ట్రేలియా రెండో స్థానానికి, రెండులో ఉన్న భారత్ మూడో స్థానానికి పడిపోయిన సంగతి తెలిసిందే. తాజా ప్రదర్శనతో 59.52 శాతంతో రోహిత్ సేన ఆసీస్ (55 శాతం)ను వెనక్కినెట్టి మళ్లీ తన రెండో స్థానానికి చేరుకుంది. బంగ్లాదేశ్, పాకిస్థాన్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా తర్వాతి స్థానాల్లో ఉండగా.. ఇంగ్లండ్ (21.88 శాతం) చివరిదైన 8వ స్థానానికి పరిమితమైంది.



అదరగొట్టిన తలైవాస్

పంచకుల: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-10లోని తమ ఆఖరి మ్యాచ్‌ను తమిళ్ తలైవాస్ భారీ విజయంతో ముగించింది. అలాగే లీగ్ చరిత్రలో కొత్త రికార్డులను నెలకొల్పింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 74-37 స్కోరుతో బెంగాల్ వారియర్స్‌పై ఘన విజయం సాధించింది. ఒక లీగ్ మ్యాచ్‌లో అత్యధిక పాయింట్లు సాధించిన జట్టుగా తలైవాస్ నిలిచింది. ఒక మ్యాచ్‌లో ఇరుజట్లు కలిసి అత్యధిక పాయింట్లు (111) సాధించిన గేమ్ కూడా పీకేఎల్‌లో ఇదే కావడం విశేషం. తలైవాస్ అత్యధిక ఆలౌట్లు (7) చేసిన మ్యాచ్ కూడా ఇదే. తలైవాస్ ఈ మ్యాచ్‌లో ఇన్ని రికార్డులు సాధించడానికి కారణం ఆ జట్టు రైడర్లు విశాల్ (18 పాయింట్లు), నరేందర్ (17 పాయింట్లు) ప్రదర్శన. మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 46-38తో బెంగళూరు బుల్స్‌పై గెలిచింది. ఈ విజయంతో ఢిల్లీ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరింది.

నితీష్, ప్రజ్ఞయ్ శతక మోత

హైదరాబాద్: నితీష్ (122), ప్రజ్ఞయ్ (102) శతకాలతో మోతెక్కించడంతో.. రంజీ ప్లేట్ విభాగం ఫైనల్లో మేఘాలయపై హైదరాబాద్ 46 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని నమోదు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 25/2తో ఆటకు రెండోరోజైన ఆదివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ 350 పరుగులకు ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో మేఘాలయ ఒక్క పరుగు కూడా చేయకుండానే ఓపెనర్ రామ్ (0) వికెట్‌ను కోల్పోయింది. మరో ఎండ్‌లో రాజ్ (0) క్రీజులో ఉన్నాడు. మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 304 రన్స్ చేసింది.



హెచ్‌సీఏ చీఫ్ జగన్

వంద కోట్లతో హైదరాబాద్‌లో కొత్త స్టేడియం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): గ్రేటర్ హైదరాబాద్ పరిసరాల్లో త్వరలో రూ.100 కోట్ల వ్యయంతో అధునాతన అంతర్జాతీయ స్టేడియం నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు వెల్లడించారు. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన హెచ్‌సీఏ 86వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 'ప్రస్తుత ఉప్పల్ స్టేడియంలో 250 మందికి వసతితో కూడిన క్రికెట్ ఎక్స్‌లెన్స్ అకాడమీ ఏర్పాటు చేస్తాం. ఇందులో 150 మంది బాలుర, 100 బాలికలకు ప్రవేశం కల్పిస్తాం. జింఖానాలోని హెచ్‌సీఏ అకాడమీని ఆధునీకరించడంతో పాటు పెరిగిన జనాభా దృష్ట్యా జీహెచ్ఎంసీ పరిధిలో నాలుగు శాటిలైట్ అకాడమీల ఏర్పాటు చేస్తాం. అలానే ఉమ్మడి, పాత జిల్లాల్లో, ప్రతి జిల్లాలో ఒక మినీ స్టేడియం నిర్మిస్తాం' అని జగన్‌మోహన్ రావు చెప్పారు. ఈ సమావేశంలో మాజీ క్రికెటర్లు, సీనియర్ క్లబ్ సెక్రటరీలు మహ్మద్ అజరుద్దీన్, శివ్‌లాల్ యాదవ్, అర్షద్ అయూబ్, వి.చాముండేశ్వర్‌నాథ్, వీహెచ్, జి. వినోద్, జాన్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన సిరిసిల్ల రాజయ్య ఎర్రమంజిల్‌లోని కార్యాలయంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. చిత్రంలో మోత్కుపల్లి నర్సింహులు, స్మితా సభర్వాల్ తదితరులు

జగన్‌కు దమ్ముందా?

ఏ అంశంపైనైనా బహిరంగ చర్చకు నేను సిద్ధం: చంద్రబాబు



అమరావతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పాలన ఎవరిదో.. విధ్వంసం ఎవరిదో చర్చించేందుకు తాను సిద్ధమని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఎవరి పాలన స్వర్ణయుగమో.. ఎవరి పాలన రాతి యుగమో.. తేల్చేందుకు తాను సిద్ధమేనన్నారు. 'రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచక, విధ్వంస పాలనపై చర్చించేందుకు నేను సిద్ధం. బూటకపు ప్రసంగాలు కాదు.. దమ్ముంటే నాతో బహిరంగ చర్చకు సిద్ధమా? చర్చకు వచ్చే దమ్ముందా సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఉందా' అని సవాల్ విసిరారు. ఆదివారం రాత్రి చంద్రబాబు ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం జగన్‌తో చర్చకు సిద్ధమని.. రూ. వందల కోట్లు ఖర్చు చేస్తూ, అధికార దుర్వినియోగంతో సిద్ధం అని సభలు పెడుతూ, జగన్ చెబుతున్న అసత్యాల నిగ్గు తేల్చేందుకు తాను సిద్ధమన తెలిపారు. జగన్ సిద్ధం అని సభలు పెట్టి.. అశుద్ధం మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఇంకా ఏమన్నారంటే..

జనం కసితో సిద్ధం..

2019లో ప్రజలిచ్చిన ఒక్క చాన్సే జగన్‌కు రాజకీయంగా చివరి చాన్స్. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచేయడానికి జనం కసితో సిద్ధంగా ఉన్నారు. ఓటమి భయంతో 77 మంది ఎమ్మెల్యేలను జగన్ ఇప్పటికే మడతపెట్టాడు. మిగిలిన వైసీపీ ఎమ్మెల్యేలను 50 రోజుల్లో ఇక జనం మడత పెడతారు. రూ.10 ఇచ్చి, రూ.100 దోచిన జగన్.. సంక్షేమం గురించి చెప్పడమా? సహజ వనరుల దోపిడీతో, స్కాం కోసమే స్కీం పెట్టిన విధానాలతో అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా మారిన జగన్‌కు.. పేదల జీవితాల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిది? రాష్ట్రంలో ఏ మూల చూసినా అభివృద్ధి కాదు.. ఏ ఊరెళ్లినా ఈ ఐదేళ్ల పాలనా విధ్వంసంతో నష్టపోయిన ప్రజలే కనిపిస్తున్నారు. వచ్చే ఎన్నికలు నిజమైన పెత్తందారు జగన్‌కు, 5 కోట్ల మంది ప్రజలకు మధ్య జరిగే యుద్ధం.

టీడీపీ పథకాలు ప్రజలకు గుర్తే!

టీడీపీ తెచ్చిన 120 సంక్షేమ పథకాలు రద్దు చేసిన జగన్ ప్రభుత్వాన్ని రద్దు చేయడానికి జనం కసితో ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సబ్‌ప్లాన్ నిధులు రూ.లక్ష కోట్లు దారి మళ్లించిన జగన్‌పై పేదలు యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. మహిళల కోసం 22 పథకాలు తెచ్చిన పార్టీ టీడీపీ. టీడీపీ పేరు, నా పేరు చెబితే దళితులకు ఇచ్చిన సబ్‌ప్లాన్ నిధులు, ఇన్నోవా కార్లు, నిరుద్యోగ భృతి, 11 డీఎస్సీలతో ఇచ్చిన లక్షన్నర టీచర్ పోస్టులు, రైతు రుణ మాఫీ, అన్నదాత సుఖీభవ, పసుపు-కుంకుమ, చంద్రన్న బీమా, పండుగ కానుకలు, పెళ్లి కానుకలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, అమరావతి, 16 లక్షల కోట్ల పెట్టుబడులు, 10 లక్షల ఉద్యోగాలు ప్రజలకు గుర్తొస్తాయి.

పవన్‌పై కేసును ఖండిస్తున్నా

రాష్ట్రంలో అక్రమ కేసులు, అధికార దుర్వినియోగం తప్ప.. జగన్ సాధించింది శూన్యం. ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నించిన ప్రతిపక్షాలకు సమాధానం చెప్పలేకే కేసులతో వేధిస్తున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై కేసు పెట్టడాన్ని ఖండిస్తున్నాను. జగన్ కేసులు పెట్టినా, దాడులు చేసినా, ప్రశ్నించే గళాలను అణచివేయలేడు. ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది. వారు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు.

రేపట్నుంచి బీజేపీ విజయ సంకల్ప యాత్ర

- రాష్ట్రంలో పది లోక్‌సభ స్థానాలే లక్ష్యంగా..
- వచ్చే నెల 1వ తేదీ వరకు విస్తృత ప్రచారం
- హాజరుకానున్న కేంద్రమంత్రులు, సీఎంలు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా రాష్ట్ర బీజేపీ విజయ సంకల్ప యాత్రకు సిద్ధమైంది. వచ్చే ఎన్నికల్లో కనీసం 10 లోక్‌సభ స్థానాలు, 35 శాతం ఓటు బ్యాంకు సాధించాలని ఆ పార్టీ నాయకత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు అనుగుణంగా ఈనెల 20 (మంగళవారం) నుంచి క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టబోతోంది. బీజేపీ మూడో సారి అధికారంలోకి ఎందుకు రావాలో వివరిస్తూ, రాష్ట్రానికి సంబంధించి గత పదేళ్లలో కేంద్రం అందించిన సహకారాన్ని ప్రజలకు తెలియజేయనుంది. అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని సుసాధ్యం చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీదేనని పేర్కొంటూ, ఈ అంశంపై విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించింది. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమల్లో విఫలమైందని, ప్రభుత్వ వైఖరిని ప్రచారంలో ఎండగట్టనున్నామని బీజేపీ నేతలు చెబుతున్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాలను ఐదు క్లస్టర్లు (ఒక్కో క్లస్టర్‌లో 3 లేదా 4 ఎంపీ స్థానాలు)గా విభజించిన బీజేపీ నాయకత్వం.. వీటిల్లో వచ్చే నెల ఒకటో తేదీ వరకు యాత్రలు చేపట్టబోతోంది. కుమ్రం భీం క్లస్టర్ ముథోల్‌లో ప్రారంభమయ్యే యాత్ర బోధన్‌లో ముగియనుంది. ఈ క్లస్టర్ పరిధిలోని మూడు ఎంపీ, 21 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగనుంది. అలాగే రాజరాజేశ్వరి క్లస్టర్ తాండూరు-కరీంనగర్ (4 ఎంపీ, 28 అసెంబ్లీ నియోజకవర్గాలు), భాగ్యలక్ష్మి క్లస్టర్ భువనగిరి-హైదరాబాద్ (3 ఎంపీ, 21 అసెంబ్లీ), కృష్ణమ్మ క్లస్టర్ మక్తల్‌లో ప్రారంభమై నల్లగొండ (3 ఎంపీ, 21 అసెంబ్లీ) వరకు కొనసాగనుంది. అయితే మేడారం సమ్మక్క-సారక్క మహా జాతర దృష్ట్యా కాకతీయ-భద్రకాళి క్లస్టర్‌లో మాత్రం ఈ నెల 25 నుంచి భద్రాచలం-ములుగు (3 ఎంపీ, 21 అసెంబ్లీ నియోజకవర్గాలు) వరకు యాత్ర సాగనుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణతో పాటు పార్టీ సీనియర్ నేతలు, కేంద్రమంత్రులు, పలువురు సీఎంలు ఈ యాత్రల్లో పాల్గొంటారు. అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ.. 20న ఉదయం 11 గంటలకు కుమ్రం భీం క్లస్టర్ ప్రారంభ కార్యక్రమంలో ముథోల్‌లో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్.. రాజరాజరేశ్వరి క్లస్టర్ ప్రారంభ యాత్రలో భాగంగా తాండూరులో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఇక సోమవారం ఈ యాత్రల ప్రచార రథాలకు కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ఉదయం 9 గంటలకు చేపట్టనున్న ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్యనేతలు కూడా పాల్గొంటారు.

దర్జాగా కబ్జా

(మొదటి పేజీ తరువాయి)



కబ్జాకు గురైన ప్రాంతం

ప్లాట్లూ హెచ్‌ఎండీఏ ఆధీనంలోనే ఉన్నాయి. ఆ రెండు ప్లాట్లూ ఓ మాజీ సీఎం ఇంటికి ఎడమ భాగంలో ఉంటాయి. వాటికి సమీపంలోనే పలువురు తాజా మంత్రుల, ఎమ్మెల్యేల, ఎంపీల నివాసాలు సైతం ఉన్నాయి. 900 చదరపు గజాల విస్తీర్ణం ఉన్న ఈ రెండు ప్లాట్లూ చాలాకాలంగా ఖాళీగా కనిపించడంతో కబ్జాదారుల కన్ను వాటిపై పడింది. వెంటనే ఆ స్థలాన్ని ఆక్రమించి పాగా వేశారు. ఈ రెండు ప్లాట్లకు చుట్టూ ప్రహరీ నిర్మించారు. గేటు కూడా ఏర్పాటు చేశారు. ఆ వైపు ఏ ఒక్కరూ తొంగిచూడకుండా కాపాలాదారులను పెట్టారు. ఆ స్థలం చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆ ప్లాట్ల జోలికి వచ్చేవారిని బెదిరిస్తున్నారు. కబ్జా చేసిన వ్యక్తి తనను తాను మాజీ మంత్రికి స్నేహితుడిగా చెప్పుకొంటుండడంతో ప్రభుత్వ అధికారులు సైతం జీహుజూరు అంటున్నారు. ఇక హెచ్‌ఎండీఏ అధికారులైతే ఆ ప్లాట్ల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. సామాన్యులు ఎంతో కష్టపడి కట్టుకునే ఇళ్లకు నంబర్ కేటాయించడానికి ముప్పుతిప్పలు పెట్టే జీహెచ్‌ఎంసీ అధికారులు.. కబ్జాకు గురైన ఈ భూవికి.. 8-2-293/82/ఎల్/236-ఏ నంబరు కేటాయించారు. ఆ నంబరు ఆధారంగా కబ్జాదారులు ఆ ప్లాట్లకు ఏటా రూ.2296 చొప్పున పదేళ్లుగా ఆస్తి పన్ను చెల్లిస్తుండడం గమనార్హం.

ఇలా వెలుగులోకి..

హుడా హైట్స్ లేఅవుట్‌లో 95, 96వ నెంబర్ ప్లాట్లు గాకుండా అక్కడక్కడ మరికొన్ని ఖాళీ స్థలాలున్నాయి. అయితే హుడా హైట్స్‌లో ప్లాట్ కొనుగోలు చేసిన ఓ వ్యక్తి తన స్థలం కొంత మేరకు కబ్జాకు గురైందని, తనకు సర్వే చేసి అప్పగించాలని హెచ్‌ఎండీఏ అధికారులను కోరారు. ఆ ఫిర్యాదు మేరకు.. సర్వే డిప్యూటీ డైరెక్టర్‌తో పాటు ఏడీ, హెచ్‌ఎండీఏ తహశీల్దార్, ఈఈ తదితరులతో హెచ్‌ఎండీఏ ఏడాది క్రితం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ప్లాట్ల సర్వే నిర్వహించాలని కమిటీ సభ్యులను ఆదేశించింది. దాంతో వారు నిరుడు జూన్ 6న జాయింట్ సర్వే చేసి హెచ్‌ఎండీఏకు నివేదిక అందించారు. ఎమ్మెల్యే కాలనీలోని శ్రీ వెంకటేశ్వర కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీలోని ప్లాట్‌ను సాకుగా చూపి 95, 96 నంబర్ ప్లాట్లను కబ్జా చేశారని అందులో పేర్కొన్నారు. దీంతో శ్రీ వెంకటేశ్వర కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లేఅవుట్‌ను పరిశీలించిన అధికారులు.. హుడా ప్లాట్లను ఆనుకొని ఉన్న సొసైటీ ఓపెన్‌స్పేస్ సైతం కబ్జాకు గురైనట్లుగా గుర్తించారు. ఎమ్మెల్యేకాలనీకి చెందిన సొసైటీ ఓపెన్ స్పేస్‌ను స్వాధీనం చేసుకోవాలంటూ హెచ్‌ఎండీఏ అధికారులు గత ఏడాది అక్టోబర్ 27న జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు లేఖ రాశారు. అయితే.. ఏ వైపు నుంచి ఒత్తిళ్లు వచ్చాయో తెలియదుగానీ మూడు నెలలు గడుస్తున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. హెచ్‌ఎండీఏ అధికారులు కూడా ఇప్పటి వరకు ఆ రెండు ప్లాట్లనూ స్వాధీనం చేసుకోలేదు.

పట్టించుకోని హెచ్‌ఎండీఏ

రాజధాని నడిబొడ్డున విలువైన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా.. హెచ్‌ఎండీఏ అధికారులు పట్టించుకోవట్లేదు. మొద్దు నిద్ర వీడట్లేదు. హుడా హైట్స్‌లో చదరపు గజం ప్రస్తుతం రూ.3 లక్షలకు పైగా పలుకుతోంది. పూర్తిగా నివాస ప్రాంతమైన ఈ కాలనీలో స్థలాన్ని కొనుగోలు చేయాలనుకున్నా.. విక్రయించేందుకు ముందుకు వచ్చే వారు లేరు. ఇలాంటి చోట కబ్జా జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడట్లేదు. ఆరు నెలల క్రితం వివిధ ప్రాంతాల్లో కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉన్న స్థలాలన్నీ విక్రయానికి పెట్టారు. కానీ హుడా హైట్స్‌లో మిగిలిపోయిన ప్లాట్లను మరిచిపోయారు. ఇప్పటికిప్పుడు విక్రయించినా వాటిలో ఒక్కో ప్లాట్‌కు కనీసం రూ.15కోట్ల దాకా వస్తుందని హెచ్‌ఎండీఏ అధికారులే చెబుతున్నారు. అంటే రెండు ప్లాట్ల విలువ రూ.30 కోట్లు. నిజానికి హెచ్‌ఎండీఏ భూములను.. హెచ్‌ఎండీఏలో ఏళ్ల తరబడి పనిచేసిన కొందరు అధికారులు తమ ఆదాయ వనరుగా మార్చుకున్నారని, ఖాళీ స్థలాలపై కన్నేసి రికార్డులను తారుమారు చేసి సమీపంలోని ప్లాట్ల వ్యక్తులకు అప్పగించినట్లుగా ఆరోపణలున్నాయి. కాగా.. ఎమ్మెల్యే కాలనీలోనే షేక్‌పేట రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.102లో హెచ్‌ఎండీఏకు మరో 8.30 ఎకరాల స్థలం ఉన్నది. దాని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసినా తొలగించి మరీ పెద్దఎత్తున నిర్మాణ వ్యర్థాలు పోసి, డంపింగ్ యార్డ్‌గా మార్చేస్తున్నారు. దీన్ని హెచ్‌ఎండీఏ పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రైవేటు వర్సిటీలకు ముకుతాడు!

(మొదటి పేజీ తరువాయి)

ఆయా కాలేజీలు, వర్సిటీల పరిధిలోని అడ్మిషన్లు, ఇతర వ్యవహారాలపై అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు నష్టం కలగకుండా కన్వీనర్ ద్వారానే అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. రాష్ట్రంలో అనురాగ్, మల్లారెడ్డి, ఎస్ఆర్, వోక్సన్, మహేంద్ర వంటి ప్రైవేట్ యూనివర్సిటీలు ఉన్నాయి. అయితే.. కావేరి, ఎంఎన్ఆర్, శ్రీనిధి, గురునానక్, నిక్మార్‌లను ప్రైవేట్ యూనివర్సిటీలుగా గుర్తిస్తూ గత ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ఆమోదించింది. రాష్ట్ర గవర్నర్ మాత్రం బిల్లుకు ఆమోదం తెలపలేదు. కానీ, వీటిల్లో కొన్ని కాలేజీలు యూనివర్సిటీలుగా భావిస్తూ విద్యార్థులకు అడ్మిషన్లను కల్పించాయి. ముఖ్యంగా గురునానక్, శ్రీనిధిల్లో ఈ అడ్మిషన్లు ఎక్కువగా జరిగాయి. విద్యార్థుల భవిష్యత్తు ఆందోళనకరంగా మారడంతో ఆ అడ్మిషన్లను రద్దు చేసి, వివిధ కోర్సుల్లో చేరిన వారిని జేఎన్‌టీయూ, ఉస్మానియా వంటి ఇతర వర్సిటీల్లో సర్దుబాటు చేయాల్సి వచ్చింది. దీంతో ఈ ఏడాది నిర్వహించే అడ్మిషన్ల విషయంలో జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి కూడా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆయా వర్సిటీల్లో జరుగుతున్న అడ్మిషన్లతో పాటు వాటి పరిధిలో ఉన్న భూముల వివరాలు, మౌలిక సదుపాయాలపై అధికారులు నివేదిక రూపొందించినట్లు సమాచారం. దీని ఆధారంగా ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉంది. వర్సిటీలుగా గవర్నర్ బిల్లును ఆమోదించని వాటిని ఈ ఏడాది కాలేజీలుగానే పరిగణించనున్నారు. ఇప్పటికే వర్సిటీలుగా గుర్తింపు పొందిన మల్లారెడ్డి, అనురాగ్ వంటి వాటిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ యూనివర్సిటీల అడ్మిషన్ల ప్రక్రియలో నిబంధనలను పాటిస్తున్నారా? లేదా? అని పరిశీలిస్తున్నారు. ఈ వర్సిటీల పాలక మండలిలో విద్యా శాఖ కార్యదర్శి సభ్యుడిగా వ్యవహరిస్తారు. ఆయా వర్సిటీల్లో ప్రభుత్వ నిబంధనలు అమలవుతున్నాయా? లేదా? అనే విషయంపై సమాచారాన్ని సేకరిస్తారు. అలాగే.. అన్ని ప్రైవేట్ వర్సిటీల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కూడా సర్కారు యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

22,400 పైన క్లోజయితే బుల్లిష్

(ఫిబ్రవరి 19-23 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 22,069-21,530 పాయింట్ల మధ్యన కదలాడి లాభంతో చివరకు 22,041 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 30, 50, 150, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,692, 21,544, 20,261, 19,855 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,450
బ్రేక్‌డౌన్ స్థాయి: 21,650
నిరోధ స్థాయిలు: 22,250, 22,350, 22,450 (22,150 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 21,850, 21,750, 21,650 (21,950 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ		విజయవాడ	542
హైదరాబాద్	554	విశాఖపట్నం	555
19వ తేదీ		వరంగల్	556
చిత్తూరు	603		
గోదావరి	542	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	గోదావరి	134
వరంగల్	130	విజయవాడ	134
కరీంనగర్	130	గుంటూరు	135
మహబూబ్‌నగర్	130	ఒంగోలు	135
కర్నూలు	130	చిత్తూరు	135
విశాఖపట్నం	122		

ప్రభుత్వ పెట్టుబడులే చాలవు

- ప్రైవేట్ పెట్టుబడులూ పెరగాలి
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ సుబ్బారావు



న్యూఢిల్లీ: ప్రైవేట్ పెట్టుబడులు ఇంకా పుంజుకోకపోవడంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెట్టుబడులకు ప్రైవేట్ పెట్టుబడులు కూడా తోడైతేనే 6.5 శాతం నుంచి 7 శాతం జీడీపీ వృద్ధి రేటు సాధ్యమవుతుందని ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. 'ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనపై పెట్టుబడి పెట్టడం సానుకూల అంశమే. ఇది ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాల వృద్ధికి దోహదం చేస్తుంది. అయితే 2025-26 ఆర్థిక సంవత్సరం కల్లా ద్రవ్య లోటును జీడీపీలో 4.5 శాతం వద్ద కట్టడి చేయాలంటే ఈ స్థాయిలో ప్రభుత్వ పెట్టుబడులు కొనసాగించడం కష్టమవుతుంది' అన్నారు. ప్రైవేట్ పెట్టుబడులతో పాటు ప్రస్తుతం వినియోగం, ఎగుమతుల అవకాశాలూ అంతంత మాత్రంగానే ఉన్నట్టు సుబ్బారావు చెప్పారు.

చాయిస్‌లు తక్కువే: ప్రభుత్వ పెట్టుబడులు తగ్గించేందుకు ప్రభుత్వం ముందున్న చాయిస్‌లూ తక్కువేనని సుబ్బారావు చెప్పారు. ఒకవేళ ముందు ముందు కూడా ప్రభుత్వ పెట్టుబడులు ఇదే స్థాయిలో కొనసాగించాలంటే ఇతర ఖర్చులైనా తగ్గించుకోవాలి లేదా అప్పులైనా తేవాల్సి ఉంటుందన్నారు. స్వల్పకాలంలో ఇతర ఖర్చులు తగ్గించుకుంటే ఇతర సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాన్ని అప్పుల తెచ్చి ప్రభుత్వ పెట్టుబడులు కొనసాగించాలంటే ఎఫ్ఆర్‌బీఎం లక్ష్యాలు దెబ్బతింటాయన్నారు.

వృద్ధిలో అసమతౌల్యం: ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతున్నా, సగం జనాభా ఆదాయాలు అంతంత మాత్రంగానే ఉన్న విషయాన్ని సుబ్బారావు గుర్తు చేశారు. అభివృద్ధి ఫలాలు వీరికి కూడా చేరితే తప్ప వినియోగం పుంజుకోదన్నారు. వీరి ఆదాయం, వినియోగ ఖర్చులు పెరిగితే ప్రైవేట్ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలూ పెరుగుతాయన్నారు. దేశీయ వినియోగ పరిశ్రమ ప్రస్తుతం తన ఉత్పత్తి సామర్థ్యంలో 75 శాతం వినియోగించుకుంటోందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు పెట్టుబడులు లోక్‌సభ ఎన్నికల తర్వాత పుంజుకునే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

ఉచితాలు సరికాదు

ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు పోటీపడి ఇస్తున్న 'ఉచిత హామీ'లపై సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉచితాలపై చేసే ఖర్చులను ప్రజలకు విద్య, ఆరోగ్యం లేదా మౌలిక వసతుల కల్పనపై చేయడం మంచిదన్నారు. ఈ రంగాలపై చేసే ఖర్చులు దీర్ఘకాలంతో దేశ అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. ఓటర్లు కూడా ఉచితాల హేతుబద్ధతను ఆలోచించి ఓటేయ్యాలని కోరారు.

ఈ వృద్ధి రేటు చాలదు

2047 నాటికి మన దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే ప్రస్తుత వృద్ధి రేటు చాలదని సుబ్బారావు స్పష్టం చేశారు. వచ్చే 20 ఏళ్ల పాటు ఏటా సగటున 7.6 శాతం చొప్పున అభివృద్ధి చెందితేనే ఆ లక్ష్యం సాధ్యమవుతుందన్నారు. వాతావరణ మార్పులు, ప్రపంచీకరణపై వ్యక్తమవుతున్న వ్యతిరేకత, పెరిగిపోతున్న వృద్ధులు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు ఇందుకు ఆటంకంగా మారే ప్రమాదం ఉందన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) కూడా ఇందుకు ప్రతిబంధకం కావచ్చని చెప్పారు. మన దేశ అభివృద్ధి ప్రపంచ అభివృద్ధితో ముడిపడి ఉందనే విషయాన్ని మర్చిపోకూడదన్నారు. ప్రపంచ అభివృద్ధి క్షీణిస్తుంటే, మన దేశం అభివృద్ధిలో పయనిస్తుందని భావించడం వృథా ప్రయాస అని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ స్పష్టం చేశారు.

బిజినెస్

త్వరలో రెండు సెమీకండక్టర్ ప్లాంట్లు



రూ.వేల కోట్ల పెట్టుబడులు ● కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

న్యూఢిల్లీ: మన దేశంలో త్వరలో రెండు పూర్తి స్థాయి సెమీకండక్టర్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఈ విషయం వెల్లడించారు. ఇందులో ఒక ప్లాంట్‌ను ఇజ్రాయెల్ కేంద్రంగా పని చేసే 'టవర్ సెమీ కండక్టర్ కంపెనీ, రెండో ప్లాంట్‌ను టాటా గ్రూప్ ఏర్పాటు చేస్తాయన్నారు. ఈ రెండు ప్లాంట్ల కోసం ఇజ్రాయెల్ కంపెనీ, టాటా గ్రూప్ రూ.వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు చెప్పారు. ఇజ్రాయెల్ కంపెనీ పెట్టుబడులే 800 కోట్ల డాలర్ల (సుమారు రూ.66,400 కోట్లు) వరకు ఉంటుందని చంద్రశేఖర్ తెలిపారు. ఈ రెండు ప్లాంట్లకు అనుబంధంగా అనే చిప్ అసెంబ్లింగ్, ప్యాకేజింగ్ యూనిట్లూ ఏర్పాటవుతాయన్నారు

జూన్‌లోగా అనుమతులు

టవర్ సెమీకండక్టర్, టాటా గ్రూప్ ఇందుకు అవసరమైన అనుమతుల కోసం ఇప్పటికే ప్రభుత్వానికి దరఖాస్తు చేశాయి. వీలైనంత త్వరలో ఈ రెండు ప్రతిపాదనలకు ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల్లోపు ఆమోదం తెలుపుతుందని చంద్రశేఖర్ చెప్పారు. ఒకవేళ ఈ లోపు కుదరకపోయినా లోక్‌సభ ఎన్నికల తర్వాత జూన్‌లోపు అన్ని అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఇజ్రాయెల్, టాటా గ్రూప్ ఏర్పాటు చేసే రెండు సెమీకండక్టర్ ప్లాంట్లలో 65, 40, 28 నానోమీటర్ చిప్స్ తయారవుతాయన్నారు. వచ్చే ఐదు లేదా పదేళ్లలో మన దేశం ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకి ప్రధాన కేంద్రంగా మారనుందని తెలిపారు.

పేటీఎం నిబంధనలు పాటించాల్సిందే..

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ క్రమశిక్షణా చర్యల పైనా చంద్రశేఖర్ మాట్లాడారు. ఈ దెబ్బతో నిబంధనలు పాటించాల్సిన అవసరం ఏమిటో ఫిన్‌టెక్ కంపెనీలకు తెలిసి వచ్చిందన్నారు. స్టార్టప్ కంపెనీలు నిబంధనల పాటింపును ఐచ్ఛికంగా భావిస్తే ఇలాంటి సమస్యలే వస్తాయన్నారు. రెగ్యులేటరీ నిబంధనలు పాటించడం తప్పనిసరని ప్రతి ఔత్సాహిక పారిశ్రామికవేత్త గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు.

ఫార్మా, మెటల్ షేర్లపై కన్నేయండి..!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మరింత కన్సాలిడేషన్‌కు గురికావచ్చు. గత వారం వరుసగా నాలుగు సెషన్లు సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ పరిణామాలతో పాటు రిలయన్స్, ఎల్ అండ్ టీ వంటి షేర్లు పెరగటమే ఇందుకు కారణం. దీంతోపాటు ఆటో, బ్యాంకింగ్, ఐటీ రంగాల నుంచి మంచి తోడ్పాటు లభించింది. ఈ వారం ఫార్మా, మెటల్ రంగాల్లో మూమెంటమ్ ఉండే అవకాశం ఉంది. నిఫ్టీ ఫిబ్రవరి ఫ్యూచర్స్ మద్దతు స్థాయిలు 21,900, నిరోధ స్థాయిలు 22,150 వద్ద ఉన్నాయి. నిఫ్టీ 22,200 స్థాయిని అధిగమిస్తేనే బుల్లిష్‌నెస్ వస్తుంది.

స్టాక్ రికమండేషన్స్

పాలీక్యాబ్ ఇండియా: ఈ ఏడాది ఆరంభంలో ఒక్కసారిగా పతనమైన ఈ షేరు ప్రస్తుతం నిలదొక్కుకుంది. షేర్ల కదలికల్లో స్థిరత్వం వచ్చింది. మూడో త్రైమాసిక ఫలితాల తర్వాత స్వల్ప కన్సాలిడేషన్ జరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.4,670 వద్ద క్లోజైంది. ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.4,600/4,650 శ్రేణిలో ప్రవేశించి రూ.5,000/5,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,550 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అల్కెమ్ లేబొరేటరీస్: కొన్ని నెలలుగా ఈ కౌంటర్ జోరు ప్రదర్శిస్తూ వస్తోంది. త్రైమాసిక ఫలితాలు ఆకర్షణీయంగా ఉండటం, డివిడెండ్ ప్రకటించటంతో ఈ నెల మొదటి వారం నుంచి అప్‌ట్రెండ్‌ను కనబరుస్తూ వస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.5,442 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.5,400 ఎగువన ప్రవేశించి రూ.5,770/5,800 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకోవచ్చు. అయితే రూ.5,340 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టాటా కమ్యూనికేషన్స్: గత చివరి నాలుగు సెషన్లలో ఈ షేరు లాభాల్లోనే ముగిసింది. త్రైమాసిక ఫలితాల అనంతరం ఈ కౌంటర్‌లో కొనుగోళ్లు పెరిగాయి. గత శుక్రవారం రూ.1,812 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మూమెంటమ్ ట్రేడర్లు రూ.1,775/1,800 శ్రేణిలో ప్రవేశించి రూ.1,945/2,000 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,750 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: సుదీర్ఘ అప్‌ట్రెండ్ అనంతరం ఈ కౌంటర్ స్వల్ప దిద్దుబాటుకు లోనైంది. త్రైమాసిక ఫలితాల తర్వాత ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.1,508 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.1,475/1,500 శ్రేణిలో ప్రవేశించి రూ.1,650/1,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,450 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టీవీఎస్ మోటార్స్: రెండేళ్లుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు తాజాగా సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. రెండు నెలలుగా రూ.1,950 స్థాయిలో కన్సాలిడేషన్ జరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.2,138 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,100 శ్రేణిలో ప్రవేశించి రూ.2,350/2,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,050 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

కీలక నిరోధ స్థాయిల్లో పరీక్ష

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కరెక్షన్‌తో ప్రారంభమై ఆ తర్వాత రికవరీ సాధించి తదుపరి 21,500 ఎగువకు వెళ్లింది. చివరకు 22,000 పాయింట్లకు స్వల్ప ఎగువన క్లోజైంది. గత వారం నిఫ్టీ ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలైన 22,150 పాయింట్ల చేరువలోకి వెళ్లింది. ఈ స్థాయిల వద్ద నిఫ్టీ పరీక్షను ఎదుర్కొనటం ఇది మూడోసారి. టెక్నికల్‌గా చూస్తే ప్రధాన నిరోధ స్థాయిల వద్ద ఎలాంటి అప్‌సైడ్ బ్రేకౌట్‌ను సూచించటం లేదు. గత శుక్రవారం అమెరికా మార్కెట్లు మైనర్ రియాక్షన్‌ను చవిచూడటంతో భారత మార్కెట్లు అప్రమత్త ట్రెండ్‌ను సూచించే అవకాశం ఉంది. ప్రధాన నిరోధ స్థాయిల వద్ద కొద్ది రోజుల పాటు నిలదొక్కుకుంటేనే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను కనబరుస్తుందో లేదో తెలుస్తుంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్‌ను కనబరిస్తే 22,150 ఎగువన తదుపరి ప్రధాన నిరోధ స్థాయిలుంటాయి. ప్రస్తుతం నిఫ్టీ ఈ స్థాయిలకు 100 పాయింట్ల దూరంలో ఉంది. గడిచిన రెండు నెలలుగా ఈ స్థాయిల వద్ద నిలదొక్కుకోవటానికి ప్రయత్నం చేస్తూ కరెక్షన్‌లోకి జారుకుంటోంది. ఈ స్థాయి ప్రస్తుతం స్వల్పకాలిక నిరోధ స్థాయిగా ఉంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఈ నిరోధ స్థాయిలకు ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది.

బేరిష్ స్థాయిలు: నిఫ్టీ ఏదైనా అప్రమత్త ట్రెండ్‌ను సూచిస్తే ప్రధాన మానసిక అవధి స్థాయిలైన 22,000 ఎగువన కచ్చితంగా నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఈ స్థాయిల వద్ద నిలదొక్కుకోలేకపోతే మైనర్ కరెక్షన్‌ను సూచిస్తుంది. తదుపరి స్వల్పకాలిక మద్దతు స్థాయిలు 21,800 దిగువన ఉంటాయి. ఇక్కడ కూడా నిలదొక్కుకోకపోతే మరింత బలహీనతను సూచిస్తుంది. 21,400 కింద ప్రధాన మద్దతు స్థాయిలుంటాయి.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా కనిష్ఠ స్థాయిలైన 44,600 వద్ద రికవరీ సాధించి 46,600 వరకు వెళ్లింది. గత శుక్రవారం కరెక్షన్‌ను చవిచూసినా 750 పాయింట్ల లాభంతో 46,380 వద్ద నిలకడగా ముగిసింది. ఈ వారం పాజిటివ్ ట్రెండ్‌ను కనబరిస్తే 46,700 ఎగువన ప్రధాన నిరోధం ఉంటుంది. ఇక్కడ నిలదొక్కుకుంటేనే అప్‌ట్రెండ్‌ను సూచిస్తుంది. తదుపరి ప్రధాన నిరోధం 47,200. ఒకవేళ ప్రస్తుత స్థాయిలైన 46,000 వద్ద నిలదొక్కుకోలేకపోతే అప్రమత్తతను సూచిస్తుంది.

పాటర్న్: మార్కెట్ గత రెండు నెలలుగా దీర్ఘచతురస్రాకార ప్యాటర్న్‌లో నిలిచిపోయింది. 221,50 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. దీన్ని బ్రేక్ చేస్తేనే తదుపరి అప్‌ట్రెండ్‌ను కనబరుస్తుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,080, 22,150
మద్దతు	21,940, 21,850

www.sundartrends.in

8 కాదు.. 6 మెడికల్ కాలేజీలే!

» 2 చోట్ల మౌలిక సదుపాయాల కొరత

» ఆరింటి ఏర్పాటుకే కొత్త సర్కారు నిర్ణయం

» ఆయా జిల్లా ఆస్పత్రులు డీఎంఈ పరిధికి బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త మెడికల్ కాలేజీలపై స్పష్టత వచ్చింది. 8 కళాశాలలకు బదులు ఆరింటికే కొత్త సర్కారు మొగ్గు చూపింది. గత బీఆర్ఎస్ సర్కారు చివరి నిమిషంలో 8 కొత్త వైద్య కళాశాలలకు దరఖాస్తు చేసింది. ఆ ఎనిమిదింటిలో రెండు చోట్ల కాలేజీల ఏర్పాటుకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు లేవు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో కనీసం సర్కారు దవాఖానాలు కూడా లేవు. దీంతో అక్కడ కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటు కష్టమంటూ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దాంతో ఆ రెండు చోట్ల కాలేజీల ఏర్పాటు నిర్ణయాన్ని కాంగ్రెస్ సర్కారు ఉపసంహరించుకుంది. ప్రస్తుతం ఆరు చోట్ల కొత్త కాలేజీలను ఏర్పాటుకు సంబంధించిన కసరత్తును వేగవంతం చేసింది. గద్వాల, నారాయణపేట, ములుగు, వరంగల్ జిల్లా నర్సంపేట, మెదక్, యాదాద్రి జిల్లా భువనగిరిలో కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేయబోతోంది. ఇప్పటికే ఆ కాలేజీల కోసం ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లను కూడా నియమించింది. ఈ ఆరు చోట్ల ఉన్న జిల్లా ఆస్పత్రులు ఇప్పటివరకు తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్నాయి. వాటిని వైద్య విద్యా సంచాలకుల (డీఎంఈ) పరిధిలోకి బదిలీ చేశారు. ఈ మేరకు టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ ఆరు జిల్లా ఆస్పత్రుల్లోని స్టాఫ్ నర్సులను ఇటీవలే జీవో నంబరు 317 కింద వేర్వేరు ఆస్పత్రులకు పంపారు. ప్రస్తుతం అవి మెడికల్ కాలేజీలుగా మారనున్న నేపథ్యంలో ఆ స్టాఫ్ నర్సులను వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు ఆదేశాలిచ్చారు.

కవ్వాల్ నుంచి గ్రామాల తరలింపు వేగవంతం

» పునరావాస కాలనీ సిద్ధం: మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కవ్వాల్ పులుల అభయారణ్యం నుంచి గ్రామాల తరలింపు ప్రక్రియ వేగవంతం అయిందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. కోర్ ఏరియా నుంచి గ్రామాల తరలింపు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, మిగతా గ్రామాలకు ఆదర్శంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో ఆదివారం పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియల్ క్షేత్ర పర్యటన చేశారు. కవ్వాల్ అటవీ ప్రాంతం నుంచి తరలిస్తున్న గ్రామాల ప్రజలకు కల్పిస్తున్న పునరావాస కాలనీ పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు. స్థానిక అధికారులతో కలిసి పునరావాస కాలనీని సందర్శించారు. లబ్ధిదారులతో సమావేశమయ్యారు. కవ్వాల్ టైగర్ రిజర్వు అటవీ ప్రాంతం నుంచి మొదటి దశలో రాంపూర్, మైసంపేట గ్రామాలు ఖాళీ చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చాయి. ఈ గ్రామాల ప్రజలకు పునరావాస కాలనీ సిద్ధమైంది. కేంద్రప్రభుత్వం(ఎన్‌టీసీఏ) నిబంధనల ప్రకారం రెండు ప్రతిపాదనలతో అటవీశాఖ ఈ పనులను చేపట్టింది. గ్రామాల తరలింపులో భాగంగా ఒక్కో కుటుంబానికి ఏకమొత్తంగా 15 లక్షల రూపాయల పరిహారం అందిచటం ఒక ప్రతిపాదన కాగా దీనికి 48 కుటుంబాలు అంగీకరించి పరిహారాన్ని స్వీకరిస్తున్నాయి. ఇక రెండవ ప్రతిపాదనకు అంగీకరించిన 94 కుంటుంబాలకు.. అవే రూ.15 లక్షల పరిహారంలో భాగంగా ఒక ఇంటితోపాటు సాగు భూమిని కూడా ప్రభుత్వం సమకూర్చుతోంది. కవ్వాల్‌కు సమీపంలోనే అటవీ ప్రాంతం బయట కొత్తమద్దిపడగలో అన్ని వసతులతో పునరావాస కాలనీ నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి. మొత్తం 12.36 ఎకరాల్లో ఈ కాలనీ నిర్మాణం చేపడుతుండగా, ఒక్కో కుటుంబానికి 333చదరపు గజాల్లో ఇంటిని నిర్మిస్తున్నారు. 2.81ఎకరాల సాగుభూమి అందిస్తున్నారు. పనులన్నీ పూర్తి కాగానే ప్రభుత్వ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటుచేసి, లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ చేస్తామని పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ తెలిపారు.

కాంగ్రెస్‌ను గిల్లితే.. బీజేపీ నేతలకు నొప్పి

» ఆలేరు మెడికల్ కాలేజీని కొడంగల్‌కు తరలిస్తారా?

» చేతనైతే కొత్త కాలేజీ కట్టుకోండి: నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రెండు జాతీయ పార్టీలు ఒక్కటేనని, కాంగ్రెస్ పార్టీని గిల్లితే బీజేపీ నేతలకు నొప్పి కలుగుతోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మొన్నటి వరకు కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీపై బురదజల్లిన బీజేపీ.. ఇప్పుడు హామీల విషయంలో కాంగ్రెస్‌ను ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ రెండు పార్టీల మధ్య సఖ్యత కారణంగానే బీజేపీ ఇలా వ్యవహరిస్తోందన్నారు. వెనకబడ్డ కొడంగల్ అభివృద్ధి పట్ల తాము హర్షం వ్యక్తం చేస్తున్నామని, అయితే.. ఆలేరు మెడికల్ కళాశాలను కొడంగల్‌కు తరలించడం తగదని చెప్పారు. చేతనైతే కొడంగల్‌లో కొత్తగా కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. మేడిగడ్డలో మూడు పిల్లర్ల కుంగుబాటును చూపించి మొత్తం ప్రాజెక్టునే బద్నాంచేసే ప్రయత్నం జరుగుతోందని, ఈ అంశంపై అసెంబ్లీలో హరీశ్‌రావు జవాబులకు ముఖ్యమంత్రి కాంగ్రెస్ మంత్రులు, తట్టుకోలేకపోయారని విమర్శించారు. కాళేశ్వరంపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని, తప్పు జరిగినట్లు తేలితే ఏ చర్యకైనా తాము సిద్ధమని నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు.

'వక్ఫ్' ఆస్తుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

» త్వరలోనే దీనిపై సీఎం సమీక్ష: షబ్బీర్ అలీ

» ముఖ్యమంత్రిని కలిసిన వక్ఫ్‌బోర్డు సభ్యుల బృందం



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని వక్ఫ్ బోర్డు పరిధిలోని ఆస్తులను పరిరక్షించి, అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సలహాదారుడు మహమ్మద్ షబ్బీర్ అలీ తెలిపారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో షబ్బీర్ అలీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సీఎం రేవంత్ రెడ్డిని కలిసింది. సీఎంతో భేటీ అనంతరం షబ్బీర్ అలీ మీడియాతో మాట్లాడారు. 'వక్ఫ్' ఆస్తులకు సంబంధించిన అంశాలపై అధ్యయనం చేసి, పూర్తిస్థాయిలో ఒక సమావేశం నిర్వహించాలని వక్ఫ్‌బోర్డును సీఎం ఆదేశించారని ఆయన తెలిపారు. ఆ సమావేశంలో పరిష్కారానికి సాధ్యమైయే అన్ని రకాల సమస్యలతో కూడిన జాబితాను సిద్ధం చేయాలని సూచించారన్నారు. వక్ఫ్ ఆస్తుల సమస్యలకు సంబంధింత విభాగాలైన రెవెన్యూ, ఆర్థిక శాఖలతోపాటు అడ్వకేట్ జనరల్, ఇతర అధికారుల జాబితాను కూడా సిద్ధం చేయాలని సీఎం వక్ఫ్‌బోర్డును ఆదేశించినట్లు షబ్బీర్ అలీ వెల్లడించారు. అలాగే వక్ఫ్ ఆస్తుల సమస్యలపై సమగ్రంగా సమీక్ష నిర్వహిస్తామని సీఎం హామీ ఇచ్చారని సీఎం ఆదేశాల మేరకు త్వరలోనే సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తానని షబ్బీర్ అలీ స్పష్టం చేశారు. షబ్బీర్ అలీతో పాటు కొత్తగా ఎన్నికైన వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుసేని, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సమీర్ వలీవుల్లా ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

పసుపు బోర్డు ఏర్పాటు చేయండి

» ప్రధాని మోదీకి మంత్రి తుమ్మల లేఖ



హైదరాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పసుపుబోర్డును నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటుచేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు.. ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. తెలంగాణలో పసుపు బోర్డును ఏర్పాటు చేయాలని పసుపు రైతులు కొన్నేండ్లుగా పోరాటాలు చేస్తున్నారని, గత పార్లమెంటు ఎన్నికల్లో పసుపు రైతులు నిజామాబాద్ ఎంపీ స్థానానికి నామినేషన్లు వేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గత ఏడాది అక్టోబరు నాలుగో తేదీన పసుపు బోర్డు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందని.. అందులో ఎక్కడ కూడా పసుపు బోర్డు ఏర్పాటు చేసే ప్రదేశంకాని, బడ్జెట్ వివరాలుగానీ పేర్కొనలేదని తెలిపారు. రాష్టంలో పసుపు పండించే జిల్లాలలో నిజామాబాద్ జిల్లా ప్రధానమైందని, నిజామాబాద్ పసుపు రైతులు పసుపు మద్దతు ధర, జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు కోసం కేంద్రానికి క్రమం తప్పకుండా విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారన్నారు. రైతుల సంక్షేమం కోసం జాతీయ పసుపు బోర్డును తెలంగాణలో వెంటనే ఏర్పాటు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించినట్లు తుమ్మల ఆ లేఖలో తెలిపారు.

డ్వాక్రా సంఘాలకు మళ్లీ వడ్డీలేని రుణాలు

(మొదటిపేజీ తరువాయి)

పాలకమండలి సమావేశాన్ని నిర్వహించగా.. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ మహిళలందరినీ తమ ప్రభుత్వం మహాలక్ష్మీలుగా చూస్తోందని తెలిపారు. అందుకే డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు మళ్లీ వడ్డీ లేని రుణాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ, హాస్టల్ వర్కర్లు, ఏఎన్ఎంలకు గత 18 నెలలుగా వేతనాలు అందడం లేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఇది పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆన్‌లైన్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తామని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యులు రోగుల రిపోర్టులను పరిశీలించి, సలహాలు, సూచనలు ఇస్తారని వివరించారు. పోడు సాగుదారులకు రక్షణగా గత కాంగ్రెస్ ప్రభుత్వమే అటవీహక్కుల చట్టం తెచ్చిందని, పోడు సాగు చేసే గిరిజనులను ఇబ్బంది పెట్టవద్దని అధికారులకు స్పష్టం చేశామని తెలిపారు. వారి సమస్యలకు పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. గత ప్రభుత్వం ఐటీడీఏలను నిర్వీర్యం చేసిందని, మూడు నెలలకు ఓసారి నిర్వహించాల్సిన సమావేశాలను కూడా సజావుగా నిర్వహించలేదని ఆరోపించారు. ఇక నుంచి ప్రతి మూడు నెలలకు ఒకసారి పాలక మండలి సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని, ఐటీడీఏలు పూర్వ వైభవాన్ని సాధించేలా కృషి చేస్తామని భట్టి హామీ ఇచ్చారు. భద్రాద్రి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. భద్రాచలం వద్ద గోదావరిపై నూతనంగా నిర్మిస్తున్న రెండో వారధిని శ్రీరామనవమి నాటికి పూర్తి చేస్తామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భద్రాచలానికి వరద గండం లేకుండా కరకట్ట నిర్మాణం చేపడతామని తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రూ.10 కోట్లతో ఐదు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. కాగా ఐటీడీఏ పాలక మండలి సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, రాందాస్‌నాయక్, డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతమ్, డాక్టర్ ప్రియాంక ఆలా, భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ పాల్గొన్నారు.

విజన్ 2050

తెలంగాణ అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. నగర అభివృద్ధి కోసం పదేళ్ల చొప్పున పాలనలో చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి, కే.చంద్రశేఖర్ రావు కృషి చేశారని కొనియాడారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాలు ఎలా ఉన్నప్పటికీ హైదరాబాద్ నగర అభివృద్ధి కొనసాగుతూనే ఉందని, ఫలితంగానే హైదరాబాద్ పెట్టుబడులకు అనువైన ప్రాంతంగా మారిందని పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధి పరంగా గత ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలను కొనసాగిస్తూనే.. మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అదేసమయంలో గత ప్రభుత్వాలు సృష్టించిన సమస్యలనూ పరిష్కరిస్తూ, భవిష్యత్తుకు ప్రణాళికలు రూపొందించుకుంటూ ముందుకు వెళ్తామన్నారు. నగర అభివృద్ధిపై తమ ప్రభుత్వానికి స్పష్టమైన విధానం ఉందని, మేధావులమని తమకు తాము భావించబోమని, అభివృద్ధి విషయంలో అనుభవజ్ఞులు, నిపుణుల సలహాలతో ముందుకుసాగుతామని పేర్కొన్నారు. తమకు తాము మేధావులుగా వ్యవహరిస్తే అది మేడిగడ్డ చందంగా మారుతుందని గత ప్రభుత్వ నేతల తీరును ఎద్దేవా చేశారు. నగరంలో శాంతి భద్రతలు మెరుగ్గా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, హైదరాబాద్ అభివృద్ధికి క్రెడాయ్, అధికారులు ఇచ్చే సూచలను తీసుకుంటామని చెప్పారు. నగరంలో అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా మెట్రోను విస్తరిస్తున్నామని చెప్పారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్, ఒవైసీ ఆస్పత్రి, చాంద్రాయణగుట్ట మీదుగా ఎయిర్‌పోర్ట్ వరకు.. మియాపూర్ నుంచి రామచంద్రాపురం వరకు.. రాయదుర్గం నుంచి అమెరికన్ కాన్సులేట్ వరకు మెట్రోను విస్తరిస్తామని పేర్కొన్నారు. పారదర్శకంగా పాలన అందించే అధికారులకు గుర్తింపు ఉంటుందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అందరికంటే ముందుండేది అగ్నిమాపక సిబ్బందేనని, ప్రజల రక్షణ కోసం వారు ప్రాణాలకు తెగించి పోరాడుతారని కొనియాడారు. పోలీస్ శాఖ సిబ్బందికి మాదిరిగానే ఇన్సూరెన్స్‌తో పాటు అన్ని సౌకర్యాలను ఫైర్ విభాగానికి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.



నానక్‌రామ్‌గూడలో తెలంగాణ స్టేట్ ఫైర్ సర్వీసెస్ హెడ్ క్వార్టర్స్ భవనాన్ని ప్రాంభించిన సీఎం రేవంత్

ఫార్మా సిటీ కాదు ఫార్మా విలేజ్‌లు

ఫార్మా సిటీపై కొంతమంది విష ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి 25 వేల ఎకరాల్లో ఫార్మా సిటీ నిర్మించడం వల్ల కాలుష్యం పెరుగుతుందన్నారు. ఫార్మా సిటీలో ఒక కాలుష్య పరిశ్రమ వచ్చినా మొత్తం కలుషితం అవుతుందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా చిన్న చిన్న క్లస్టర్‌లలో ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని వివరించారు. ఫలితంగా పారదర్శకతతోపాటు కాలుష్యం చేయకుండా ఆయా సంస్థలపై బాధ్యత ఉంటుందన్నారు. ఆయా ఫార్మా విలేజీల్లో విద్య, వైద్యం, రవాణా వంటి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డుకు సమీపంలోని 25 వేల ఎకరాల్లో హెల్త్, స్పోర్ట్స్, కాలుష్య రహిత పరిశ్రమలతో సిటీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

గెలుపు గుర్రాలపై సర్వే

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గాల అభ్యర్థిత్వానికి వచ్చిన దరఖాస్తులపై ప్రదేశ్ ఎన్నికల కమిటీ అభిప్రాయాలు సేకరించిన ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ.. వాటిని షార్ట్ లిస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ వారంలో స్క్రీనింగ్ కమిటీ మరోమారు భేటీ కానున్నట్లు చెబుతున్నారు. సునీల్ కనుగోలు బృందాలు, డీకే శివకుమార్ ఆధ్వర్యంలోని ప్రయివేటు ఏజెన్సీలు నిర్వహించిన సర్వే నివేదికలు, ఇంటెలిజెన్స్ నివేదికలను క్రోడీకరించి.. అభ్యర్థుల ఎంపికపైన కసరత్తు చేపట్టనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సర్వేలు నిర్వహిస్తున్న సునీల్ కనుగోలు బృందాలు.. ఒక్కో నియోజకవర్గానికి 200 మంది చొప్పున.. లోక్‌సభ నియోజక వర్గంలో 14 వందల నుంచి 15 వందల మంది అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఈ బృందాలు వివిధ కోణాల నుంచి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పనితీరుపైన ప్రజల్లో నెలకొన్న అభిప్రాయంతో పాటుగా.. ఆయా నియోజకవర్గాల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల బలాబలాలు ఎలా ఉన్నాయన్నదీ ఆరా తీస్తున్నాయి. ఇప్పటి వరకు కనుగోలు బృందాలు సేకరించిన అభిప్రాయాల ప్రకారం రేవంత్ ప్రభుత్వ రెండు నెలల పాలన తీరు పట్ల మెజారిటీ ప్రజలు సంతృప్తినే వ్యక్తం చేశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పొత్తు కుదిరే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో.. ఆ రెండు పార్టీలూ కలిస్తే అది కాంగ్రెస్ గెలుపు అవకాశాలపై ఏ మేరకు ప్రభావం చూపుతుందన్న అభిప్రాయాన్నీ ఈ బృందాలు సేకరిస్తున్నాయి. ఆ రెండు పార్టీలు కలిస్తే.. కాంగ్రెస్ తరఫున ఎవరు మెరుగైన అభ్యర్థి అవుతారనీ ఆరా తీస్తున్నట్లు చెబుతున్నారు. కేవలం కాంగ్రెస్ ఆశావహులే కాకుండా.. కాంగ్రెస్ యేతర పార్టీల్లోని నాయకులకు ప్రజల్లో ఉన్న సానుకూలతపైనా సర్వేలో భాగంగా సమాచారం సేకరిస్తున్నట్లు చెబుతున్నారు. కేవలం సునీల్ కనుగోలు బృందాల సర్వేలపైనే ఆధారపడకుండా.. వివిధ కోణాల్లో డీకే శివకుమార్ ఆధ్వర్యంలోని సర్వే బృందాలు, ఇంటెలిజెన్స్‌తోనూ సమాచార సేకరణ జరుగుతోంది. ఈ సర్వేల నివేదికల ఆధారంగా కాంగ్రెస్‌లో చేరికలూ ఉండొచ్చునని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో కనీసంగా 14 ఎంపీ సీట్లను కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. విజయావకాశాలు ఉన్న నేతలనే అభ్యర్థులుగా ఎంపిక చేయాలన్న పట్టుదలతో ఉంది.

సుప్రీంకోర్టులో విచారణ దృష్ట్యా చండీగఢ్ మేయర్ రాజీనామా

» తప్పుకోమన్న బీజేపీ నాయకత్వం

చండీగఢ్, ఫిబ్రవరి 18: బీజేపీకి చెందిన మనోజ్ సోంకర్ చండీగఢ్ మేయర్ పదవికి ఆదివారం రాజీనామా చేశారు. మేయర్ ఎన్నికపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరగనున్న నేపథ్యంలో ఆయన తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకొంది. మేయర్ ఎన్నికల్లో ఆప్-కాంగ్రెస్ కూటమికి మెజార్టీ ఉన్నా రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన కోఆప్షన్ సభ్యుడు అనిల్ మాశిష్ అక్రమాలకు పాల్పడి మనోజ్ సోంకర్ విజయం సాధించినట్టు ప్రకటించారు. ఎనిమిది బ్యాలెట్ పత్రాలపై వేసిన గుర్తులను చెరిపివేసిన అనిల్ అవి చెల్లవని పేర్కొన్నారు. దీనిని సవాలు చేస్తూ ఆప్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ ఘటనపై గత విచారణలోనే ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలోని ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సోమవారం మళ్లీ విచారణ జరగనున్న నేపథ్యంలో శనివారం ఢిల్లీలో భేటీ అయిన బీజేపీ నాయకత్వం పదవికి రాజీనామా చేయాలని సోంకర్‌ను ఆదేశించింది. అనిల్ మాశిష్‌ను కూడా ఇంతకుముందే పదవి నుంచి తొలగించింది. బీజేపీ చండీగఢ్ విభాగం మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి అయిన అనిల్ కూడా విచారణకు హాజరు కానున్నారు.

పార్లమెంట్ పోరుకు ఉద్యోగుల సై

వరంగల్, మానుకోట టికెట్లకు పోటాపోటీ.. కాంగ్రెస్ టికెట్ల కోసం ముమ్మరంగా ప్రయత్నాలు

» బీఆర్ఎస్ టికెట్‌పై గెలుస్తామన్న ధీమాతో ఒకరిద్దరు

వరంగల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల వేళ సర్కారు కొలువును వదిలి రాజకీయ అరంగేట్రం చేసేందుకు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు సై అంటున్నారు. టికెట్ ఇస్తే చాలు తమ నౌకరీకి రాజీనామా చేసి ఖద్దరు దుస్తులు ధరించేందుకు రెడీ అవుతున్నారు. పార్టీ ఏదైనా సరే టికెట్ వస్తే బరిలో నిలుస్తామని కొందరంటుంటే.. కాంగ్రెస్ టికెట్ వస్తే పక్కాగా పోటీ చేస్తామని కొందరు చెబుతున్నారు. ఈ మేరకు తమ గాడ్‌ఫాదర్ల ద్వారా పార్టీల పెద్దలను కలిసేందుకు ఢిల్లీ, హైదరాబాద్‌కు పరుగులు పెడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్(ఎస్సీ), మహబూబాబాద్ (ఎస్టీ) స్థానాల్లో గత రెండు పర్యాయాలు బీఆర్ఎస్ విజయం సాధించింది. అయితే, ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో టికెట్లు ఆశించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

మహబూబాబాద్‌లో ఇలా..

మహబూబాబాద్‌లో అధికార కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తే విజయం తథ్యమనే ఆలోచనతో డజను మందికి పైగా ఆశావహులు అధిష్ఠానం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. గతంలో మహబూబాబాద్ డీఎస్పీగా పని చేసిన ఖమ్మం జిల్లా వాసి దుంగ్రోత్ నాగరాజునాయక్ మహబూబాబాద్ నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో ఏఐజీ(అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్)అడ్మిన్‌గా పని చేస్తున్నారు. టికెట్ వస్తే స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకోవాలని భావిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ భట్టు రమేష్ కూడా మహబూబాబాద్ నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఎస్బీ డీసీఎల్ డీఈగా పని చేస్తున్న మహబూబాబాద్ వాసి ఎట్టి వెంకన్న కూడా కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. ఇటీవలే ఆయన అనుచరులు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డిని కలిసి వెంకన్నకు ఎంపీ టికెట్ ఇవ్వాలని, ఆదివాసీలకు అవకాశం ఇచ్చినట్లు అవుతుందని వివరించారు. మరికొందరు ఉద్యోగులు సైతం అంతర్గతంగా కాంగ్రెస్ టికెట్ కోసం తమకు తెలిసిన ముఖ్యనేతల ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు.. వైరా మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ కుమారుడు ఐఆర్ఎస్ జీవన్‌లాల్‌నాయక్ మహబూబాబాద్ నుంచి బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన మాలోతు భిక్షపతినాయక్ ఎప్పటి నుంచో ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. ప్రస్తుతం ఎల్ఐసీ వరంగల్ డివిజన్ డీవోగా విధులు నిర్వర్తిస్తున్నారు.

వరంగల్ బరిలో నిలవాలని..

వరంగల్ లోక్‌సభ స్థానంలో పోటీకి సీనియర్ కాంగ్రెస్ నేతలకు దీటుగా ఉద్యోగులు సై అంటున్నారు. ఉమ్మడి వరంగల్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న హరికోట్ల రవి కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఆయనకు మంత్రి పొంగులేటితోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సత్సంబధాలున్నాయన్న చర్చ జరుగోతోంది. వీరి మద్దతుతో ఇటీవలే ఏఐసీసీ అగ్ర నాయకురాలు సోనియాగాంధీని ఢిల్లీలో కలిశారు. గతంలో ప్రభుత్వ వైద్యుడిగా పని చేసిన రాగమళ్ల పరమేశ్వర్ కూడా కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. మాజీ పోలీస్ అధికారి దొమ్మాటి సాంబయ్య కూడా కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు.

మల్కాజ్‌గిరి పైనే అందరి గురి!



లోక్‌సభ స్థానం నుంచి పోటీకి అమితాసక్తి.. ప్రధాన పార్టీల్లో ఈ టికెట్ కోసం తీవ్ర పోటీ

» అగ్ర నేతల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు

» సానుకూల ఫలితాలుంటాయని ఆశాభావం

» బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న హేమాహేమీలు

» కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లోనూ ఇదే పరిస్థితి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి.. దేశంలోనే అత్యధిక ఓటర్లు ఉన్న పార్లమెంట్ స్థానం.. భిన్న సంస్కృతులకు నిలయం. ఇక్కడి ప్రజల తీర్పు ఎప్పుడూ విభిన్నమే.. ఇలా ఒకటీ రెండు కాదు ఈ స్థానానికి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. అందుకే రాష్ట్రంలోని ప్రధాన పార్టీల నుంచి అధిక సంఖ్యలో నేతలు ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. సొంత పార్టీల్లో ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తూనే.. అవకాశం దక్కకుంటే కండువా మార్చేందుకూ సిద్ధపడుతున్నారు. ఈ క్రమంలో పక్క పార్టీల నేతలతోనూ సంప్రదింపులు జరుపుతున్నారు. స్థానికులే కాకుండా.. ఇతర జిల్లాలకు చెందిన నాయకులు సైతం మల్కాజ్‌గిరిపై గురి పెడుతున్నారు. తెలంగాణలో 17 పార్లమెంట్ నియోజకవర్గాలు ఉండగా.. మల్కాజ్‌గిరి టికెట్ కోసం అత్యధికంగా పోటీ ఉండడం గమనార్హం. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్.. ఇలా అన్ని ప్రధాన పార్టీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.



ఈటల నుంచి మురళీధర్‌రావు దాకా..

మల్కాజ్‌గిరి టికెట్ కోసం బీజేపీలో అత్యధిక మంది నేతలు పోటీ పడుతున్నారు. సీనియర్ నాయకులు ఈటల రాజేందర్, కూన శ్రీశైలం గౌడ్, మురళీధర్‌రావు, చాడ సురేష్‌రెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కొమురయ్య, పన్నాల హరీశ్‌రెడ్డి, సామ రంగారెడ్డి తదితరులు ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈటల రాజేందర్ హుజురాబాద్‌కు చెందిన నేత అయినా.. కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో సిటింగ్ ఎంపీ బండి సంజయ్ ఉన్నందున మల్కాజ్‌గిరి టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలు మార్లు ఆయన ఢిల్లీలో పార్టీ అగ్రనేతలను కలిసినట్లు సమాచారం. కుత్బుల్లాపూర్‌కు చెందిన శ్రీశైలంగౌడ్ కూడా స్థానికత, ప్రజల్లో తనకున్న పరపతి దృష్ట్యా అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిసింది. కొంత కాలంగా స్థానిక కేడర్‌తోపాటు కాలనీ సంఘాలతో టచ్‌లో ఉంటున్న మురళీధర్‌రావు సైతం ఈ టికెట్ కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

సిటింగ్ స్థానం.. పోటీ అధికం

ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి.. 2019లో మల్కాజ్‌గిరి ఎంపీగా గెలుపొందిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సిటింగ్ స్థానం కావడంతో ఆ పార్టీ నుంచి పోటీ చేసేందుకు నాయకులు అమితాసక్తి చూపుతున్నారు. పార్టీలోని సీనియర్లతోపాటు కొత్తగా కండువా కప్పుకొన్న వారూ ఇక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్నారు. మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, బండి రమేష్, శెట్టి కుసుమకుమార్‌తోపాటు తాజాగా పార్టీలో చేరిన బొంతు రామ్మోహన్, చంద్రశేఖర్‌రెడ్డి కూడా అవకాశం కల్పించాలని రాష్ట్ర నాయకత్వాన్ని కోరినట్లు తెలిసింది. బండ్ల గణేష్ కూడా ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు.. రేవంత్‌రెడ్డి సోదరుడూ పోటీ చేస్తారనే ప్రచారమూ జరుగుతోంది. అయితే, కుటుంబ సభ్యులను రేవంత్‌రెడ్డి ఎన్నికల బరిలో దింపుతారా..? లేదా..? అన్నది తేలాల్సి ఉంది. తుది నిర్ణయం అధిష్ఠానం తీసుకోనున్న నేపథ్యంలో ఎవరు బరిలో ఉంటారన్నది సస్పెన్స్‌గా మారింది.

బీఆర్ఎస్‌లో ఎవరెవరంటే?

మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను ఇటీవలి ఎన్నికల్లో బీఆర్ఎస్సే గెలుచుకుంది. దీంతో ఈ టికెట్ కోసం చాలా మంది నాయకులు పోటీ పడుతున్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ అవకాశం దక్కని పక్షంలో కాంగ్రెస్‌లో చేరి, పోటీ చేయాలని మర్రి జనార్దన్‌రెడ్డి భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కూడా టికెట్ ఆశిస్తున్నారని తెలిసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌లో చేరిన కాసాని జ్ఞానేశ్వర్ కూడా తమ కుటుంబంలో ఒకరికి మల్కాజ్‌గిరి లేదా సికింద్రాబాద్ స్థానాల్లో ఒకటి కేటాయించాలని కోరుతున్నట్లు సమాచారం. అయితే, ఇక్కడి నుంచి మాజీ మంత్రి మల్లారెడ్డినే బరిలో దింపాలని పార్టీ యోచిస్తున్నట్లు తెలిసింది. అదే సమయంలో అసలు ప్రచారంలో లేని నేతను బరిలో దింపినా ఆశ్చర్యం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పునర్విభజనలో భాగంగా 2008లో ఏర్పాటు

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2008లో మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం ఏర్పడింది. దీని పరిధిలో కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్‌బీనగర్, మల్కాజ్‌గిరి, మేడ్చల్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా... తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని ఇతర ప్రాంతాలకు చెందిన పౌరులు నివసిస్తున్నారు. అందుకే ఈ నియోజకవర్గాన్ని మినీ భారత్‌గా అభివర్ణిస్తుంటారు. 2009లో జరిగిన ఎన్నిల్లో ఇక్కడి నుంచి కాంగ్రెస్ తరఫున విజయం సాధించిన సర్వే సత్యనారాయణ.. ఆ తర్వాత కేంద్ర మంత్రిగా వ్యవహరించారు. 2014లో ఇక్కడి నుంచి టీడీపీ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి గెలుపొందారు. అనంతరం ఆయన బీఆర్ఎస్‌లో చేరగా.. 2018 ముందస్తు అసెంబ్లీ ఎన్నికల తర్వాత మంత్రి అయ్యారు. ఇక, 2019 లోక్‌సభ ఎన్నికల్లో మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డిని బీఆర్ఎస్ బరిలో దింపింది. అయితే, కొడంగల్‌లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ఓడిపోయిన రేవంత్‌రెడ్డి.. ఇక్కడి నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించారు. నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి మూడు పర్యాయాలు ఎన్నికలు జరగ్గా.. రెండు సార్లు కాంగ్రెస్, ఒక సారి టీడీపీని ఇక్కడి ప్రజలు ఆదరించారు. పలు సామాజికవర్గాల ఓట్లూ ఇక్కడ కీలకంగా ఉన్నాయి. ఈ క్రమంలో ప్రధాన పార్టీల నేతలు ఎవరికి వారు సానుకూలంగా లెక్కలు వేసుకుంటున్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉందన్న అంశాన్ని ఇక్కడి ఓటర్లు పట్టించుకోరని, జాతీయ స్థాయి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆయా అభ్యర్థులను ఆదరిస్తుంటారని ఓ సీనియర్ నేత అభిప్రాయపడ్డారు. అందుకే ఇక్కడి నుంచి ఎలాగైనా బరిలో దిగాలని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లోని ముఖ్య నేతలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.



అన్నారం బ్యారేజీ ఖాళీ

ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాలతో ఫౌండేషన్ టెస్టుల కోసం చర్యలు

నేడు బ్యారేజీని సందర్శించనున్న ఎన్‌డీఎస్ఏ బృందం

మహదేవపూర్, ఫిబ్రవరి 18: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన అన్నారం (సరస్వతీ) బ్యారేజీ నుంచి పూర్తిగా నీటిని కిందకు విడుదల చేశారు. శనివారం ఉదయం వరకు 2.06 టీఎంసీల నీరు నిల్వ ఉండగా అదే రోజు 10 గేట్లను ఎత్తి 7వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఆదివారం ఐదు గేట్లను ఎత్తి మొత్తం నీటిని బయటకు పంపారు. దీంతో బ్యారేజీ ఖాళీ అయిపోయింది. మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7లో 20వ పిల్లరు కుంగిన నేపథ్యంలో అన్నారం, సుందిళ్ల, బ్యారేజీల్లోనూ నాణ్యత లోపించి ఉండొచ్చని భావించిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) బ్యారేజీల్లో నీటిని ఖాళీ చేసి ఫౌండేషన్ టెస్టులు చేయాలని అధికారులకు సూచించింది. దీంతో అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ ఆఫ్కాన్ కంపెనీ ఆధ్వర్యంలో ఢిల్లీకి చెందిన పార్సన్ కంపెనీతో ఫౌండేషన్ టెస్టులు చేయించనున్నారు. ఈ నేపథ్యంలోనే బ్యారేజీలో నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. కాగా సరస్వతీ బ్యారేజీని ఎన్‌డీఎస్ఏ బృందం సోమవారం సందర్శించనుంది. మేడిగడ్డ బ్యారేజీలాగే అన్నారం బ్యారేజీలోనూ సమస్యలు ఉత్పన్నమైన నేపథ్యంలో దాన్ని పరిశీలించేందుకు రానుంది. ఈ బృందంతోపాటు రాష్ట్రానికి చెందిన ఈఎన్సీ అనిల్‌కుమార్, రామగుండం సర్కిల్ సీఈ సుధాకర్, పలువురు ఇంజనీరింగ్ అధికారులు అన్నారం బ్యారేజీని పరిశీలించనున్నారు.

నోటికాడ కూడు లాగేస్తున్నారు!

» పింఛను సొమ్ములో ఇంటి పన్ను పేరిట కోతలు

మర్పల్లి, ఫిబ్రవరి 18: నోటి కాడ కూడు లాగేసుకోవడం అంటే ఇదేనేమో..!! వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూళ్లకు బరి తెగించారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ప్రభుత్వం నెలనెలా ఇచ్చే పింఛను సొమ్ములో అనధికారికంగా కోతలు పెడుతున్నారు. పింఛను కోసం పంచాయతీ కార్యాలయానికి వచ్చిన వారికి సంబంధించిన ఇంటి పన్ను సొమ్మును మినహాయించుకుని మిగిలిన అరకొర మొత్తాన్ని చేతిలో పెడుతున్నారు. మా కుటుంబసభ్యులు పన్ను చెల్లిస్తారని చెప్పినా ససేమిరా అంటున్నారు. దీంతో పింఛను సొమ్ముపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కొందరు లబోదిబోమంటున్నారు. ఇలా మర్పల్లి మండలం కల్కోడ గ్రామంలో దాదాపు 50% మంది పింఛన్ లబ్ధిదారుల సొమ్ము నుంచి రూ.60 వేలకు పైగా మొత్తాన్ని ఇంటి పన్నుల కింద వసూలు చేశారు. కొందరు లబ్ధిదారుల వద్ద పింఛను సొమ్ము మొత్తాన్ని లాగేసుకున్న ఘటనలు ఉన్నాయి. మండలంలోని ఇతర గ్రామ పంచాయతీల్లో కూడా ఈ విధానం అమలు అవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శులు ఇలా పింఛను సొమ్మును లాగేసుకోకుండా చర్యలు తీసుకోవాలని పింఛనుదారులు వేడుకుంటున్నారు.

రూ.16 చేతిలో పెట్టారు : ఈర్లపల్లి రాచయ్య

నా ఇద్దరు కొడుకులకు ఇంటి పంపకాలు చేశా. ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే పింఛనే నాకు ఆధారం. ఒకటో తేదీన కల్కోడ గ్రామ పంచాయతీ దగ్గరికి వెళితే ఇంటి పన్ను రెండు వేలు ఉందని పింఛన్ డబ్బుల్లో దాన్ని వినహాయించి రూ.16 చేతికి ఇచ్చారు. ప్రాధేయపడినా పట్టించుకోలేదు.

అల్లం, ఎల్లిగడ్డ మస్తు పిరం!

» వెల్లుల్లి ధర కిలో చికెన్ కన్నా రెట్టింపు

» రూ.400 నుంచి 480 దాకా.. అల్లం రూ.300-320

» ధరాఘాతంతో వంటల్లో వాడకం తగ్గింపు

సిద్దిపేట అగ్రికల్చర్, హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18: అర్జెంటుగా వంటల్లోకి అవసరమై పొరుగింటోళ్లను చనువుకొద్దీ ఓ వెల్లుల్లి గడ్డనో, అల్లం ముక్కనో అడిగే పరిస్థితి లేదు. మొహమాటం కొద్దీ అడిగినా వారు మనవైపు చురచురా చూసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అంతలా మండుతున్నాయి వెల్లుల్లి, అల్లం ధరలు!! మునుపు కిలోలకొద్దీ వెల్లుల్లి కొన్న కస్టమర్లే ఇప్పుడు పావుకిలో కొనేందుకే వెనుకాముందు ఆలోచిస్తున్నారు. మంగళవారం సిద్దిపేట రైతు బజార్లో వెల్లుల్లి కేజీ రూ. 280, అల్లం రూ.200 విక్రయించారు. బహిరంగ మార్కెట్‌లో కిలో వెల్లుల్లి ధర గ్రేడును బట్టి రూ.300 నుంచి రూ.400 వరకు అమ్ముతున్నారు. హైదరాబాద్ రైతు బజార్లలోనైతే కేజీ వెల్లుల్లి నాణ్యతను బట్టి రూ.400 నుంచి రూ.480 దాకా ఉంది. అల్లం ధర కిలో రూ.300-320 ఉంది. సిద్దిపేటలో అక్టోబరు, నవంబరు నెలల్లో కిలో వెల్లుల్లి ధర రూ. 150-200 లోపే ఉండగా ప్రస్తుతం కిలో చికెన్ ధర కంటే రెట్టింపు కావడంతో సామాన్యులు వెల్లుల్లిని కొనలేని పరిస్థితి నెలకొంది. కూరగాయల మార్కెట్‌కు వెళుతున్న వినియోగదారులు వెల్లుల్లి ధర విని వామ్మో అంటున్నారు. ధరలు పెరగడంతో వంటల్లో అల్లం, వెల్లుల్లి వాడకాన్ని జనం తగ్గించేశారు.

దిగుబడి తగ్గడంతోనే

అల్లం, వెల్లుల్లిని కర్ణాటక, మహారాష్ట్రతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడ కూడా వర్షాభావ పరిస్థితులతో పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో చాలా తక్కువగానే వెల్లుల్లి సాగవుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజులలో వెల్లుల్లి మరింత ప్రియం అవుతుందని అంటున్నారు.



ఇంత రేట్లు ఎప్పుడూ లేవు

నేను దాదాపు 20ఏళ్ల నుంచి అల్లం, ఎల్లిగడ్డ, ఉల్లిగడ్డ వ్యాపారం చేస్తున్నా. కిలో వెల్లుల్లి రూ.280, అల్లం లోకల్ అయితే రూ.200 చొప్పున అమ్ముతున్నా. గతంలో అల్లం, ఎల్లిగడ్డ రేట్లు ఇంతగా ఎప్పుడూ లేవు. రేట్లు పెరగడంతో కొనుగోళ్లు తగ్గాయి.

- లక్ష్మి, చిరు వ్యాపారి, సిద్దిపేట

వైద్యశాఖ అధికారులపై ఏసీబీ నజర్!

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు, సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లపై ఏసీబీ నిఘా పెట్టినట్లు సమాచారం. కొందరి జాబితాను కూడా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మందుల కొనుగోళ్ల నుంచి శానిటేషన్, డైట్ వరకు ప్రతిదాంట్లో కొందరు అందినకాడికి దోచేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో నల్లగొండ జిల్లా బోధనాస్పత్రి సూపరింటెండెంట్ లచ్చునాయక్ నాన్ సర్జికల్ టెండర్, సర్జికల్ డ్రగ్స్ సరఫరా చేసే కాంట్రాక్టరు నుంచి రూ.3 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయారు. శుక్రవారం ఆయన్ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. కొత్తగూడెం మెడికల్ కాలేజీ అనుబంధ ఆస్పత్రి సూపరింటెండెంట్ కుమారస్వామిపైనా అవినీతి ఆరోపణలొచ్చాయి. దీనిపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి ఆయన్ను వైద్యవిద్య సంచాలకుల కార్యాలయానికి సరెండర్ చేశారు. సూర్యాపేట బోధనాస్పత్రి సూపరింటెండెంట్ మురళీధర్‌రెడ్డిపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. నివేదిక అనంతరం అయనపైనా చర్యలు తప్పవని వైద్యవర్గాలు వెల్లడించాయి. నిజామాబాద్ బోధనాస్పత్రి సూపరింటెండెంట్‌పై కొవిడ్ సమయంలో ఆస్పత్రిలో ఉన్న రెమ్‌డెసివర్ ఇంజెక్షన్లను ప్రైవేటులో అమ్ముకున్నారన్న తీవ్ర ఆరోపణలున్నాయి.



స్వాహా ఎలా చేస్తున్నారంటే...

ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుబంధ ఆస్పత్రులుంటాయి. అందులో మూడు విభాగాల్లో అధికారులు అక్రమాలకు పాల్పడేందుకు అవకాశం ఉంటుంది. శానిటేషన్, డైట్ బిల్లులు, మందుల కొనుగోళ్ల వ్యవహారంలో అవినీతి చోటు చేసుకుంటుంది. ప్రతి బోధనాస్పత్రిలో పడకల సంఖ్య ఆధారంగా మ్యాన్‌పవర్ ఉండాలి. ఉదాహరణకు వంద పడకలుంటే ఆస్పత్రిలో 45 మంది పారిశుధ్య కార్మికులుండాలి. వారు మూడు షిఫ్టుల్లో పని చేయాలి. ఆస్పత్రిలో వెయ్యి పడకలుంటే గనక 450 మంది స్టాఫ్ అవసరం ఉంటుంది. ఇక్కడే మ్యాన్‌పవర్ ఏజెన్సీలు, ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎమ్‌వో), అడిషన్ డైరెక్టర్స్ (ఏడీ)లు అంతా కలసి మిలాఖత్ అవుతున్నారు. 450 మంది ఉండాల్సిన చోట 50 నుంచి 100 మందిని తక్కువగా నియమించుకుంటున్నారు. వేతనాలు మాత్రం అంతమందికి ఇస్తున్నట్లు క్లెయిమ్ చేస్తారు. వాస్తవానికి మెజారిటీ ఆస్పత్రుల్లో ఎక్కడా పడకల సంఖ్య ఆధారంగా పారిశుధ్య కార్మికులు పనిచేయడం లేదన్నది బహిరంగ రహస్యం. లెక్కల్లో మాత్రం అంతమంది శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ సిబ్బంది ఉన్నట్లు చూపుతారు. వారి పేరిట వేతనాలను నొక్కేస్తున్నారు. అంతేకాదు వారికిచ్చే వేతనాల్లో కూడా వెయ్యి తగ్గించి ఇస్తున్నారు. ఇక ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ కట్టే విషయంలోనూ అంతే. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ నర్సులకూ పనికి తగ్గ వేతనమివ్వడం లేదు. నెలలో ర్యాండమ్‌గా ఒకట్రెండు రోజులు గైర్హాజరవుతున్నట్లు చూపుతున్నారు. తాము హాజరయ్యామని చెబితే.. ఆరోజు సాంకేతిక కారణాల వల్ల హాజరుపడలేదని, ఆ ఒక్క రోజు వేతనాన్ని తర్వాత ఇస్తామంటారు. కానీ ఎన్నడూ ఇవ్వరు. గాంధీ ఆస్పత్రిలో ఇలాంటి ఘటనలు కోకొల్లలు. అక్కడ పనిచేసే వందలమంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ నర్సులకు ఏదో ఒక సాకుతో తక్కువ వేతనం ఇస్తున్నారు. గట్టిగా అడిగితే ఉద్యోగం ఊడుతుందన్న బెదిరింపులు ఎదుర్కొంటున్నామని నర్సులు చెబుతున్నారు. ఆస్పత్రుల్లోని రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు, మ్యాన్‌పవర్ ఏజెన్సీ కాంట్రాక్టర్లతో కుమ్మక్కయి ఇలాంటి దందాలకు పాల్పడుతున్నారు. కొన్నిచోట్ల సూపరింటెండెంట్లు భాగస్వాములవుతున్నారు. రోగులకిచ్చే డైట్‌లోనూ ఇదే తంతు నడుస్తోంది. ఆస్పత్రుల్లోని ఇన్‌పేషంట్స్‌కు ఉచితంగా మూడు పూటలా ఆహారం ఇస్తారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రికి భోజనం లేదా చపాతి (రోగి పరిస్థితిని బట్టి) లాంటివి ఇస్తారు. సాధారణ డైట్‌కైతే ఒక్కోదానికి రూ.80, హైప్రొటీన్ డైట్‌కైతే రూ.112, డ్యూటీ వైద్యులకు రూ. 160 ఇస్తున్నారు. గర్భిణులకైతే కేంద్ర ప్రభుత్వ పథకం జననీ శిశు సురక్షా కార్యక్రమం (జేఎస్ఎస్‌కే) కింద డైట్ కోసం రూ. 100 ఇస్తున్నారు. రోగులకిచ్చే డైట్‌లో ప్రతిరోజూ ఒక్కో రకమైన మెనూ పాటించాలి. అయితే అసలు మెనూనే పాటించని బోధనాస్పత్రులు ఎన్నో ఉన్నాయి. కొన్ని ఆస్పత్రుల్లో 30 ఏళ్లుగా ఒకరిద్దరే డైట్ కాంట్రాక్ట్ చేస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మందులు కొనుగోళ్లలోనూ అవినీతి చోటు చేసుకుంటోంది. తెలంగాణ రాష్ట్ర మౌలిక సదుపాయాలభివృద్ధి సంస్థ(టీఎస్ఎంఎస్ఐడీసీ) ద్వారా ఆస్పత్రులకు ఔషధాలు సరఫరా అవుతాయి. కొన్ని అత్యవసర ఔషధాలను నాన్ టెండర్ల ద్వారా కొనుగోలు చేసే వెసులుబాటు ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు ఉంటుంది. నాన్ టెండర్స్ ద్వారా సరఫరా చేయించుకోవడం కోసం మెడికల్ షాపుల నుంచి పెద్దయెత్తున లంచాలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొందరు అధికారులకు ఫామ్‌హౌజ్‌లు

జిల్లాల్లోని డీఎంహెచ్‌వోల్లో కొందరు దీర్ఘకాలికంగా ఒకేచోట పాతుకుపోయారు. వీరిలో కొందరికి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఫామ్‌హౌజ్‌లున్నట్లు వైద్యవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఉత్తర తెలంగాణకు చెందిన ఓ బోధనాస్పత్రి సూపరింటెండెంట్‌కు ఏకంగా ఓ పెద్ద హోటలే ఉన్నట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా దీర్ఘకాలికంగా ఒకేచోట ఉన్న అధికారులపై వరుసగా ఫిర్యాదులొస్తున్నాయి.. కొన్ని జిల్లాల్లోని కొంత మంది డీఎమ్‌హెచ్‌వోలు ప్రతీ పనికి డబ్బులడుగుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలోని డిప్యుటేషన్లను రద్దు చేసింది. వారందరూ సొంత పోస్టింగ్స్‌కు వెళ్లిపోవాలని ఆదేశించింది. అత్యవసరం ఉన్నచోట పాతవారినే కొనసాగించాలన్న ఆదేశాలు కూడా సర్కారు ఇచ్చింది. దీన్నే కొందరు డీఎంహెచ్‌వోలు తమకు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. వైద్యులు, స్టాఫ్‌నర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, ఇతర అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది తాము వర్క్ ఆర్డర్‌పై పనిజేస్తున్న చోటనే కొనసాగాలంటే తమకు ఎంతోకొంత డబ్బులివ్వాలని డీఎంహెచ్‌వోలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపైనా కొందరు ప్రజారోగ్య సంచాలకుడికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఫోన్ కాల్ ఆడియో వైరల్

రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుడితో పాటు ఉమ్మడి మెదక్‌జిల్లాలోని ఓ డీఎంహెచ్‌వోపై ఓ ఆడియో టేపు వైద్య ఆరోగ్యశాఖలో కలకలం రేపుతోంది. మూడు నాలుగు రోజులుగా వైద్యశాఖలోని అయా ఉద్యోగుల వాట్సప్ గ్రూపుల్లో ఆ ఆడియో విపరీతంగా వైరల్ అవుతోంది. ఓ మహిళా ఉద్యోగి తన డిప్యుటేషన్, రిలీవ్ ఆర్డర్ల కొరకు ఇద్దరు అధికారులకు డబ్బులు చెల్లించానని, డబ్బు ఇస్తేనే డిప్యుటేషన్లు, వర్క్ ఆర్డర్స్ ఇస్తున్నట్లు.. వారికి కనీస మానవతా దృక్పథం లేదని ఆ ఆడియోలో సదరు మహిళా ఉద్యోగి మరో ఉద్యోగితో చెప్పుకొని వాపోయింది. టేబుల్‌పై డబ్బులతో కూడి కవర్లు పెడితేనే పనులు చేస్తున్నారంటూ ఆడియోలో ఓ మహిళా ఉద్యోగి పేర్కొంది. ఆ ఆడియో కూడా ఏసీబీ కి చేరినట్లు ఉన్నతాధికారుల్లో చర్చ జరుగుతోంది.

మేడారానికి గాలిమోటార్లోనూ..

21 నుంచి 25 వరకు హెలికాప్టర్ సేవలు.. 95,833తో హైదరాబాద్ నుంచి వెళ్లిరావొచ్చు

హనుమకొండ నుంచైతే రూ.28,999



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మేడారం మహా జాతరకు వెళ్లాలనుకుంటున్నారా? రోడ్డు, రైలు మార్గాల ద్వారా ట్రాఫిక్, రద్దీని తట్టుకొని గంటలకొద్దీ ప్రయాణం అని జంకుతున్నారా? కాస్త ఖర్చుకు వెనుకాడకపోతే.. ఈ ఇబ్బందులేవీ లేకుండా మేడారానికి అట్టే వెళ్లి.. ఇట్టే రావొచ్చు! వనదేవతలైన సమ్మక్క, సారలమ్మ దర్శనం కోసం మేడారానికి వెళ్లాలనే భక్తుల కోసం హెలికాప్టర్ సేవలూ అందుబాటులోకొచ్చాయి. హెలిటాక్సీ సంస్థ తెలంగాణ ప్రభుత్వం, బెంగళూరుకు చెందిన తుంబీ ఏవియేషన్ సహకారంతో హెలికాప్టర్ సేవలను అందించేందుకు సిద్ధమైంది. జాతర మొదలయ్యే ఈనెల 21 నుంచి 25వ తేదీ దాకా హెలికాప్టర్ సేవలు అందించనుంది. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుండటంతో హైదరాబాద్ నుంచి వరంగల్, ములుగు, మేడారానికి వెళ్లే దార్లు ట్రాఫిక్‌తో నిండిపోతున్నాయి. హనుమకొండ నుంచే రోడ్డు మార్గం ద్వారా మేడారానికి వెళ్లేందుకు 4-5 గంటలు పడుతుండటంతో జాతరకు త్వరగా వెళ్లి రావాలనుకునే భక్తులు హైదరాబాద్, హనుమకొండ నుంచి ఈ హెలికాప్టర్ సేవలు వినియోగించుకోవచ్చు. అలాగే అక్కడ 7 నిమిషాల పాటు ఆకాశం నుంచి జాతరను వీక్షేందుకు 'జాయ్‌రైడ్'ను కూడా హెలిటాక్సీ ఏర్పాటు చేసింది. టికెట్ల వివరాలను ఆ సంస్థ ఆదివారం వెల్లడించింది. హనుమకొండ- మేడారం-హన్మకొండ షటిల్ సర్వీసుల్లో ఒక్కరికి రూ.28,999 టికెట్ ధర ఉంది. ఈ ప్రయాణంలో భక్తులు హనుమకొండ నుంచి బయలుదేరి మేడారానికి హెలికాప్టర్‌లో దిగొచ్చు. అక్కడ వీఐపీ దర్శనం అనంతరం తిరిగి హనుమకొండలో దింపుతారు. 20 నుంచి 30 నిమిషాల్లో హనుమకొండ నుంచి మేడారానికి తీసుకెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు. అలాగే మేడారంలో ఏరియల్ వ్యూ (జాయ్‌రైడ్) కింద 7 నిమిషాలపాటు గాలిలో తిప్పేందుకు ఒక్కొక్కరికి రూ.4,300 తీసుకుంటారు. హైదరాబాద్ నుంచి మేడారానికి కూడా ప్యాకేజీని ప్రకటించారు. ఆరు సీట్ల సామర్థ్యం కలిగిన చాపర్‌లో ఒక్కరికి రూ.95,833 టికెట్ ధర ఉందని సంస్థ వెల్లడించింది. బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌ను నడిపించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. గిగిగి.ఏఉఔఐఖీఅగీఐఐ.ఙక వెబ్‌సైట్‌లోకి వెళ్లి టికెట్లను బుకింగ్ చేసుకోవచ్చునని, వివరాలకు 74834-32752, 94003-99999 నంబర్లలో సంప్రదించవచ్చుని సంస్థ తెలిపింది.



పాఠశాల ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ వివాదం

» శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మర్రి జనార్దన్‌రెడ్డి

» అధికారులపై ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి ఆగ్రహం

» పాఠశాలను ప్రారంభించకుండానే వెనుదిరిగిన ఎమ్మెల్యే

తాడూరు, ఫిబ్రవరి18: నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవం వివాదాస్పదంగా మారింది. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో తాను చదివిన పాఠశాల కావడంతో మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి తన ఎంజేఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.2.50 కోట్లతో నూతన భవనం, వంట గదిని నిర్మించారు. గత ప్రభుత్వ 'మన ఊరు మన బడి' పథకంలో భాగంగా రూ.50 లక్షలతో ప్రహరీ, మూత్రశాలలు నిర్మించారు. పనులు పూర్తవడంతో ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో ప్రారంభోత్సవం కోసం ప్రస్తుత ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డితోపాటు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి ఎంజేఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని ఆహ్వానించారు. ఆదివారం ఉదయం 11 గంటలకు జనార్దన్‌రెడ్డి సతీసమేతంగా పాఠశాలకు చేరుకున్నారు. తర్వాత ఎంపీపీ శ్రీదేవితో రిబ్బన్ కట్ చేయించాక పాఠశాల నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన శిలాఫలాకాన్ని జనార్దన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన వెళ్లిన కొంతసేపటికి ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి తన అనుచరులతో పాఠశాల ప్రాంగణానికి వచ్చారు. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే చేతులమీదుగా జరగాల్సిన ప్రారంభోత్సవాన్ని వేరేవారితో ఎలా చేయిస్తారంటూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఇన్‌చార్జ్ హెచ్ఎం చాంద్‌పాషా, డీఈవో గోవిందరాజులుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం పాఠశాలను ప్రారంభించకుండానే ఎమ్మెల్యే వెళ్లిపోయారు. దీంతో పాఠశాల ప్రారంభోత్సవాన్ని రద్దు చేసినట్లు జిల్లా విద్యాధికారి గోవిందరాజులు విలేకరులకు తెలిపారు. మర్రిజనార్దన్‌రెడ్డి తన అనుచరులతో ముందే వచ్చి పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వద్దన్నా విన కుండా వారు తెచ్చుకున్న రిబ్బన్‌ను గేటుకు కట్టి ప్రారంభించారన్నారు.

మాజీ ఎమ్మెల్యే మర్రిపై కేసు నమోదు

పాఠశాల ప్రారంభోత్సవం వివాదం నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వర్గీయుల మధ్య వివాదంపై పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం చాంద్‌పాషా ఆదివారంరాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు తెలియకుండా రిబ్బన్ ఏర్పాటు చేసి కత్తిరించారని, దీంతో తమకు సంబంధంలేదన్నారు.

పగిడిద్దరాజు ఆలయాన్ని అభివృద్ధి చేస్తా: సీతక్క



గంగారం (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 18: గిరిజనుల ఆరాధ్య దైవం, సమ్మక్క పెనివిటి పగిడిద్దరాజు కొలువై ఉన్న ఆలయాన్ని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలోని పగిడిద్దరాజు ఆలయానికి ఆదివారం సీతక్క విచ్చేశారు. స్వామివారికి తీసుకువచ్చిన పట్టువస్త్రాలను మేడారం సమ్మక్క, సారలమ్మ ఆలయం బోర్డు ఛైర్మన్ లచ్చు పటేల్ ద్వారా ప్రధాన తలపతి (అర్చకుడు) పెనక రాజేశ్వర్‌కు అందచేశారు. అనంతరం ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మారుమూలన ఉన్న పగిడిద్దరాజు ఆలయాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామని, భక్తులకు అవసరమైన మంచినీటి వసతిని యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని విషన్ భగీరథ ఏఈ నరేశ్‌ను ఆదేశించారు. భగీరథ నుంచి నీరు రానిపక్షంలో బోరు బావుల నుంచైనా ఆలయానికి మంచినీరు వసతి ఏర్పాటు చేయాలన్నారు. పగిడిద్దరాజు ఉండే వనం గుట్టకు ఇనుప కంచె ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. వనం వరకు రోడ్డు ఏర్పాటు చేస్తానన్నారు. ఈ ఏడాది పగిడిద్దరాజుని పెళ్లి కుమారుడిగా అధికార లాంఛనాలతో సమ్మక్క గద్దెకు తీసుకు వెళ్తామని చెప్పారు. కాగా పూనుగొండ్ల నుంచి దుబ్బగూడెం వరకు రహదారి, పూనుగొండ్ల నుంచి కరుణగండి మీదుగా కొత్తగూడకు బీటీ రోడ్డు ఏర్పాటుకు చేయాలని మంత్రికి గిరిజనులు వినతి పత్రమిచ్చారు.

కూర్చోడానికి కుర్చీల్లేవు.. కార్యాలయ భవనం లేదు!

స్పెషల్ డ్రైవ్స్ చేపట్టేందుకు తగిన సిబ్బంది లేమి

యాంటీ నార్కోటిక్స్ విభాగం టీ-న్యాబ్ దుస్థితి

స్మగ్లర్లను పట్టుకుంటే.. విచారించేదెక్కడ??

ఇలా అయితే.. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపడమెలా!!

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): "డ్రగ్స్ స్మగ్లర్లను తెలంగాణ నుంచి తరిమి కొట్టాలి. వారి వెనక ఎంతటి వారున్నా.. పీచమణచాల్సిందే.!" ఇదీ తెలంగాణ ప్రభుత్వ ప్రాధామ్యం.! పోలీసుశాఖ కూడా.. తెలంగాణను మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు శతవిధాలా ప్రయతిస్తోంది.! అడపాదడపా డ్రగ్స్ మూకలకు ముకుతాడు వేస్తూ.. మూలాలకు వెళ్లి మరీ అరెస్టులు చేస్తోంది. అయితే.. కొత్తగా ప్రారంభమైన యాంటీ నార్కోటిక్స్ వింగ్-- తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ బ్యూరో(టీ-న్యాబ్) వనరుల విషయంలో బాలారిష్టాలను దాటడం లేదు.

సిబ్బంది లేమితో సతమతం

నిజానికి టీ-న్యాబ్ ఏర్పాటుకు ముందే.. ప్రభుత్వం వెయ్యి మంది మెరికల్లాంటి సిబ్బంది నియమించాలని ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలో ప్రత్యేకంగా నాలుగు నార్కోటిక్స్ పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే హెచ్-న్యూ విభాగం ఉండగా.. సైబరాబాద్(సంగారెడ్డి, సైబరాబాద్ కలిపి), రాచకొండ(నల్లగొండ, సూర్యాపేట్, రాచకొండ కలిపి), వరంగల్ (వరంగల్ కమిషనరేట్, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, భద్రాద్రి జిల్లాలు కలిపి) కమిషనరేట్స్ పరిధిలో మరో మూడు ఠాణాలు ఏర్పాటవ్వాల్సి ఉంది. టీ-న్యాబ్‌కు ఇప్పటికే నలుగురు ఎస్పీలు, ఒక అదనపు ఎస్పీ, 15 మంది డీఎస్పీలను కలిపి మొత్తం 300 మంది సిబ్బందిని కేటాయించారు. హెచ్-న్యూ విభాగాన్ని టీ-న్యాబ్‌లో విలీనం చేశారు. అయితే.. సిబ్బంది లేమి, కార్యాలయ భవనం లేకపోవడంతో ఇప్పుడు ఈ విభాగం కునారిల్లుతోంది. ఉన్నతాధికారులు కూర్చోవడానికి సరిపడా కుర్చీలు లేకపోవడం గమనార్హం.! ఇక ఇన్‌స్పెక్టర్ల పరిస్థితి వర్ణనాతీతం. వారంతా సెంట్రల్ జోన్ మహిళా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న హెచ్-న్యూ సెల్‌లో కూర్చుంటున్నారు. ఇతర ఉన్నతాధికారులు బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కాలం గడుపుతున్నారు. స్మగ్లర్ల సమాచారం అందినా.. వెనువెంటనే దాడులు నిర్వహించి, వారిని కటకటాల వెనక్కి నెట్టేలా తగినంత సిబ్బంది లేరు. ఈ విభాగంలో ఎస్సైలు, కానిస్టేబుళ్ల సంఖ్య ఇంకా పెరగాల్సి ఉంది.

ఇతర వసతులూ అంతంతే..

సమాచారం అందిపుచ్చుకోవడానికి టీ-న్యాబ్ విభాగానికి ప్రత్యేక వీహెచ్ఎఫ్ సెట్లు లేవు. కేవలం పోలీసు సీయూజీ సెల్‌ఫోన్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. కనీస మౌలిక సదుపాయాలు లేక.. సిబ్బంది ఇక్కట్లపాలవుతున్నారు. అద్దె భవనాలను కేటాయించినా.. కొంతమేర ఉపయుక్తంగా ఉంటుందని, ప్రభుత్వం ఆ దిశలో చర్యలు తీసుకుంటే తప్ప.. రాష్ట్రాన్ని డ్రగ్స్-ఫ్రీగా మార్చాలనే లక్ష్యాన్ని వేగంగా అందుకోలేరనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ఫోన్, నంబరు మార్చేసినా.. సైబర్ నేరగాళ్ల గుప్పిట్లోనే ఖాతా!

» 3 నెలల క్రితం ఓ రిటైర్డ్ ఉద్యోగి ఫోన్‌కు మెసేజ్

» లింక్ క్లిక్ చేసి.. కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని సారాంశం

» పాన్ నంబరు, ఓటీపీ చెప్పడంతో 9.38 లక్షలు గాయబ్

» మిగిలిన డబ్బును కాపాడేందుకు బాధితుడి ఖాతా ఫ్రీజ్

» కొత్త ఫోన్, కొత్త నంబరు తీసుకొని లింక్ చేశాకే అన్‌ఫ్రీజ్

» రెండ్రోజులకు ఖాతాల్లోంచి మరో 6.38 లక్షలూ మాయం



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అప్పటికే ఆ పెద్దాయన్ను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు క్షణాల్లో లక్షల్లో డబ్బు కొట్టేశారు. కొంత మిగిలి వుండటంతో ఆ డబ్బునైనా కాపాడేందుకు వెంటనే ఖాతాను స్తంభింపజేశారు! ఇది జరిగి మూడు నెలలైంది! బ్యాంకు సిబ్బంది, పోలీసుల సూచన మేరకు ఆ పెద్దాయన తన ఫోన్‌ను మార్చారు. పాత నంబరును పక్కన పడేసి కొత్త నంబరుతో కూడిన సిమ్ తీసుకున్నారు. ఆ తర్వాతే ఖాతాను అన్‌ఫ్రీజ్ చేశారు! చిత్రం ఏమిటంటే.. ఇది జరిగిన రెండ్రోజుల్లోనే ఆ పెద్దాయన ఖాతాలోంచి మిగిలిన డబ్బూ పోయింది! మొత్తంగా మూడు నెలల్లో రూ.15.76 లక్షలు సైబర్ నేరగాళ్ల పాలయ్యాయి. బాధితుడు నగరంలో ఉంటున్న కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి. నెలనెలా పింఛను డబ్బు యూనియన్ బ్యాంకు ఖాతాలో పడుతోంది. 3 నెలల క్రితం ఆయన ఫోన్‌కు ఒక ఎస్సెమ్మెస్ వచ్చింది. 'కింద ఉన్న లింక్‌ను క్లిక్ చేసి మీ బ్యాంకు ఖాతా కేవైసీ అప్‌డేట్ చేసుకోండి.. లేదంటే మీ ఖాతా బ్లాక్ అవుతుంది' అనేది దాని సారాంశం. బ్యాంకు నుంచి వచ్చినట్లుగానే మెసేజ్ ఉండటంతో చూసిన ఆయన భార్య.. లింక్ ఓపెన్ చేసింది. అక్కడ వారు అడిగిన వివరాలతో పాటు.. పాన్‌కార్డు అప్‌డేట్ చేసింది. ఓటీపీలు ఎంటర్ చేసింది. కొద్దిసేపటి తర్వాత విడతలవారీగా ఆ పెద్దాయన ఖాతాలోంచి 9.38లక్షలు కట్ అయ్యాయి. కంగుతిన్న వృద్ధ దంపతులు వెంటనే బ్యాంకుకు వెళ్లి ఆరాతీశారు. అది సైబర్ నేరగాళ్ల పని అని, మోసపూరితమైన లింకులు పంపి, అది ఓపెన్ చేయగానే ఖాతాను హ్యాక్ చేసి డబ్బులు దోచేశారని వారికి సిబ్బంది చెప్పారు. తాము బ్యాంకు నుంచి ఎలాంటి మెసేజ్‌లు పంపలేదని స్పష్టం చేశారు. అక్కడి నుంచి ఆ దంపతులు.. సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. పోలీసులు 1930కు కాల్ చేసి సైబర్ నేరగాళ్లు డబ్బులు బదిలీ చేసుకున్న ఖాతాలను ఫ్రీజ్ చేయించారు. అవసరాలకు డబ్బు అవసరం పడటంతో.. ఇటీవల బాధితులు పోలీసుల వద్దకు వెళ్లి ఫ్రీజ్ చేసిన తమ బ్యాంకు ఖాతాను అన్‌ఫ్రీజ్ చేయాలని కోరారు. సైబర్ నేరగాళ్లు మళ్లీ డబ్బు దోచేయకుండా ఉండాలంటే కొత్త ఫోన్ తీసుకోవాలని, పాత సిమ్‌ను మార్చేసి.. కొత్త ఫోన్ నంబరును తీసుకోవాలని చెప్పడంతో బాధితులు అలాగే చేశారు. కొత్త నంబరును బ్యాంక్ ఖాతాకు లింక్ చేసిన తర్వాతే పోలీసుల అనుమతితో బ్యాంకు ఖాతాను అన్‌ఫ్రీజ్ చేయించారు. అయితే బ్యాంకు ఖాతా తిరిగి ఓపెన్ చేసిన రెండు రోజుల్లోనే సైబర్ నేరగాళ్లు బాధితులతో ఎలాంటి సంబంధం లేకుండానే ఎలాంటి మెసేజ్‌లు, ఓటీపీలు రాకుండానే ఖాతాలో ఉన్న మరో 6.38లక్షలు నాలుగు విడతల్లో కొల్లగొట్టారు. వృద్ధ దంపతులు అప్రమత్తమయ్యేలోపే ఆ డబ్బుంతా పదుల సంఖ్యలో వివిధ ఖాతాలకు మళ్లించారు. ఫలితంగా సైబర్ క్రైమ్ సిబ్బందికి ఫ్రీజ్ చేసే అవకాశం లేకుండా చేశారు. అయితే ఫోన్ నంబర్‌తో పాటు.. ఫోన్‌ను కూడా మార్చినా ఖాతాలో డబ్బులు సైబర్ నేరగాళ్లు ఎలా కొల్లగొట్టారో అంతు చిక్కడంలేదని పోలీసులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*